78678 / 47629

JANAHARSHA GROUP OF COMPANIES · PEOPLE WITH COMMITMENT


# JANAHARSHA
## GROUP OF COMPANIES

**REAL ESTATE • CONSTRUCTIONS • CHITFUND**
**FARMLANDS • RESORTS • PUBLISHERS**




| Central Office : | Branch 1 : | Branch 2 : | Branch 3 : | Branch 4 : | Branch 5 : | Branch 6 : | Chitfund: | Vijayavihaaram: |
|---|---|---|---|---|---|---|---|---|
| 12-5 149/17, Opp | 3-121/A, Opp | 12-5-149/17, | 104, Datta Sai Cmplx, | 11-5-435, | 5-10-194, Chakrapani Estates, Opp Old Police Control Room | 113, Jamuna Towers, | 12-5-33/2, | 12-5-33/2, |
| Rly Degree College, | Annapurna Complex | Opp Rly Degree | Opp Sapthagiri, | Red Hills Road, | **Saifabad,** | Nalgonda X Rds , | Vijayapuri, | Vijayapuri, |
| Tarnaka, Secbad 17 | **Dilsukhnagar,** | College, **Tarnaka,** | **R.T.C. 'X' Roads,** | **Lakdi-ka-pul,** | Hyderabad - 04 | **Malakpet,** | **Tarnaka,** | **Tarnaka,** |
| ☎ : 2701 5925 | Hyderabad - 60 | Sec'bad - 17 | Hyderabad - 20 | Hyderabad - 04 | ☎: 5557 7430 | Hyderabad - 36 | Sec'bad - 17 | Secbad - 17 |
| FAX 2700 2240 | ☎: 2404 8777 | ☎ : 2700 0206 | ☎: 2766 0331 | ☎ : 2339 7106 | | ☎: 2455 8105 | ☎ : 2701 5918 | ☎ : 2700 7053 |

'విజయవిహారం' సమర్పణ




## మనం విస్మరిస్తున్న మన తరం వీరుడు

# కీర్తిచక్ర పందిళ్ళపల్లి శ్రీనివాస్

రచన : రమణమూర్తి,
ఎడిటర్, విజయవిహారం

జనహర్ష పబ్లిషర్స్ ప్రై. లి.
12-5-33/2, విజయపురి, తార్నాక, సికింద్రాబాద్-500 017.
ఫోన్ : 040-27007053, సెల్ : 98480 19076,
Fax 27002240. e-mail vv@vijayavihaaram.com

మనం విస్మరిస్తున్న మన తరం వీరుడు

# కీర్తిచక్ర పందిళ్లపల్లి శ్రీనివాస్

ప్రచురణ నెం. : 1
ముద్రణ : సెప్టెంబరు, 2003
వెల : రూ. 35/-

© సర్వ హక్కులు రచయితవి

వివరాలకు : జనహర్ష పబ్లిషర్స్ ప్రై. లి. 12-5-33/2, విజయపురి, తార్నాక,
సికింద్రాబాద్ - 500 017. ఫోన్ : 27007053, సెల్ : 98480 19076

ప్రతులకు : జనహర్ష పబ్లిషర్స్ ప్రై. లి. 12-5-33/2, విజయపురి, తార్నాక,
సికింద్రాబాద్ - 500 017. ఫోన్ : 27007053, సెల్ : 98480 19076
విశాలాంధ్ర బుక్ హౌస్, అబిడ్స్, హైద్రాబాద్. మరియు అన్ని బ్రాంచీలు.
ప్రజాశక్తి బుక్ హౌస్, చిక్కడపల్లి, హైద్రాబాద్. మరియు అన్ని బ్రాంచీలు.
దిశ బుక్ సెంటర్, చిక్కడపల్లి, హైద్రాబాద్.
నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురుగా, కాచీగూడ, హైద్రాబాద్.
నవయుగ బుక్‌హౌస్, సుల్తాన్ బజార్, కోఠి, హైద్రాబాద్. మరియు బ్రాంచీలు.
మరికొన్ని పుస్తక కేంద్రాలు.

ముద్రణ : ఆకృతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్, చిక్కడపల్లి, హైద్రాబాద్.
ఫోన్ : 27664525

ప్రచురణ : జనహర్ష పబ్లిషర్స్ ప్రై. లి. 12-5-33/2, విజయపురి, తార్నాక,
సికింద్రాబాద్ - 500 017. ఫోన్ : 27007053, సెల్ : 98480 19076.



**అంకితం**

అమరవీరుడి తల్లి తండ్రులు
అనంతరావు, జయలక్ష్మి
దంపతులకు...

# విషయసూచిక

శ్రీనివాస్ గురించి ప్రస్తావించగలగడం
విజయవిహారం అందుకున్న ఒక గౌరవం 6

మనం విస్మరిస్తున్న మన తరం వీరుడు
కీర్తిచక్ర పందిళ్ళపల్లి శ్రీనివాస్ 12

<u>అనుబంధం-1</u>
ప్రతీ నేరస్థుడికీ ఒక వాదన వుంటుంది.
('గంధపు చెక్కల వీరప్పన్' పుస్తక సమీక్ష) 43

<u>అనుబంధం-2</u>
వ్యక్తులంటే వ్యవస్థలో జరిగే విస్తృత ఘర్షణల పనిముట్లే
(హైదరాబాద్ బుక్ ట్రస్ట్ సమాధానం) 62

<u>అనుబంధం-3</u>
వీరప్పన్ వ్యవస్థతో తలపడే వీరుడంటే
ఇంక మాట్లాడేదేముంది?
(సమీక్షకుని స్పందన) 66

SARASWATA NIKETANAM VETAPALEM

...మన తెలుగు ప్రజల దురదృష్టమేమిటంటే – అటువంటి మహనీయ మూర్తి త్యాగమయ, వీరోచిత జీవిత ఘట్టం, – సమకాలీన చరిత్రలో, మన కళ్లముందే ఆవిష్కృతమైనా – గుర్తించలేనంత అంధులమైపోయాం మనం. వర్తమాన, భావికాలాల యువతరానికి అపూర్వమైన స్ఫూర్తిని అందించగల శ్రీనివాస్ జీవితం, కేవలం ఒకరోజు పత్రికలో మొదటిపేజీ వార్త అయింది – మన దుర్భాగ్య ఆంధ్ర దేశానికి. అంతకు మించి మరేమీ కాలేదు...
... వీరుల త్యాగాల్ని విస్మరిస్తే, జాతిలో, వినాశనకరమైన ముసలం జన్మించకుండా ఎవరు ఆపగలరు?...

# శ్రీనివాస్ గురించి ప్రస్తావించగలగడం విజయవిహారం అందుకున్న ఒక గౌరవం

2000 సంవత్సరం జూలై చివరివారంలో 'నక్కీరన్' ఎడిటర్ గోపాల్ హైద్రాబాద్ వచ్చి 'వీరప్పన్'కి సంబంధించిన పుస్తకాన్నొకదాన్ని విడుదల చేసినట్టుగా పత్రికల్లో వార్తలు వచ్చాయి. అప్పటికి విజయవిహారం పత్రిక ప్రారంభమై 6 నెలలు దాటింది. ఆదినుంచి వరస సంచలనాలతో కలకలంరేపుతున్న పత్రికగా విజయవిహారం అప్పటికే పేరు తెచ్చు కుంది. 'వీరప్పన్' మీద పుస్తకం అనగానే, అదేమిటో చూడాలనే ఆసక్తి మాకూ కలిగింది.

ఆ పుస్తకాన్ని తెప్పించి చూద్దామని నేను అనుకుంటున్నాను. ఈలోగా ఒకరోజు రాత్రి మా విజయవిహారం టీమ్‌కి ఎంతో ఆప్తులైన రావెల సోమయ్యగారు ఫోన్ చేసి మాట్లాడుతున్నపుడు 'వీరప్పన్' పుస్తకం ప్రస్తావన వచ్చింది. సోమయ్యగారు అప్పటికే ఆపుస్తకం కొని చదివారు, చాలా మటుకు ప్రభావితం అయ్యారు. వీరప్పన్ గాంధీ నుంచి కూడా ఉత్తేజితుడయ్యాడని, అతడు కూడా కొన్ని సామాజిక అవసవ్య విధానాలమీదే పోరాడుతున్నాడని ఆయన నాతో అన్నారు.

వీరప్పన్‌కి సంబంధించి పత్రికల్లో వస్తున్న సమాచారాన్ని నేను ఒక పాఠకుడిగా అంతోఇంతో ఆసక్తిగానే చదివేవాడిని. 1991 నవంబర్‌లో వీరప్పన్ అత్యంత క్రూరంగా, వంచనతో పందిళ్ళపల్లి శ్రీనివాస్‌ని వధించిన సంఘటన ఒక గాఢమైన జ్ఞాపకం. ఆ తర్వాత మే 6-20, 1993లో 'ఇండియా టుడే' పత్రికలో శ్రీనివాస్ హత్యని గురించి

ప్రస్తావిస్తూ వీరప్పన్ స్వయంగా చెప్పిన మాటలు నాకు బాగా గుర్తుండి పోయాయి.

*"...అతడు వాయు వేగంతో నా వద్దకు చేరుకున్నాడు. నాలో రక్తం ఉడికిపోతుంది. అతడి ఛాతిని చీల్చి, అందులోంచి వేడి రక్తం ఉబికి వస్తూంటే చూసే సమయం కోసమే నేను కాచుకుని కూర్చున్నాను. నేను నా తుపాకి తీసుకుని అతడు ఏమి జరుగుతోందో తెలుసుకునే లోగానే కాల్చిపారేశాను. తర్వాత అతడి తలను, చేతులను కూడా నరకడం ప్రారంభించాను. నాపై మరతుపాకులను ఎక్కుపెట్టాలని కోరుకున్న చేతులు అవే. తర్వాత నేను అతడి తలను గుర్తుగా, భద్రంగా దాచాను..."* అన్నాడు వీరప్పన్.

వీరప్పన్ మాటల్ని బట్టి అతడిని ఒక కరడు గట్టిన క్రిమినల్ సైకోపాత్‌గా మాత్రమే పరిగణించడం నాకు సాధ్యమైంది. - ఇది నాకు అప్పటికి వీరప్పన్ మీద ఉన్న అవగాహన. వ్యక్తిగతంగా నేనెంతో అభిమానించే సోమయ్యగారు 'వీరప్పన్' పుస్తకం చదివి, అతడి మీద మంచి అభిప్రాయాల్ని వ్యక్తం చేయడం నాకు ఆ రాత్రి చాలా ఆశ్చర్యం కలిగించింది.

'సార్, ఇప్పుడే మీ ఇంటికి వచ్చి ఆ పుస్తకం చూస్తాను' అన్నాను నేను. రాత్రి పది దాటింది అప్పటికే. తార్నాకలో ఉన్న 'విజయవిహారం' ఆఫీసునుంచి, నేను మరొక మిత్రుడు అంత రాత్రి, బేగంపేట సోమయ్యగారి ఇంటికి బయల్దేరాం. ఆయన తాను చదివేశానని చెప్పి, పుస్తకం నాకు ఇచ్చేశారు. పుస్తకం పేరు 'గంధపు చెక్కల వీరప్పన్'. ఆ పుస్తకాన్ని హైద్రాబాద్ బుక్ ట్రస్టు వాళ్ళు ప్రచురించారని నాకు చూశాకనే తెలిసింది. ఆ రాత్రే పుస్తకం చదివాను. చాలా అంశాల్లో సమాచారం అపసవ్యంగాను, అసమగ్రంగాను ఉన్నట్టు గమనించాను. మర్నాడే ఈ పుస్తకంలో సమాచారం నిజానిజాల్ని గురించి, కాస్త రిఫర్ చేస్తూ, లోతుగా పరిశీలించడం ప్రారంభించాను. రెండు రోజుల్లో పరిశీలనకి ఒక రూపం వచ్చింది. ఈ పుస్తకాన్ని విమర్శనాత్మకంగా సమీక్షించాల్సిన అవసరం ఉందని అనిపించింది. నా ఆలోచనల్ని సోమయ్యగారికి తెలిపాను.

'వీరప్పన్' పుస్తకం పట్ల నేను ఫీలయిన ప్రధాన అభ్యంతరాల్లో - శ్రీనివాస్ జీవితాన్ని గురించి అసత్య చిత్రీకరణ ప్రధానమైనది. స్వతంత్ర భారత చరిత్రలో గాంధేయ విలువల్ని, సామాజిక దృష్టిని తన విధి నిర్వహణలో, శ్రీనివాస్ మాదిరిగా ఇంత అంకిత భావంతో అమలు పరిచిన అధికారి, తను నమ్మిన ఆ విలువలకోసం చివరికి తన జీవితాన్నే తృణప్రాయంగా అర్పించిన ఉదాత్తుడు మరెవరూ లేరు. వాస్తవం తెలియగానే సోమయ్యగారు ఈ విషయాన్ని చర్చకి తీసుకురావడం అవసరమని అభిప్రాయపడ్డారు. ఎంతోకొంత సామాజిక అవగాహన ఉన్న తనవంటి వ్యక్తినే ఈ పుస్తకం తప్పుదారి పట్టించ గలిగినపుడు, ఇక మామూలు పాఠకులు తేలిగ్గా పొరపాటు పడే అవకాశం ఉన్నదని సోమయ్యగారు వ్యాఖ్యానించారు. ముఖ్యంగా శ్రీనివాస్ జీవితం, కృషి పదిమందికీ విస్తృతంగా తెలియాల్సిన అవసరం ఉందని మేమంతా అభిప్రాయపడ్డాం.

'వీరప్పన్' పుస్తకంపైన విమర్శనాత్మక సమీక్ష తయారైంది. విజయవిహారం ఆగస్టు సంచిక ప్రింట్‌కి వెళ్ళబోతున్న సమయంలో జూలై 31న తెలిసింది ఒక పిడుగులాంటి

వార్త - వీరప్పన్ రాజ్ కుమార్‌ని కిడ్నాప్ చేశాడని. ఈ పరిణామం ఎటు దారి తీస్తుందోనని ఆలోచనలో పడ్డాం. 24 గంటల పరిణామాలు గమనించాక, తక్షణమే జరగబోయేదేమీ లేదని, మాకు అర్థమైంది. రాజ్ కుమార్ కిడ్నాప్ సమాచారాన్ని కూడా జత చేసి, వీరప్పన్ కవర్‌తో విజయవిహారం ఆగస్టు సంచిక మార్కెట్‌లోకి విడుదల చేశాం. అన్నిచోట్లా హిట్ టాక్ వచ్చింది. రాజ్ కుమార్ కిడ్నాప్ అయిన అతి తక్కువ కాలంలో, అంత విస్తృతమైన సమాచారంతో పత్రిక అంత త్వరగా ఎలా తెచ్చారని, పాత్రికేయ మిత్రులనేకమంది ప్రశంసించారు. వీరప్పన్ పుస్తకం పైన వచ్చిన సమీక్ష హైలెట్ అయింది. శ్రీనివాస్ ధీరోదాత్త జీవితం అనేకమంది దగ్గర చర్చకి వచ్చింది.

సెప్టెంబర్ సంచికలో హైద్రాబాద్ బుక్ ట్రస్ట్ జవాబు, దానిపై సమీక్షకుడి స్పందన వచ్చాయి. అవికూడా ఆసక్తిని రేపినవే.

సెప్టెంబర్ సంచిక విడుదలయ్యాక శ్రీనివాస్ తల్లి తండ్రులు అనంతరావు, జయలక్ష్మిగార్లనించి ఫోన్ రిసీవ్ చేసుకోవడం మరచిపోలేని ఎక్సైటింగ్ ఎక్స్‌పీరియన్స్. శ్రీనివాస్ కృషి గురించి, ఇన్నాళ్ళ తర్వాత, ఇంత విపులంగా చర్చకి రావడం, వారిని ఎంతో భావోద్వేగానికి గురిచేసింది. ముఖ్యంగా శ్రీనివాస్ త్యాగాన్ని అపహసించే 'వీరప్పన్' పుస్తకాన్ని మన తెలుగుదేశంలో ఎవరో ఒకరు ఎదుర్కొన్నందుకు వారికి ఒక ఊరట. సెప్టెంబర్ మధ్యవారంలో వరంగల్‌లో అనంతరావు గారి అల్లుడు రూప్ కుమార్ ఇంట్లో వారిని కలిశాం.

అప్పుడు అర్థమైంది మాకు నిజంగా,-ఒక భగత్సింగ్, ఒక అల్లూరి సీతారామరాజు, ఒక పొట్టి శ్రీరాములు... వంటి మహోజ్వల తారల సరసన చేర్చదగ్గ మరొక అమూల్యమైన రత్నాన్ని తెలుగు తల్లి కన్నదని.

**మన తెలుగు ప్రజల దురదృష్టమేమిటంటే - అటువంటి మహనీయ మూర్తి త్యాగమయ, వీరోచిత జీవిత ఘట్టం, - సమకాలీన చరిత్రలో, మన కళ్లముందే ఆవిష్కృతమైనా - గుర్తించలేనంత అంధులమైపోయాం మనం. వర్తమాన, భావికాలాల యువతరానికి అపూర్వమైన స్ఫూర్తిని అందించగల శ్రీనివాస్ జీవితం, కేవలం ఒకరోజు పత్రికలో మొదటిపేజీ వార్త అయింది - మన దుర్భాగ్య ఆంధ్ర దేశానికి. అంతకు మించి మరేమీ కాలేదు.**

లోకోత్తరమైన కరుణని, వెరపెరుగని పోరాట దీక్షని ప్రతిబింబించే శ్రీనివాస్ జీవితం గురించి కంటే, అలవిమాలిన దుష్టత్వానికి ప్రతీక అయిన వీరప్పన్ గురించే ఎక్కువ తెలుసు - తెలుగు దేశానికి.

**వీరుల త్యాగాల్ని విస్మరిస్తే, జాతిలో, వినాశన కరమైన ముసలం జన్మించకుండా ఎవరు ఆపగలరు?**

**చిత్రహింసల పాలై, కాలి, ఛిద్రమైన శ్రీనివాస్ శరీరం - మౌనంగా దానం చేస్తుంది మనకి జీవితపు రహస్యాల్ని, - అపూర్వమైన కనికరంతో, కరుణతో. ఆపవద్దు, చెంపలమీదనించి జారే కన్నీటిని, కానీ, - జీవిత పరమార్థాన్ని, జీవించే**

**పద్ధతిని మాత్రం చేతులు జోడించి తెలుసుకుందాం అతడి నుంచి.**

ఛిద్రమైన అతడి దేహాన్ని చూసిన తర్వాత కూడా నమ్మకుండా ఉండటం కష్టం, - క్రీస్తు మానవులందరి పాపాల్ని కడిగేందుకే శిలువమీద రక్తం ఓడ్చాడని.

యెర్కాయం అడవి మట్టి శ్రీనివాస్ నెత్తుటితో తడిసి, ఇప్పటికి 12 సంవత్సరాలు కావొస్తూంది.

గత సంవత్సరం - సెప్టెంబర్15, 2002 నాటి 'ది వీక్' పత్రిక విలేకరులు 'వీరప్పన్' గురించి కథనాన్ని తయారు చేస్తూ 'గోపీనాథం' గ్రామానికి వెళ్ళారు. తాము గతంలో వీరప్పన్‌ని ఇష్టపడ్డామనీ, కానీ, 1991లో శ్రీనివాస్‌ని చంపేసిన తర్వాత ఆ హంతకుడిని ఇప్పుడు తమ గ్రామంలో ఎవరూ ఇష్ట పడరని, అక్కడి గ్రామీణులు చెప్పినట్టుగా 'వీక్' ప్రచురించింది. ఆ గ్రామానికి శ్రీనివాస్ దేముడని గ్రామీణులు చెప్పినట్టుగా 'వీక్' పేర్కొంది.

శ్రీనివాస్ చనిపోయి దశాబ్దం దాటినా వీరప్పన్ స్వగ్రామం 'గోపీనాథం' ఇవ్వాళ్టికీ శ్రీనివాస్‌ని దేవుడని పూజిస్తోంది. 1992 సంవత్సరం ప్రతిష్టాత్మకమైన 'కీర్తిచక్ర' అవార్డును మరణానంతరం శ్రీనివాస్‌కి ప్రదానం చేశారు. శ్రీనివాస్ వర్ధంతి నవంబర్ 10వ తేదీని అటవీశాఖ దేశ వ్యాప్తంగా 'అటవీ అమరవీరుల దినోత్సవం'గా జరుపుతోంది.

**గాంధీజీ చెప్పిన 'ధైర్యవంతుల అహింస'కి, సజీవ ప్రతిరూపం శ్రీనివాస్ జీవితం.**

**ఆలస్యం కాలేదు ఇప్పటికైనా, ఇంతకాలంగా విస్మరించినా, ...ఆంధ్రదేశం, ఆమాటకొస్తే యావత్ భారతదేశం - మన తరం మహావీరుడు శ్రీనివాస్ జీవితాన్ని, జీవిత సందేశాన్ని - గుండెలకి హత్తుకోవాలి, కిరీటంలా ధరించాలి.**

'ఒక వీరప్పన్ నేడు తప్పించుకోవచ్చు, కానీ అటువంటి వీరప్పన్‌లు వందలకొద్దీ పుట్టుకురాకుండా చూడటం మనకర్తవ్యం' అని ఆరోజు శ్రీనివాస్ చెప్పిన మాటల అంతరార్థాన్ని శ్రద్ధగా ఆలకించాలి.

అధికార హోదాలని పక్కన పెట్టి, 'గోపీనాథం' గ్రామీణుల ఉఛ్వాస నిశ్వాసల్లో కలిసి పోయిన అతడి ఆపేక్షని, - గోడలు కూడాలేని ఒక సాదా సీదా పెంకుల కప్పుకింద గడిపిన 'ఆశ్రమ' జీవితాన్ని, - ఆలయాలు, ఆసుపత్రులు, ఉద్యోగాలు, రహదార్లు, పలకరింపులు, ఓదార్పులు ... ఒకటేమిటి, ఆ ప్రజల జీవితాల్లో మార్పుతేగలిగిన అనేకానేక రూపాల్లో ఒరుసుకుని ప్రవహించిన శ్రీనివాస్ ప్రేమని - అనుభూతి చెందాలి, మమేకం కావాలి మనం.

మృత్యు గృహంలోకి నడిచి వెళ్తున్న... చివరి క్షణంలో కూడా, '..మంచే జరగాలని ఆశిద్దాం. అంతా సరిగ్గా జరగాలని దేవుని ప్రార్థిద్దాం...' అని ప్రకటించగల అతడి ఆకాశమంత విశ్వాసాన్ని, నిర్భయాన్ని, అడవిలో పచ్చదనంలా అతడి రక్తంలో మిళితమైపోయిన సత్య ప్రేమని అర్థం చేసుకోవాలి, అవధరించాలి.

శ్రీనివాస్.... శ్రీనివాస్......

**సైతాన్ క్రూర వీక్షణం పైన, దైవిక శక్తుల విజయహాసం అతడు.**

**జీవితాన్ని జెండాగా ఎగరేసిన సాహసి.**

**ఈ భూగోళం మీద ఇప్పటి వరకూ ఉద్భవించిన అద్భుతాల్లో ...మానవత్వమే, ...మానవత్వమే, ...మానవత్వమే మహోన్నతమని చాటిన మరొక ఉదాహరణ శ్రీనివాస్.**

శ్రీనివాస్ గురించి ప్రస్తావించగలగడం విజయవిహారం అందుకున్న ఒక గౌరవం. ఆ గౌరవానికి అర్హులుగా ఉండేందుకు ప్రతీక్షణం తపిస్తాం మేము.

ఇపుడు శ్రీనివాస్ పైన విజయవిహారంలో వచ్చిన వ్యాసాన్ని పుస్తకరూపంలో విడుదలచేయగలగడం కూడా మేం అందుకున్న గౌరవమే.

జనహర్ష పబ్లిషర్స్ తరఫున ప్రచురించే మొదటి పుస్తకం శ్రీనివాస్‌దే కావాలని పట్టుదల వల్ల ఇప్పటివరకూ పుస్తకాలే ప్రచురించకుండా ఆపాం.

ఈ పుస్తకం ప్రచురించడంలో ఇంత ఆలస్యం కాకూడదన్న విషయం నిజమే. క్షంతవ్యులం. కానీ, ఎప్పటికప్పుడు ఏదో ఒక పోరాటపు ఉరవడిలో కొట్టుకుపోతోంది విజయవిహారం టీమ్, అందువల్లే చాలా అవసరమైన ఇటువంటి పనుల విషయంలో కూడా చేయకూడనంత ఆలస్యం అయిపోతోంది.

('శ్రీనివాస్ వజ్ ఎ ట్రూ గాంధీయన్. లివ్డ్ యాజ్ ఎ గాంధీయన్, డైడ్ యాజ్ ఎ గాంధీయన్' అనే మాటతో మేం ఏకీభవిస్తాం. జనహర్షకి శ్రీనివాస్ వ్యక్తిత్వం పైన ఉన్న ప్రగాఢమైన గౌరవానికి మరో సాక్ష్యం - 1999 సంవత్సరం నాటి 'జనహర్ష మహాత్మాగాంధీ హార్మనీ అవార్డు'ని శ్రీనివాస్‌కి ప్రకటించడం. ఈ అవార్డుని అందుకున్న వారిలో గ్లాడిస్ స్టెయిన్స్, దాశరథి రంగాచార్య, వావిలాల గోపాల కృష్ణయ్య, బోయి భీమన్న, ప్రొ॥ హెచ్. నరసింహయ్య వంటి ప్రముఖులున్నారు. ఈ అవార్డును వేలాది మంది ప్రజల సమక్షంలో, ఈ ఆగస్టు9న, హైద్రాబాద్ లలితకళాతోరణంలో కన్నుల పండుగగా జరిగిన జైభారత్ మతసామరస్య సమ్మేళనంలో శ్రీనివాస్ తల్లితండ్రులు స్వీకరించారు.)

పరిచయమైన నాటినుంచి, శ్రీనివాస్ తల్లితండ్రులు నన్ను తమ కుమారుడిగా అభిమానించి, ప్రేమ చూపడం... 2000 డిసెంబర్‌లో విజయవిహారంపై అనూహ్యమైన పోలీసు దాడి జరిగినపుడు తల్లడిల్లడం, నేను బెయిల్ మీద బయటపడినపుడు - రాజమండ్రి నుంచి హైద్రాబాద్ వచ్చి కొత్త బట్టలు పెట్టి తమ ప్రేమని వ్యక్త పరచడం... బహుశా నేను జర్నలిస్టు జీవితంలో సంపాదించిన అతిపెద్ద అవార్డుగా భావిస్తానని గతంలో రాశాను. ఇటీవల నాపై పోలీసులు కుట్రపూరితంగా 'పోటా' పెట్టే ప్రయత్నం చేసి, అరెస్టు చేసినపుడు కూడా వారు అంతే ఆందోళన పడ్డారు. వారు ఇరువురూ చూపే ప్రేమకి పూర్తి అర్హత నాకు ఉన్నదని కూడా నేను అనుకోను వారు చూపే ప్రేమకి ఎలా ప్రతిస్పందించాలో నాకు అప్పుడూ, ఇప్పుడూ కూడా తెలీదు. శ్రీనివాస్ పుస్తకాన్ని వారికి అంకితం ఇవ్వడం అనేది, వారు నాపై ఉంచిన ప్రేమలో కొంతభాగాన్నైనా తిరిగి చెల్లించాలనే వ్యర్థ, విఫల ప్రయత్నం.

'వ్యక్తిత్వవికాసం' అంశంపైన మొదట్నుంచీ నాకు కొన్ని స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. *"..ఎందువల్లనో కానీ 'పర్సనాలిటీ డెవలప్‌మెంట్' అంటే బాగా డబ్బు సంపాదించి ఆర్థికంగా ఉచ్ఛస్థితికి రావడం, మంచి ఖరీదైన కార్లు, బంగ్లాలు*

సాధించడం - ఇంకా డబ్బు... ఇంకా ఇంకా డబ్బు సంపాదించడం అనే అభిప్రాయం అధిక సంఖ్యాకుల్లో బలంగా ఏర్పడుతోంది. ఇందుకు అనుగుణంగా వ్యక్తిత్వవికాస సాహిత్యంలో జీవితంలో అట్టడుగు స్థాయినుంచి ఆర్థికంగా ఉచ్ఛస్థితికి వెళ్ళినవారికే ప్రాముఖ్యత ఇచ్చి ఆదర్శ హీరోలుగా చిత్రించిన ధోరణి కనిపిస్తోంది. ఇందుకు కారణా లేవైనా ఇది ఖచ్చితంగా అసమగ్రధోరణి అని చెప్పడానికి ఏమి మొహమాటం అక్కర్లేదు. ఎందుకంటే ఈ బావతు నిర్వచనం ప్రకారం గొప్పచదువులు చదివి డబ్బు సంపాదించుకోకుండా ఆరోజు స్వాతంత్ర్య పోరాటంలోకి దూకిన గాంధీ, నెహ్రూ, సుభాస్‌చంద్రబోస్, టంగుటూరి ప్రకాశం తదితరులకి వ్యక్తిత్వం వికసించలేదని మనం భావించాలి, అలాగే అల్లూరి, భగత్‌సింగ్ తదితరులకి ఇంకా పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసులు అవసరమని కూడా మనం గ్రహించాలేమో ? - ఇది పూర్తిగా అర్థం లేని విషయం..." అని 'మానవీయ వ్యక్తిత్వ వికాసం' వ్యాసంలో రాశాను (విజయవిహారం, మే'2000). అదే అభిప్రాయానికి కట్టుబడి ఉండటం వల్లే 'జాతిని ఉర్రూతలూపిన గీతం - ఆదర్శం, ఆచరణ ఒక్కటైన జీవితం - వ్యక్తిత్వవికాసం అంటే ఇదికాక మరింకేమిటి?' అని జాతీయకవి గరిమెళ్ల సత్యనారాయణ మీద వ్యాసం రాశాను (విజయవిహారం, జూలై'2000). అదే ఒరవడిలో 'మనం విస్మరిస్తున్న మనతరం వీరుడు కీర్తిచక్ర పందిళ్ళపల్లి శ్రీనివాస్' వ్యాసం కూడా 'ప్రాణం, జీవితం సమస్తం - ఆదర్శానికీ, ప్రజలకీ అంకితం - ఇదే వ్యక్తి వికాసానికి ఉచ్ఛరూపం' అనే శీర్షికతో 'వ్యక్తిత్వ వికాసం' ఫీచర్‌గానే విజయవిహారం అక్టోబర్'2000 సంచికలో వచ్చింది.

ఇదేవ్యాసాన్ని ఇప్పుడు పుస్తక రూపంలో తీసుకువస్తున్నాం. సంబంధింత విషయమే కాబట్టి, అంతకుముందు విజయవిహారం సంచికల్లో వచ్చిన 'గంధపు చెక్కల వీరప్పన్' పుస్తకసమీక్ష, దానిపై సాగిన వాద వివాదాలను కూడా అనుబంధం రూపంలో అందిస్తున్నాం.

ఇన్ని సంవత్సరాల్లో శ్రీనివాస్ వ్యాసాన్ని చదివి, చర్చించి, భావాల్ని పంచుకున్న వారెందరో.... అందరికీ కృతజ్ఞతలు.

ఈ పుస్తకంలో మీకు నచ్చిన, నచ్చని అంశాలు ఏమున్నా మాతో పంచుకోండి.

**శ్రీనివాస్ జీవితం మిమ్మల్ని ఉత్తేజితం చేస్తే కన్నీళ్లు తుడుచుకుని ఊరుకోవద్దు, కనీసం పదిమంది మిత్రులకైనా ఈ ధీర వ్యక్తిత్వాన్ని పరిచయం చేయండి.**

వీరుడు శ్రీనివాస్ వ్యక్తిత్వాన్ని, కృషిని సమగ్రంగా విశ్లేషించే పుస్తకాలు మరెన్నో రావాలి. అందుకు ఈ ప్రయత్నం నాంది కావాలని ఆశ.

హైదరాబాద్ - రమణమూర్తి,

*18.9.2003* ఎడిటర్, విజయవిహారం

...రెండో కాలువని దాటబోతూ శ్రీనివాస్ తన కాళ్ళూ చేతులూ కడుక్కునేందుకు వంగాడు. వెంటనే అర్జునన్ వీరప్పన్‌కి సంజ్ఞ చేశాడు. తన ముఖ్య అనుచరుడైన "కొళందై"ని చూసి "కొళందై అడి" (కొళందై కొట్టు) అని వీరప్పన్ అజ్ఞాపించాడు. మొదట కొళందై కొంచెం సందేహించాడని చెపుతారు. (ఎందుకంటే కొళందై కుటుంబాన్ని కూడా కష్టాల్లో ఉన్నపుడు శ్రీనివాస్ ఆదుకున్నాడు.) కానీ వీరప్పన్ మళ్ళీ అజ్ఞాపించేసరికి కొళందై శ్రీనివాస్‌ని వెనకనించి కాల్చాడు. ఇదంతా కేవలం కొన్ని సెకన్లలో జరిగిపోయింది. కూలిపోతున్న శ్రీనివాస్‌పైన వీరప్పన్ రెండో బుల్లెట్ పేల్చాడు. వెంటవచ్చిన గ్రామస్తులు పారిపోయారు...

# మనం విస్మరిస్తున్న మన తరం వీరుడు
# కీర్తిచక్ర పందిళ్ళపల్లి శ్రీనివాస్

## నేపథ్యం :

సెప్టెంబర్ 14 వ తేదీ రాత్రి 10 గంటలకి విజయవిహారం ఆఫీసులో ఫోను మోగింది. ఎవరో అవతల నుంచి ఆగస్టు సంచికలో వేం రాసిన వీరప్పన్ స్టోరీ సంగతి ప్రస్తావిస్తున్నారు. నేనూ రొటీన్‌గానే జవాబు ఇచ్చాను.

అవతలినుంచి మాట్లాడుతున్నది - ఒకప్పుడు వీరప్పన్ చేతిలో కిరాతకంగా హత్య చేయబడిన, ఆంధ్రుడైన, ఫారెస్ట్ ఆఫీసర్ కీర్తి చక్ర పందిళ్ళపల్లి శ్రీనివాస్ తండ్రి అనంతరావు గారని తెలియగానే ఒక్కక్షణం నేను ఉద్విగ్నతకి లోనయ్యాను

విజయవిహారంలో శ్రీనివాస్ గురించి రాసిన దాన్ని ప్రస్తావిస్తూ ఆయన "బాబూ, మా గుండెల్లోని బాధని మీరెలా అర్థం చేసుకుని రాయగలిగారు? మీరు రాసింది చదివి మేం చాలా ఓదార్పు పొందాం. వీలైతే అర్జెంటుగా కలవాలని అనుకుంటున్నాం" అని చెపుతుంటే నేను ఆశ్చర్యోద్వేగాలతో ఉక్కిరిబిక్కిరయ్యాను.

శ్రీనివాస్ తల్లితండ్రులు అనంతరావు, జయలక్ష్మి వరంగల్‌లోని తమ అల్లుడు రూప్‌కుమార్ ఇంటికి వచ్చారని చెప్పారు కాబట్టి ఆ మర్నాడు 15 వ తారీకు విజయవిహారం తరుపున వారిని కలిసేందుకు నేను, టి.యన్.మూర్తి మధ్యాహ్నం హైదరాబాద్‌నుంచి వరంగల్ ప్రయణమయ్యాం.

వరంగల్ కారులో ప్రయాణించడానికి పట్టిన సమయం 3 గంటలు. దారంతా పందిళ్ళపల్లి శ్రీనివాస్ గురించి ఆలోచనలు నా మనసంతా ముసురుకున్నాయి. శ్రీనివాస్ గురించి మొదటిసారి నేను విన్నది 1991 లోనే. నిజాయితీ పరుడైన అధికారిని వీరప్పన్ ఎంత దారుణంగా, కిరాతంగా వధించాడో వార్తా కధనాలతో ఆ రోజు పేపర్లన్నీ నిండిపోయాయి. ఆ వార్త చదివినపుడు మనసెంత కలిచి వేసిందో నాకింకా గుర్తే. మళ్ళీ 1993 ఇంటర్వ్యూలో తన స్వంత మాటల్లో తాను శ్రీనివాస్‌ని ఎలా హత్య చేశాడో వీరప్పన్ వర్ణించినది చదివి నేను దిగ్భ్రాంతి చెందాను. ఆ పైశాచికత్వాన్ని వీరప్పన్ గర్వంగా,గొప్పగా చెప్పుకోవడం నిజంగా జలదరించే సంగతి. వీరప్పన్ అంటే మానవీయ లక్షణాలేకోశానాలేని కిరాతకుడనే అభిప్రాయం ఆ ఇంటర్వ్యూ చదివాక నా మనసులో బలంగా ముద్రపడింది.

1996లో మేం జనహర్షగా ఏర్పడటం, ఈ ఫిబ్రవరి నుంచి విజయవిహారం పత్రికని తీసుకురావడం, మొన్న ఆగస్టు సంచికలో వీరప్పన్ పుస్తకాన్ని సమీక్షించేటప్పుడు, మేం శ్రీనివాస్ కధంతా మళ్ళీ బయటకి తీసి ప్రశ్నల్ని సంధించడం, దానిపై సెప్టెంబర్ సంచికలో జరిగిన చర్చ.... ఇవన్నీ ఇటీవలి పరిణామాలు.

సాయంత్రానికి మేం వరంగల్‌లో రూప్ కుమార్‌గారింటికి చేరగలిగాం. అక్కడే శ్రీనివాస్ తల్లితండ్రుల్ని కలిశాం. మంచి హోదాకి చేరుకుని స్థిరపడి తమని సుఖపెడతాడేమో అనుకున్న కొడుకు.... 36 సంవత్సరాల వయసులో... నమ్మిన ఆదర్శం కోసం... ఎక్కడో వేరే రాష్ట్రంలో పనిచేస్తూ... ఘోరమైన చిత్రహింసలకి గురై, ఖండఖండాలుగా నరికి వేయబడి కిరాతకంగా హత్య చేయబడ్డాడని.. ఛిద్రమైన సగంకాలిన మొండెం మాత్రం దొరికిందని తెలిసినప్పుడు... ఆ తల్లితండ్రుల గుండెలు ఎంతగా విలవిల్లాడాయో... ఎంత క్షోభకి గురయ్యాయో ఎవరు చెప్పగలరు? తమ కొడుకు అంత దారుణ హత్యకి గురయ్యాడనే వార్త కంటే తల్లితండ్రులకి వేరే కష్టం ఇంకేముంటుంది? జీవించినంత కాలం వారి గుండెల్లో ఈ బడబానలం ఆరిపోతుందా?

ఆ దారుణానికి గురై శ్రీనివాస్ చచ్చిపోతే, క్షణక్షణం ఆ జ్ఞాపకాల హింసతో వీరు బతుకుతున్నారు - అంతే తేడా... జీవితపు క్రూరత్వానికి ఆత్మలు గాయపడిన ఆ తల్లితండ్రుల కళ్లల్లోకి సూటిగా చూడలేక నేను తలదించుకున్నాను.

ఇంటర్వ్యూ ఇవ్వడం, తమ బాధని ఒక పద్ధతిలో చెప్పడం ఆ తల్లితండ్రులకి తెలిసిన విద్యకాదు. బహుశా వాళ్ళని రొటీన్‌గా ఇంటర్వ్యూ ప్రశ్నల్ని అడగటం నాకూ సాధ్యం కాలేదు.

‘‘మీరే మా బిడ్డలు అనుకుంటున్నాం బాబూ. కన్న కొడుకు ఖండఖండాలై, చిత్రహింసలపాలై చచ్చిపోయాడు. జీవచ్ఛవాల్లా బ్రతికున్నాం. ఈ రాతలేమిటి? కొడుకు త్యాగమంతా వృధాకావల్సిందేనా? అని కుమిలిపోతున్నాం. మా మనసులో బాధంతా మీ

కెలా అర్థమైంది బాబూ. మీరెలా రాయగలిగారు. బహుశా మేం కూడా అలా చెప్పుకోలేమేమో...." - అనంతరావుగారు వీరప్పన్ పుస్తకం, విజయవిహారం కాపీ తీసి చూపించారు. పత్రికలోని వ్యాసంలో ప్రతిమాటనీ అండర్ లైన్ చేసుకుని - వీరప్పన్ పుస్తకంలోని ప్రతీపాయింట్‌కీ విజయవిహారం లోని ప్రశ్నల్ని మార్జిన్‌లో రాసుకుని - విజయవిహారం మాటల్లో తమ బాధని చూసుకుంటున్న ఆ దంపతుల్ని చూసి మా కళ్ళు చెమర్చాయి.

శ్రీనివాస్ గురించి రాసిన అక్షరాలన్నిటి వెనకాలా నా మనసులో ఒక సంశయం మిగిలిపోయింది. కేవలం పత్రికల్లోని భిన్నమైన కథనాలనుంచి అతడిని పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాననే అసంతృప్తి ఉండిపోయింది. బహుశా ఒక పోలీసు లేదా ఒక ఫారెస్టు ఆఫీసర్ ఉత్తేజకరంగా జీవించారనే విషయంపైన నా మస్తిష్కంలో గట్టి అపనమ్మకం కూడా గూడు కట్టుకుని ఉండొచ్చు.

**ఆ రోజు... బాధ, ఆగ్రహం, అసహాయత కలిసిపోయి...... కొద్దికొద్దిగా ఒక క్రమపద్ధతి లేకుండా శ్రీనివాస్ జ్ఞాపకాల్ని తెరలు తెరలుగా కదుపుతూ... శరీరాల్లో రక్తానికి బదులు శోకం ప్రవహిస్తున్న ఆ తల్లితండ్రులు చెప్పిన, చెప్పలేకపోయిన మాటలు.... ఒకప్పుడు... నిజంగా క్రూరత్వాన్ని ప్రేమతోనూ, ద్వేషాన్ని చిరునవ్వుతోనూ గెలవాలని ప్రయత్నించి.... సాటి మనుషుల అభివృద్ధి కోసం అహర్నిశం తపించి, శ్రమించిన ... చివరికి ద్రోహానికి కాలిపోయిన.....ఒక స్వప్నం గురించి...ఒక సున్నితమైన, మహోన్నత మైన మానవీయమైన వ్యక్తిత్వం గురించి.... వెరపెరుగని ఆదర్శం గురించి... వరంగల్‌లోని ఆ చిన్న గదిలో... మేం మాటలన్నీ దగ్గిర జేర్చుకుంటూ సరిచూసుకుంటూ అర్థం చేసుకోవడం ప్రారంభించాం.**

మధ్యమధ్యలో రూప్‌కుమార్ తన జ్ఞాపకాల్ని ఆలోచనల్ని పంచుకున్నారు.

వ్యక్తిత్వానికి వికాసం ఎందుకు? ఆ వికసించిన వ్యక్తిత్వానికి అర్థం ఏమిటి? దీనులైన తన సాటి మనుషుల బాగు గురించి పాటు పడకపోతే, సమాజంలోని చెడుని సంస్కరించేందుకు కృషి చేయకపోతే వ్యక్తి వికాసం వల్ల ఉపయోగం ఏముంది? అసలు ఆ వ్యక్తిత్వం వికసించినట్టెలా అయింది?

36 సంవత్సరాల శ్రీనివాస్ జీవితం - నిజంగా ఒక అద్భుతం - వ్యక్తివికాసానికి ఒక సంపూర్ణ నిర్వచనం.

స్వల్ప కాలంలో అతను సాధించిన విజయాలు నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఆదర్శం కోసం మరణాన్ని లెక్కచేయని నిజాయితీ, పట్టుదల... అదే శ్రీనివాస్ అంటే. దురదృష్టం ఏమిటంటే అధికశాతం పత్రికలు శ్రీనివాస్‌ని ఒక న్యూస్ ఎలిమెంట్‌గానే చూశాయి. వార్తాకథనాలతోనూ, అవార్డుతోనూ సరిపెట్టి అతడిని అకాడమీలకి పరిమితం చేస్తే - మన తరం ఒక హీరోని నిజంగా విస్మరించిన వాళ్ళమే అవుతాము.

ప్రభుత్వోద్యోగిగా గానీ, ఆదర్శంపైన అకుంఠిత దీక్ష ఉన్న యువకుడిగాగానీ - శ్రీనివాస్‌కి వున్న స్ఫూర్తితో మనదేశంలో కొన్ని వందలమంది (వేల మంది కాదు వందల మందే)

పనిచేస్తే - మనదేశ స్వరూపమే మరోరకంగా ఉండేదేమో!

శ్రీనివాస్ తన జీవితాన్ని తాను ఎంచుకున్నాడు, తనే నిర్మించుకున్నాడు. ఒక సాధారణ యువకుడు తన ఆదర్శం పట్ల సీరియస్‌గా ఉంటే, పట్టుదలగా కృషి చేస్తే, ఎంత సాధించగలడో ఎంత మార్పు తేగలడో, తన జీవితాన్ని ఎంతగా ధన్యం చేసుకోగలడో, ఒక లిజెండ్‌గా మారి తన వ్యక్తిత్వంతో ఒక తరానికి ఎలా స్ఫూర్తి ఇవ్వగలడో చెప్పడానికి శ్రీనివాస్ జీవితమే ఒక ఉదాహరణ.

మనం విస్మరిస్తున్న మన తరం హీరో గురించి స్థూలంగా పరిచయం చేసేందుకే ఈ ప్రయత్నం.

శ్రీనివాస్ తల్లితండ్రులు అనంతరావు, జయలక్ష్మి, బావ రూప్‌కుమార్ ఇంటర్వ్యూలో అందించిన వివరాలు, గత పది సంవత్సరాల పత్రికా కథనాలు, వ్యాసాలు, రిపోర్ట్‌లు, ఉత్తర ప్రత్యుత్తరాలు, వీరప్పన్ ఇంటర్వ్యూలు, అకాడమీల్లోని స్మారకోపన్యాసాలు, వీడియో క్లిపింగ్స్, గోపీనాథం గ్రామ ప్రజల లేఖలు ఈ రచనకి స్థూలంగా ఆధారాలు.

* * *

# ప్రాణం, జీవితం సమస్తం - ఆదర్శానికీ, ప్రజలకీ అంకితం - ఇదే వ్యక్తివికాసానికి ఉచ్ఛరూపం

## రెండు ప్రవాహాల సంగమం

శ్రీనివాస్ పితామహులు స్వర్గీయ వెంకటేశ్వర్లు సహాయనిరాకరణ ఉధృతంగా జరిగే రోజుల్లో గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య సమరంలోకి దూకారు. చరఖా ఉద్యమానికి ఉత్తేజితులై వార్ధా వెళ్ళి కిసాన్ చరఖా, బాక్స్ చరఖా తయారుచేసే ప్రక్రియ నేర్చుకుని వచ్చి కొన్ని వందల చరఖాల్ని తయారుచేసి ఉద్యమానికి అందించారు. స్వార్థత్యాగాన్ని, గాంధీ ఆశయాల స్ఫూర్తిని శ్రీనివాస్ ప్రత్యక్షంగా తన తాతగారి దగ్గర్నించే పుణికి పుచ్చుకున్నాడు.

శ్రీనివాస్ మాతామహులు స్వర్గీయ కె.శేషావతారం సంస్కృతాంధ్ర పండితులు, గొప్ప దైవభక్తులు.

దైవభక్తి, గాంధేయ స్ఫూర్తి - శ్రీనివాస్ వ్యక్తిత్వంలో, జీవితంలో విడదీయలేనంతగా కలిసిపోయి, ముందుకు నడిపించిన మహాప్రవాహాలు.

## గోల్డ్ మెడలిస్ట్

12, సెప్టెంబర్, 54లో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జయలక్ష్మి, అనంతరావు దంపతులకి తొలి సంతానంగా జన్మించాడు శ్రీనివాస్. ఎలిమెంటరీ హైస్కూలు, కాలేజి విద్యాభ్యాసమంతా రాజమండ్రిలోనే. పబ్లిక్ స్కూల్స్ కాదు. మామూలు తెలుగుమీడియం స్కూల్సే. 1977లో యం.యస్.సి. ఆంధ్రా యూనివర్శిటీ ఫస్ట్ ర్యాంకులో ప్యాసయి గోల్డ్ మెడల్ సాధించాడు. 1978లో ఐ.యఫ్.యస్‌కి సెలక్టయ్యాడు. 79-81 మధ్య ఫారెస్టు ట్రైనింగ్



కాలేజ్ డెహరాడూన్‌లోనూ, అడ్మినిస్ట్రేటివ్ అకాడమీ ముస్సోరిలోనూ ట్రైనింగ్ పూర్తి చేసుకుని, 1982లో కర్నాటకరాష్ట్రం చామరాజనగర్‌లో ఎ.సి.యఫ్.గా నియమించబడ్డాడు.

## అటవీసంపద రక్షణే ధ్యేయం

1982లో ఎ.సి.యఫ్.గా జాయిన్ అయిన శ్రీనివాస్ 1984 నాటికే డి.సి.యఫ్.గా నియమించబడి 1987 జూలై వరకూ అదే పదవిలో ఉన్నాడు.

అటవీసంపదని రక్షించేందుకు, అక్రమాల ఆటకట్టించేందుకు తొలిరోజుల్లోనే శ్రీనివాస్ విశేషంగా కృషిచేశాడు. ఎ.సి.యఫ్.గా పని చేసేటప్పుడే గంధం చెక్కల్ని, ఏనుగు దంతాలని స్మగ్లింగ్ చేసే నేరస్థులని, నేరాల వివరాలతో సహా సేకరించి ఒక ఇన్వెంటరీ తయారు చేశాడు. వాళ్ళ ఫొటోలు, కార్యవిధానాలతో సహా సమగ్ర సమాచారాన్ని, ఛార్టులని తయారు చేయించి సంబంధిత ఫారెస్టు ఆఫీసర్లకి అందించాడు. తన హయాంలో అరణ్యాల మధ్యకి రోడ్లు వేయించాడు.




మూల మూలల్లోనూ వాచ్ టవర్స్ కట్టించి వైర్‌లెస్ సెట్లు ఇచ్చి 24 గంటలు కాపలా ఏర్పాటు చేసి ఫారెస్ట్ ఫైర్ వల్ల, స్మగ్లింగ్ కార్యకలాపాల వల్ల అటవీసంపద నష్టం కాకుండా నియంత్రించాడు. కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టం చేశాడు. కొండలపై చెరువులు తవ్వి, నీటి ప్రవాహాల్ని నియంత్రించి, అక్కడ ఫారెస్టు నర్సరీలని, ఫారాలని ఏర్పరిచి అడవుల పెంపుదలకి దోహదపడ్డాడు. అనేక మారుమూల గ్రామాలకి తాగునీటిని అందించాడు. శ్రీనివాస్‌లోని ఎడ్మినిస్ట్రేటివ్ ఎబిలిటీస్ ఆ రోజుల్లోనే వెలుగులోకి వచ్చాయి.

తానే స్వయంగా రూపకల్పన చేసుకున్న 'డివిజనల్ డెవలప్‌మెంట్ ప్లాన్'ని అమలు జరుపుతూ, 40, 50 ఎకరాల భూమిని సేకరించి చిక్‌మగుళూరులో ఆధునిక ఫారెస్టు కాంప్లెక్స్ నిర్మించాడు. ఇప్పుడది కర్నాటకకే మణిపూస. అదేచోట "చింతామణి - మహా సరస్వతీదేవి" ఆలయాన్ని నిర్మించాడు.

స్మగ్లర్లని, నేరస్థులనీ పట్టుకోవడంలో ఎటువంటి ఆటంకాన్ని లెక్క చేసేవాడు కాదు. చాలా పెద్ద సంఖ్యలో స్మగ్లర్లని, పోచర్లని శ్రీనివాస్ పట్టుకున్నాడు.

ఎందర్ని పట్టుకోగలిగినా వీరప్పన్ మాత్రం దొరకలేదని భావించి దాన్ని



కేంద్రమంత్రి రావు బీరేంద్రసింగ్ చేతుల మీదుగా డెహ్రాడూన్‌లో బహుమతి

ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నాడు. చివరికి అక్టోబర్ 86లో వీరప్పన్ చిక్కాడు. ఎప్పటికప్పుడు విలువైన సమాచారం సేకరిస్తూ, అనేక స్థావరాలపై దాడి చేస్తూ, చాలా పెద్ద మొత్తంలో కోట్లు విలువచేసే దంతాలనీ, కలపనీ స్వాధీనం చేసుకుంటూ శ్రీనివాస్ ఊపిరాడకుండా ఉండేవాడు. అటువంటి రెయిడ్లలోనే శ్రీనివాస్ బయటకి వెళ్ళిన సమయంలో కస్టడీ నుంచి వీరప్పన్ అనూహ్యంగా తప్పించుకుని పారిపోయాడు.

అప్పుడే ఈ సందర్భంలోనే శ్రీనివాస్‌పైన కొందరు వ్యాఖ్యానాలు చేశారు. ఈ సంఘటనపై అధికారులు "ఎంక్వయిరీ"కి ఆదేశించారు. ఈ సంఘటనలో శ్రీనివాస్‌కి ఎటువంటి సంబంధం లేదని, ఇందుకు కొందరు పోలీసు అధికారులే బాధ్యులని 1990లో సమర్పించిన ఎంక్వయిరీ రిపోర్టు తేల్చిచెప్పింది.

కానీ తప్పించుకున్న వీరప్పన్‌ని తానే తిరిగి సజీవంగా పట్టుకోవాలని, అతడిని మంచి మార్గంలోకి తేవాలని శ్రీనివాస్ ఆరోజే శపథం చేశాడు. గాంధేయమార్గంలో వీరప్పన్‌ని బంధించే ప్రయత్నానికి శ్రీనివాస్ మనసులో అప్పుడే అంకురార్పణ జరిగింది.

## అమెరికా నుంచి అర్థాంతరంగా



అమెరికాలో...

1989లో ప్రభుత్వం శ్రీనివాస్‌ని అమెరికాకి ట్రైనింగ్ నిమిత్తం పంపింది. ఇక్కడ వీరప్పన్ కార్యకలాపాలు ఉధృతమయ్యాయి. అమెరికా ట్రైనింగ్ గడువు ముగియకుండానే శ్రీనివాస్‌ని ప్రభుత్వం వెనక్కి రప్పించింది. పరాయి దేశంలో కూడా శ్రీనివాస్ మానవత్వాన్ని, ధైర్యాన్ని తెలిపే ఒక ఉదాహరణని, అక్కడ ట్రైనింగ్ సెంటర్‌లో సహవాసిగా ఉన్న మిత్రుడొకాయన తర్వాత చెప్పారు: ఒకసారి మార్కెట్ ప్లేస్‌లో శ్రీనివాస్ వెళ్తుండగా ఒక మహిళ హ్యాండ్‌బ్యాగ్‌ని ఒక దొంగ ఎత్తుకొని పారిపోవడం ఆయన చూశాడు. తక్షణం ఆ దొంగని తరిమి పట్టుకుని అప్పగించాడు. దేశంకాని దేశంలో ప్రమాదాల్లో దిగే సాహసాలు ఎందుకని మిత్రులడిగితే - "నా ఎదురుగా ఒకళ్ళు ఆపదలో పడితే ఎలా ఊరుకోగలను?" అని శ్రీనివాస్ సమాధానం ఇచ్చాడు.



డెహ్రాడూన్‌లో ట్రైనింగ్ రోజుల్లో

1990 జూన్‌లో శ్రీనివాస్ టాస్క్ ఫోర్స్‌లో జాయిన్ అయ్యాడు. పై అధికార్లని ఒప్పించి వీరప్పన్ స్వగ్రామమైన గోపీనాథం గ్రామంలో క్యాంపుకి టాస్క్‌ఫోర్సు స్పెషల్‌ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టాడు.

# దో ఆంఖే బారా హాత్ వాలా

"మనుషులు ఎవరూ పుడుతూనే దుర్మార్గులుగా మంచివాళ్ళుగా పుట్టరు" అని శ్రీనివాస్ చెప్పేవాడు. సాంఘిక, ఆర్థిక వాతావరణ పరిస్థితుల ప్రభావం, నిరక్షరాస్యత వల్ల ఇంకా అనేక కారణాలవల్ల నేరస్థులుగా మారతారని, కాబట్టి నేరాన్ని నిర్మూలించాలంటే ఆ పరిస్థితుల్లో మార్పు తేవాల్సి ఉందని శ్రీనివాస్ దృఢాభిప్రాయం. "ఒక వీరప్పన్ నేడు తప్పించుకోవచ్చు. కానీ అటువంటి వీరప్పన్‌లు వందలకొద్దీ పుట్టుకు రాకుండా చూడటం మన కర్తవ్యం" అని శ్రీనివాస్ తపించేవాడు.

ప్రజలు స్మగ్లర్లకు ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించడానికి అక్కడి ప్రజల్లోని పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత కారణాలని శ్రీనివాస్ గమనించాడు. వీరప్పన్ తన స్మగ్లింగ్ కార్యకలాపాలకి ఒక్కోసారి ఒకే సమయంలో 50 మందిని పనికి వినియోగించిన సందర్భాలు కూడా ఉండేవి. గంధపు చెక్కలని నరికి ఇచ్చినందుకు వీరప్పన్ అప్పట్లో వారికి నామమాత్రంగా అంటే లారీ లోడుకి కేవలం రు.600 ఇచ్చేవాడు. అది కూడా ఇస్తాడనేది గ్యారంటీ లేదు. ఈ లోపు ఇటువంటి పనుల్లో పాల్గొన్నందుకు పోలీసులు వేధిస్తే గ్రామస్తులు తప్పనిసరిగా వీరప్పన్ మద్దతుదారులుగానో లేదా పూర్తిస్థాయిలో నేరస్తులుగానో మారిపోవల్సి వచ్చేది.

లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్, ఆచార్య వినోబాభావేలను ఆదర్శంగా తీసుకున్న శ్రీనివాస్ గోపీనాథం గ్రామంలో నిర్మాణాత్మక కార్యకలాపాలు ప్రారంభించాడు.

అర్హులైనవారిని డిపార్ట్‌మెంట్‌లోనే - ఫారెస్ట్ వాచర్స్‌గా, గార్డ్స్ పోస్టులకి ఎంపిక చేయడం - స్మగ్లింగ్‌కి వెళ్ళే వాళ్లని గుర్తించి వారికి నర్సరీల్లో, తోటలపెంపకాల్లో పని కల్పించడం చేశాడు. సక్రమమైన మార్గంలో ఉపాధి దొరకడం, ఆ కష్టానికి తగ్గ ఫలితం చేతికి రావడంతో గ్రామాలు కళకళలాడాయి. ఊరికి రోడ్డు వేయించాడు. గిరిజనులకి పక్కా ఇళ్ళు కట్టించే పని మొదలు పెట్టాడు. శ్రీనివాస్ చొరవతో 40 ఇళ్ళు - అదీ మన ప్రభుత్వ మార్కు ఇళ్ళ మాదిరిగా కాకుండా మంచి సౌకర్యాలతో కట్టించాడు.

గిరిజనులకి ఇళ్ళేమిటని విమర్శించిన వాళ్ళకి - గిరిజనులు అడవిలో ఒక విడదీయరాని భాగం (part & parcel of forest) అని జవాబిచ్చేవాడు. వాళ్ళు లేకపోతే అడవే లేదు



శ్రీనివాస్ నివసించే
గోడలు కూడా సరిగాలేని పాతాసీదా ...
ఉద్యోగి కూడా ఉండటానికి ... వ్యాఖ్యానించాడు

అనేవాడు. ఆ ఇళ్ళ నిర్మాణంలో ఒక "కూలీ" మాదిరిగానే తానూ అన్ని పనులు చేశాడని చెపుతారు.

తెలుగువాడైనా - కేవలం ఇంగ్లీషు, హిందీ భాషలే కాకుండా కన్నడం, తమిళం, మళయాళ భాషల్ని ధారాళంగా మాట్లాడుతూ స్థానికులతో కలిసిపోయాడు, కోయ డాన్స్ నేర్చుకుని వాళ్ళతో డాన్స్ చేసేవాడు.

గోపీనాథం ప్రజలకి వైద్యసౌకర్యాలు లేక ఇబ్బంది పడేవారు. ప్రజల్ని ఆదుకోవడానికి శ్రీనివాస్ ఒక ఆసుపత్రిని నెల కొల్పాడు. తేలు కాటుకి, పాముకాటుకి అవసర మైన యాంటీ వీనమ్ సీరమ్‌తోపాటు అనేక మందులు అందు బాటులోకి తెచ్చాడు. నెల్లాళ్ళు శ్రమించి తానే వైద్యం నేర్చుకున్నాడు. ఆఖరి రోజుల్లో ఆ ఆసుపత్రి కోసం ఒక సెకండ్ హ్యాండ్ ఫోర్‌వీలర్‌ని కొని ఒక అంబులెన్స్ కూడా అమర్చాడు.

ఆలంబాడిలో ఒకసారి ప్రమాదవశాత్తూ ఒళ్ళు కాలిపోయిన స్త్రీని మెట్టూరుకు తరలించి వైద్యసహాయాన్ని అందించడంతో ఆ గ్రామ ప్రజలంతా శ్రీనివాస్‌ని అభిమానించసాగారు. దీన్ని గమనించిన వీరప్పన్ - మరియప్పన్ అనే వ్యక్తితో సంబంధమున్న స్త్రీకి బలవంతంగా విషం ఎక్కించి - ఆమె వైద్యసహాయం సాకుతో శ్రీనివాస్‌ని ఆ ఊరికి రప్పించి, దార్లో మాటువేసి అతడిని చంపేద్దామని పథకం పన్నినపుడు - ఊరంతా దాన్ని నిరసించింది. వీరప్పన్ తన పథకాన్ని అమలు జరపలేక పోయాడు.

గోపీనాథం గ్రామంలో లక్షలాది రూపాయల వ్యయంతో మారియమ్మ దేవాలయాన్ని కట్టించడం శ్రీనివాస్ సాధించిన బృహత్ కార్యాలలో ఒకటి. ప్రజలనుంచీ, స్నేహితుల నుంచీ బంధువుల నుంచీ సేకరించిన విరాళాలతోనే శ్రీనివాస్ కార్యక్రమాలు నడిచేవి. ఏ పని చేసినా అది కలకాలం నిలిచే ప్లానింగ్‌తో చేయడం శ్రీనివాస్ ప్రత్యేకత. గుడికట్టడమే కాకుండా నిర్వహణకీ, అర్చకుడికీ, సిబ్బందికీ జీతభత్యాల నిమిత్తం - ముందరే లక్షల రూపాయలు ఫిక్సడ్ డిపాజిట్ చేసి ఆ వడ్డీతో పని జరిగేలా ఏర్పాటు చేసేవాడు.

ఆలయంలో జంతుబలిని మాన్పించాలని శ్రీనివాస్ ఆశయం. మొత్తంగా మాన్పించడం సాధ్యంకాకపోయినా చాలావరకూ తగ్గించ గలిగాడు. జంతువుల్ని బలి ఇచ్చే పద్ధతివల్ల మనుషుల్ని కూడా చంపే కౄరత్వం అలవడుతుందని శ్రీనివాస్ అనేవాడు.

గ్రామస్థులు తినే తిండే తనూ తినేవాడు. వారితోనే కలిసి మెలిసి ఉండేవాడు. అతను నివసించే గోడలు కూడా సరిగాలేని సాదాసీదా కప్పుకింద ఫారెస్టుగార్డు స్థాయి ఉద్యోగి కూడా ఉండటానికి .ఇష్టపడడని శ్రీనివాస్‌తో పాటే పనిచేసిన మరో అధికారి బి.కె.సింగ్ వ్యాఖ్యానించారు.

మరో పక్క ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి. "కావేరీ వైల్డ్ లైఫ్ సాంక్చ్యురీ" - గోపీనాథం గ్రామాన్ని ఇంకా హొగెనకల్‌తో పాటు నదీ తీరాన ఉన్న అనేక గ్రామాల్ని కవర్ చేయాలని ఒప్పించాడు. ఆ ప్రాజెక్టులో ట్రెక్కింగ్, సర్ఫ్ రాఫ్టింగ్ వంటి అంశాలున్నాయి. టూరిస్టులు రావడంతో ఆ ప్రాంతాల్లో డబ్బు, ఉపాధి అవకాశాలు వస్తాయని శ్రీనివాస్ భావం.

గ్రామానికి టి.వి. తెచ్చాడు. ఖాళీ ఉన్నప్పుడల్లా గోపీనాథం గ్రామప్రజలతో కలిసి టి.వి. చూడటం, వాలీబాల్ ఆడటం చేశేవాడు. గ్రామస్థులకి "దో ఆంఖే బారా హాత్" వంటి

సందేశాత్మకమైన చిత్రాలు చూపించేవాడు. కిరాతకులైన ఖైదీల మనస్తత్వాన్ని ఒక జైలర్ ప్రేమపూర్వకమైన పద్ధతులతో మార్చడమే శాంతారాం తీసిన ఆ కళాఖండంలోని కథాంశం.

అతి త్వరలోనే శ్రీనివాస్ గ్రామప్రజలకి ఆరాధ్యుడైపోయాడు. గ్రామంలోని ప్రజలు చివరికి వీరప్పన్ బంధువులు సైతం శ్రీనివాస్‌ని అభిమానించారు. అక్రమకార్యకలాపాల్లో ఉన్న వారి బంధువుల్ని సంప్రదించి వారి చర్యల తప్పొప్పుల్ని శ్రీనివాస్ వివరించాడు.

వాళ్ళకోసం ఒక రిహాబిలిటేషన్ ప్యాకేజి తయారు చేశాడు. ఆ ప్యాకేజీలో 'న్యాయసహాయం' కూడా ఉంది. వారినందరినీ తనకి చేతనైన విధంగా ఆదుకునే వాడు. వాళ్ళకి వైద్యసహాయం, ఆర్థిక సహాయం, మాట సహాయంతో ఆదరించాడు. ప్రభుత్వ పథకాలని అన్నిటినీ ప్రజలకి అందుబాటులోకి తెచ్చి సహాయం దొరికేలా చేసేవాడు.

శ్రీనివాస్ అహింసాత్మక ఉద్యమంవల్ల వీరప్పన్ అక్రమ కార్యకలాపాలకి ఆటంకం ఏర్పడింది. వీరప్పన్ బంధువులతోటే కాదు, మొత్తం గ్రామాలకు గ్రామాలచేతే శ్రీనివాస్ అక్రమ కార్యకలాపాలకి 'సహాయనిరాకరణ' అమలు జరపగలిగాడు.

ఆ కాలంలోనే, తండ్రితో "నాన్నా! గాంధేయ సిద్ధాంతాలు అమలు జరపలేక పోతున్నామని అనుకోవద్దు, నేను అమలు జరిపి విజయం సాధిస్తున్నాను" అని చెప్పాడంటే శ్రీనివాస్ ఎంత కాన్ఫిడెంట్‌గా ఉండేవాడో అర్థం అవుతోంది.

1990 నాటికి శ్రీనివాస్ వీరప్పన్ గ్యాంగ్‌లోని కరడుగట్టిన నేరస్థులని లొంగిపోయేలా చేయగలిగాడు. వాళ్ళలో వీరప్పన్ సోదరుడు అర్జునన్‌తోపాటు, గోవింద, వొండి, చిన్నరాజు, ధన్‌పాల్, పున్ని మాదయ్య, పీకారి, ఇయ్యాన్‌దురై మొదలైన వాళ్ళున్నారు.

శ్రీనివాస్ పద్ధతులపట్ల సహజంగానే అధికశాతం అధికారులకి అయిష్టంగా ఉండేది. ముఖ్యంగా వీరప్పన్‌ని కాల్చి చంపకూడదని - శ్రీనివాస్ చెప్పే విషయం అధికారుల ఆగ్రహానికి కారణం. 1990 ఆగస్ట్ 7న బోధిమలై అనే ప్రాంతంలో వీరప్పన్ బృందం తారసపడినప్పుడు కాల్చి చంపకుండా శ్రీనివాస్ అడ్డుపడటంతో, శ్రీనివాస్‌పట్ల అధికారుల అయిష్టత మరీ పెరిగిపోయింది.

శ్రీనివాస్‌కి ఆ అధికారులు హేళనగా పెట్టిన పేరు "దో ఆంఖే బారా హాత్ వాలా".

పోలీసుల ఆగ్రహాన్ని ప్రస్తావిస్తూ - "వీరప్పన్ కనిపిస్తే మొదట కాల్పులు జరపవద్దని మమ్మల్ని ఆదేశిస్తున్నారు, కనిపిస్తే కాల్చకుండా మేమేం చెయ్యాలి? వెళ్ళి కౌగలించుకోవాలా? షేక్‌హ్యాండ్ ఇవ్వాలా?" అని పోలీసులు అంటున్నారని - 1991 మే లో ఒక పాత్రికేయుడు వెల్లడించారు. మళ్ళీ ఆ మాటకి ఆయనే సమాధానం చెపుతూ-నిజానికి శ్రీనివాస్ సరిగ్గా ఆ పనే చేయమంటున్నాడని వ్యాఖ్యానించడం-అప్పటి పరిస్థితికి అద్దం పడుతోంది.




## పువ్వుల్ని తెంపకండి!

శ్రీనివాస్ జీవితంలో వ్యక్తిత్వంలో అనేక విభిన్న అంశాల్ని పరిశీలించినపుడు వాటి మధ్య ఒక

స్పష్టమైన కంటిన్యూటీని మనం చూడొచ్చు. అతని ఆదర్శాలన్నీ ఏదో తాత్కాలిక లక్ష్యం కోసం అతికించి పెట్టుకున్నవి కావనీ - అవి అతని స్వభావంలో పూర్తిగా అమరి ఉన్నవే అని మనకి అర్థం అవుతుంది.

ఎవరైనా పువ్వుల్ని తెంపినపుడు శ్రీనివాస్ బాధపడేవాడు. మీరు ఉపయోగిస్తే త్వరగా వాడిపోతాయి, కొమ్మనే ఉంటే ఎంతకాలం ఉండేవో, ఎంత మందికి ఆనందం కలిగించేవో - అని బాధ వ్యక్తం చేసేవాడు. ఎదుటివాళ్ళు చెప్పింది వినేవాడు, లోతుగా పరిశీలించేవాడు. ఏ విషయాన్ని కదిపినా శ్రీనివాస్ చెప్పే మాటల వెనుక చక్కని విశ్లేషణ, తార్కిక వివేచన ఉండేవని, ఏం చెప్పినా మళ్ళీ చక్కగా వివరిస్తుంటే తాము ఏం మాట్లాడలేకపోయే వాళ్ళమని అతడితో తన జ్ఞాపకాలని నెమరు వేసుకున్నారు - శ్రీనివాస్ బావ రూప్ కుమార్.

ముఖ్యంగా శ్రీనివాస్ పిల్లలన్నా, వాళ్ళతో కబుర్లన్నా పరవశించి ప్రాణం పెట్టేవాడు. పాటలంటే ఇష్టపడేవాడు. ముఖ్యంగా పాత ఘంటసాల పాటలంటే. 'పుష్పవిలాపం' మరీ ఇష్టం. పాత సినిమాలు ఇష్టం. తమిళ, కన్నడ, మళయాళ భాషల్లోనూ మరీ ఇంకా ఇతర భాషల్లోనూ పాటల్ని ఇష్టంగా వినేవాడు.

రాత్రిపూట చక్కగా పాటల్ని వింటూ ప్రయాణిస్తుంటే ఆ ఫీలింగ్ వేరుగా ఉంటుందని, ఎంతో శాంతిగా ఉంటుందని చెప్పేవాడు.

ఎప్పుడూ పంక్చువల్‌గా టైమ్ పాటించేవాడు. నేనేం చేసినా నాకు ఎప్పుడూ పూర్తి అవగాహన, కంట్రోల్ ఉంటాయి అని విశ్వాసంగా చెప్పేవాడు.

## నాకు ఇంత జీతం ఎందుకు?

ఒక సింపుల్ బనీను, లుంగీ, టైరు సోలింగ్ చేసిన మామూలు చెప్పుల జత, (మృతదేహం పక్క, ఫొటోలో చూడవచ్చు) భుజాలపైన ఒక టవల్ ఇదీ సాధారణంగా శ్రీనివాస్ వేషం. తనకంటూ ప్రత్యేకమైన కోరికలేవీ లేవని, వీరప్పన్ ముఠాని లొంగదీసి, పునరావాసం కల్పించాలని మాత్రమే అప్పుడప్పుడు అనేవాడని రూప్‌కుమార్ అంటారు.

"ఎప్పుడూ బట్టలు కూడా కొనుక్కునే వాడు కాదు. నేనే ఇక్కణ్ణించి కుట్టించి పంపించేదాన్ని. ఎంత కొడుకైనా అంత పెద్ద ఆఫీసర్ కదా, నేను పంపినవి నచ్చుతాయో లేదో అని అనుకునేదాన్ని - 'చాలా బాగున్నాయమ్మా' అనేవాడు. నాకు అది కావాలి, ఇది కావాలి అని ఏదీ లేదు"- తల్లి జయలక్ష్మి కళ్ళు తుడుచుకుంటూ చెప్పారు.

రాజమండ్రి వస్తే - అంత పెద్ద ఆఫీసర్ కూడా సైకిల్ మీద తిరగడానికి వెళ్ళిపోతాడు. ఫ్రెండ్సందరినీ కలవకుండా ఉండేవాడు కాదు.

నాకు ఇంత శాలరీ (జీతం) ఎందుకు? టి.ఎ., డి.ఎ. ఎందుకు, వాచ్‌మన్ ఎందుకు, ఎందుకీ లగ్జరీ, ఫార్మాలిటీస్, హంగామా అనేవాడు. ఎప్పుడూ ఎక్కడెక్కడ తిరిగినా టి.ఎ., డి.ఎ. క్లెయిమ్ చేసుకోలేదు. సి.ఎల్.గానీ, యల్.టి.సి. గానీ ఉపయోగించుకోలేదు. తన జీతంలో కూడా అధిక భాగం తన సేవా కార్యక్రమాలకే ఖర్చు పెట్టేవాడు.

ప్రభుత్వం సొమ్ము దుర్వినియోగం చేయకూడదనేవాడు. అవినీతిని, అక్రమార్జనని అసహ్యించుకునేవాడు, దూరంగా ఉండేవాడు.

ఉద్యోగంలో, సేవలో కొన్ని రోజులపాటైనా తిండీ, నీళ్ళు పట్టించుకోకుండా తిరుగుతూ ఉండేవాడని అంటారు.

## తెరవెనుకే... ఇష్టం!

శ్రీనివాస్ అక్కడ సాధించిన పనుల గురించి వేరేవాళ్ళద్వారా తెలుసుకుని, ఇక్కడ తల్లితండ్రులు అడుగుతుంటే, "అదంతా మా డ్యూటీ, గొప్పగా ఎలా చెప్పుకుంటాం" - అని తేలిగ్గా తీసి పారేశేవాడు.

తను పనిచేసే ప్రాంతంలో "సౌత్‌జోన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్" పేరిట పెద్ద స్పోర్ట్స్ ఈవెంట్‌ని శ్రీనివాస్ నిర్వహించాడు. నాటి కార్యక్రమం కోసం శ్రీనివాస్ స్వహస్తాలతో అందంగా చిత్రించి, తయారు చేయించిన మెమెంటోలు అతనిలో, దాగి ఉన్న 'ఆర్టిస్టు'కి అద్దం పడతాయి. అంతా తానై నిర్వహించినా ఆ సావనీర్లలోగానీ, ఫొటోల్లోగానీ పెద్దగా కనుపించడు. తెరవెనుక ఉండటాన్నే ఎక్కువ ఇష్టపడతాడు.

ఫొటోలపైన మోజులేదు. ఏదైనా ఈవెంట్‌లో ఫొటోల్లో సరిగ్గా రాలేదని ఎవరైనా అంటే, ఈవెంట్ ముఖ్యం, లొకేషన్ ముఖ్యం మనం సరిగ్గా రాలేదని బాధ ఎందుకు, అంతగా బాధపడేవాళ్ళు స్టుడియోకి వెళ్ళి తమఫొటోలు బాగా వచ్చేలా తీయించుకోవచ్చుగా అని మందలిస్తాడు. తన కార్యక్రమాలకి బాగా ప్రచారం వచ్చి పత్రికలవాళ్ళూ ఎంతమంది వచ్చి అడిగినా, వ్యక్తిగత ప్రచారానికి, ఇంటర్వ్యూ ఇవ్వడానికి ఒప్పుకునేవాడు కాదు. ఒకే ఒక్కసారి మాత్రం ఒక పత్రికకి ఇంటర్వ్యూ ఇచ్చాడు.

## రాజీలేదు

డ్యూటీలో ఒత్తిళ్ళకి లొంగే రకం కాదు శ్రీనివాస్. ఎక్కడో కర్నాటకలో డ్యూటీ ఎందుకూ, మన ఆంధ్రరాష్ట్రా నికి ఎలాగైనా ప్రయత్నించి పోస్టింగ్ వేయించుకోవచ్చు కదా - అంటే,స్వంత రాష్ట్రమైతే, ఇక్కడ ఒత్తిళ్ళు చాలా ఎక్కువ ఉంటాయని వాటికి తాను తల ఒగ్గలేనని, అందుచేత వేరే రాష్ట్రంలో పని చేయడానికే ఇష్టపడతానని కరాఖండిగా చెప్పాడు శ్రీనివాస్.

రికమెండేషన్ చేయమంటే ఛస్తే కుదరదని చెప్పేవాడు. ఊళ్ళో పోటీ పరీక్షలకి వెళ్ళబోతూ ఏదైనా రికమెండేషన్ కావాలని ఇంట్లో బాగా కావలసినవాళ్ళు ఎవరైనా అడిగితే,



శ్రీనివాస్ నవ్వి, - ఊళ్ళోనే అటువంటి పరీక్షలు రాసి పాసయిన వాళ్ళని నలుగుర్ని పిలిపించి-వాళ్ళని చెరో నాలుగు ప్రశ్నలు చెప్పమని అడిగేవాడు. అవే ప్రశ్నలు రికమెండేషన్ అడిగిన వాళ్ళ చేతికిచ్చి బాగా ప్రిపేర్ అవమని చెప్పి పంపేవాడు.

స్పోర్ట్స్ మీట్ తరువాత శ్రీనివాస్ పేరు ప్రభుత్వవర్గాల్లో కొంత నానింది. ఒకసారి స్వయంగా రాజీవ్‌గాంధీ ఆఫీసు నుంచే ఏదో 'కోల్ పర్చేజ్'కి సంబంధించి ఫోన్ వస్తే తిరస్కరించే గట్స్ ప్రదర్శించాడనే ప్రచారం ఉంది.

అప్పట్లో శ్రీనివాస్‌ని ఒక్కనెలరోజులు లీవ్‌పెడితే 50లక్షలు ఇస్తామని స్మగ్లర్లు ప్రయత్నించినట్టుగా కూడా ఒక టాక్‌ఉంది. వీటిల్లో నిజానిజాలుతేల్చడం కష్టం కానీ శ్రీనివాస్ తనకెరియర్‌లో స్మగ్లర్ల వెన్నువిరిచాడని, నిష్కర్షగా వ్యవహరించాడనేది మాత్రం నిజం.

## జీతం కూడా ఇవ్వలేదు

వీరప్పన్ వ్యవస్థతో తలపడ్డాడని భావించడం ఎంత తప్పో శ్రీనివాస్ ప్రభుత్వానికీ, అధికారానికీ లేదా వ్యవస్థకీ ప్రతినిధి అని భావించడమూ అంతే తప్పు.

బహుశా శ్రీనివాస్ వ్యవస్థతో పోరాడినంతగా మరెవరూ పోరాడలేదేమో - కాకపోతే శ్రీనివాస్ పోరాటం నిర్మాణాత్మకమైనది, ఆయన పద్ధతులూ భిన్నమైనవి.


శ్రీనివాస్ కృషిని చదువుతుంటే అతడిని ప్రభుత్వం, తోటి అధికారులు ఏకగ్రీవంగా బలపరిచారనీ మెచ్చుకున్నారని భావిస్తే పొరపాటు. శ్రీనివాస్‌ది ఒక విధంగా చెప్పాలంటే ఒంటరి పోరాటం.

జీవించిన కాలంలో డిపార్ట్‌మెంట్‌లో శ్రీనివాస్ ఎదుర్కొన్న వెటకారాలకి, అవమానాలకీ, వేధింపులకీ లెక్కలేదు.

మొదట డిపార్ట్‌మెంట్‌లో అవినీతి, అక్రమార్జన పట్ల శ్రీనివాస్‌కి వ్యతిరేకత ఉండటంతోటే సమస్య ప్రారంభమయ్యింది.

శ్రీనివాస్ సంస్కరణ వాదాన్ని పోలీసు అధికారులు నిరసించారు. వీరప్పన్‌లో పరివర్తనకి ప్రయత్నిస్తాననడాన్ని హేళన చేశారు. రెండు డిపార్ట్‌మెంట్లు (ఫారెస్ట్, పోలీస్) మధ్య రాజకీయాలు, రెండు రాష్ట్రాలమధ్య (తమిళనాడు, కర్నాటక) విబేధాలు, ప్రతీ డిపార్ట్‌మెంట్‌లోనూ, ప్రతీ సెక్షన్‌లోనూ తగాదాలు, రాజకీయాలు, ముఠాలు... అన్నిటినీ మించి ప్రొఫెషనల్ జెలసీ.

గ్రామస్థులు శ్రీనివాస్‌ని ఎందుకు అంతగా ప్రేమిస్తారని, అతడికే ఎందుకు ఇన్‌ఫర్మేషన్



చెపుతారనీ అనేకమంది ఆఫీసర్లకి గుర్రుగా ఉండేది. ఈ వత్తిడులు, రాజకీయాలతో ఇమడలేక శ్రీనివాస్ కనీనం రెండుసార్లు జాబ్‌కి రిజైన్ చేసి పూర్తిగా ప్రజాసేవకి అంకితం ఐపోదామనుకున్న సందర్భాలు ఉన్నాయి.

శ్రీనివాస్ అనేకసార్లు కరడుగట్టిన నేరస్తుల్ని లొంగదీసినపుడు వాళ్ళని అరెస్టు లాంటి మామూలు ప్రొసీజర్లో పెట్టకుండా తన క్యాంపులో ఉంచుకుని వాళ్ళని ప్రజాజీవితంలోకి ప్రవేశపెడ్తున్నాడనే విమర్శలు వత్తిడులు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. తప్పనిసరై శ్రీనివాస్ అలాంటి కొందరి సరెండర్స్‌ని అరెస్టులుగా మార్చినపుడు, శ్రీనివాస్ అసలు ఉద్దేశం అందర్నీ జైలుపాలు చేయడం మాత్రమేనని - తప్పుగా అర్థం చేసుకుని, లొంగుదామనుకున్న గ్యాంగు సభ్యులు పునరాలోచనలో పడటం జరిగిన సందర్భాలు ఉన్నాయి. అప్పుడు ఆ పరిస్థితిని బ్యాలెన్స్ చేయడానికి శ్రీనివాస్ అపరిమితంగా శ్రమించాడు. లొంగి అరెస్టైన గ్యాంగు మెంబర్ల కోసం అడ్వొకేట్లని పెట్టాడు. కొందరికి బెయిలు సాధించాడు.

వీరప్పన్ బంధువులందరిలాగే వీరప్పన్ చెల్లెలు "మారి" కూడా శ్రీనివాస్ సంస్కరణ ఉద్యమానికి ఆకర్షించబడింది. ఆమెకు వైద్యశాలలో నర్సుగా శ్రీనివాస్ ఉపాధి కల్పించాడు. ఒకసారి శ్రీనివాస్‌పైన జరిగిన విషప్రయోగ ప్రయత్నాన్ని ఆమె బయట పెట్టిందని చెపుతారు.

అసూయపరులైన పోలీసులు ఆమెకీ, శ్రీనివాస్‌కీ మధ్య సంబంధం అంటగడుతూ ప్రచారం చేశారు. అందుకు అసలు ఆస్కారం లేదని, శ్రీనివాస్‌కి దైవభక్తి, నైతిక నిష్ట ఉన్నాయని అతడికి, స్త్రీ వ్యసనం ఏనాడూ లేదని తల్లితండ్రులు బంధువులు అంటున్నారు. శ్రీనివాస్‌పైన వేరే ఆరోపణలు కూడా ఇప్పటి వరకూ రాలేదు.

తనకూ శ్రీనివాస్‌కీ సంబంధం ఉందని ప్రచారం చేయడంతో ఆమె తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందని అంటారు.

సంబంధం సంగతి తెలీదుకానీ, శ్రీనివాస్ ఆమెపైన ఏదైనా దుర్మార్గం తలపెట్టాడని గానీ, అత్యాచారం వంటివి చేశాడనిగానీ స్పష్టమైన ఆరోపణలు ఇప్పటి వరకూ వీరప్పన్‌తో సహా ఎవ్వరూ చేయలేదని గుర్తుపెట్టుకోవాలి.

శ్రీనివాస్‌కి ఇన్ఫర్మేషన్ ఇచ్చేవాళ్ళనందర్నీ పోలీసులు మాకెందుకు ఇన్ఫర్మేషన్ ఇవ్వట్లేదని వేధించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. శ్రీనివాస్ క్యాంపులో లేనపుడు ఆమె పోలీసుల వేధింపు కారణంగా ఆత్మహత్య చేసుకుందనే అభిప్రాయం ఉంది.

వీరప్పన్‌ని శ్రీనివాస్ ఒక్కడే మంచి మార్గంలోకి తేగలడని, అలా తేవాలని - ఆమె ఆశించిందని చెపుతారు. లొంగిపోయి శ్రీనివాస్‌కి అనుకూలంగా ఉన్నందుకు వీరప్పన్ బెదిరించిన కారణంగా ఆమె ఆత్మహత్య చేసుకుందనే కథనం కూడా ఉంది.

శ్రీనివాస్ కృషి ఫలితంగా స్మగ్లింగ్ అక్రమ కార్యకలాపాలు జోరు తగ్గాయి. దాంతో ఇంక టాస్క్ ఫోర్స్ అవసరం లేదనే వాదనలు మొదలయ్యాయి.

శ్రీనివాస్ ఎంత మొత్తుకున్నా వినకుండా టాస్క్ ఫోర్స్ స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీనివాస్ పదవీ కాలాన్ని ఏడాదికే పరిమితం చేసి ఆపేశారు. అతనికిచ్చిన సెక్యూరిటీ తగ్గించారు. అతని ప్రాణానికి ఎంతో ప్రమాదం ఉందని తెలిసి కూడా శ్రీనివాస్ దగ్గర్నుంచి అతని రక్షణాయుధం ఎ.కె. 47 కూడా ఉపసంహరించు కున్నారు. ఆఖరి 4, 5 నెలలు ప్రొసీజర్ల

పేరుతో జీతం కూడా ఇవ్వకుండా వేధించారంటే శ్రీనివాస్ ఎంత ఒంటిరి పోరాటం చేశాడో అర్థం చేసుకోవచ్చు.

## అయామ్ పార్ట్ ఆఫ్ దెమ్

ఆఖరి నాలుగు అయిదు నెలల్లో జరిగిన సంఘటనల్లో వీరప్పన్ తనకుట్ర చాలా పకడ్బందీగా అమలు చేశాడు. "నా ప్రజలే నాకు సహాయ నిరాకరణ చేస్తున్నారు. ఇన్నాళ్ళకి శ్రీనివాస్ లాంటి మంచి అధికారి రావడం వల్ల మా ఊరు బాగుపడింది, మా వాళ్ళు బాగుపడి గౌరవప్రదంగా జీవిస్తున్నారు. నేను ఈ నేరజీవితాన్ని వదిలిపెట్టి లొంగిపోతాను. నేను లొంగితే శ్రీనివాస్‌కే లొంగిపోతాను. నా పైన రెండు సందర్భాల్లో కాల్పులు జరపకుండా ఆయన మానవత్వం చూపించాడు. ఆ కీర్తి ఆయనకే దక్కాలి. ఆయనకే లొంగిపోతాను" అంటూ ఇదేవిధమైన మాటలు చాలాచోట్ల ప్రచారంలోపెట్టాడు. ఇది కుట్రలో మొదటి భాగం.

తన హత్యకి కేవలం రెండు వారాల ముందు జరిగిన ఇంటర్వ్యూలో "హృదయాలని గెలుచుకోవడమే నా వ్యూహం... అర్థం లేని రక్తపాతం మీద నాకు నమ్మకం లేదు" అని శ్రీనివాస్ స్పష్టంగా చెప్పాడు.

తను అత్యంత ప్రమాదకరమైన వాతావరణంలో ఎటువంటి రక్షణా లేకుండా జీవిస్తున్నాడని అభ్యంతర పెట్టిన వారికి జవాబుగా "అయామ్ పార్ట్ ఆఫ్ దెమ్" అని విశ్వాసంగా ప్రకటించాడు శ్రీనివాస్. ఆ గ్రామమే తన స్వస్థలమనీ ఆ గ్రామస్థులే తన స్వజనులనీ రక్తబంధువుల కంటే ఎక్కువనీ శ్రీనివాస్ అనేక సందర్భాల్లో చెప్పాడు.

ఏడాది ముందుగా ఓ సారి శ్రీనివాస్‌ని హత్యచేసి అతని దగ్గిరున్న ఎ.కె. 47 అపహరించాలని కొందరు పథకం వేశారు. టాస్క్ ఫోర్స్ చీఫ్‌కి ఆ సంగతి తెలిసి శ్రీనివాస్‌ని హెచ్చరించినపుడు ఆ కుట్ర భగ్నమైంది. శ్రీనివాస్ ఆ కుట్రదారులని మనస్ఫూర్తిగా క్షమించాడు. తర్వాత కాలంలో వాళ్ళలో అనేకమందిని తన అంతరంగికులుగా పరిగణించాడు. వాళ్ళలో కనీసం 25 మందికి డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పించాడు.

చివరికి తాను చచ్చిపోయే 3 రోజుల ముందు కూడా - వీరప్పన్ గ్యాంగులోని ఒక వ్యక్తి కొడుక్కి ఉద్యోగం ఇప్పించాలని ఒక పోలీస్ ఆఫీసర్‌ని అడిగాడని చెపుతారు.

జీవితంలో మొదటిసారి శ్రీనివాస్ అది కూడా తను చనిపోవడానికి కొన్ని రోజులముందు, పి.ఎఫ్ నుంచి 50,000/- అప్పు తీసుకున్నాడు (అందుకతనికి పూర్తి ఎలిజిబిలిటీ ఉంది) కొంత భూమి కూడా సేకరించాడు. వీరప్పన్ లొంగిపోయేది తథ్యమని - ఆ తర్వాత తన కార్యక్రమాల కోసం ఒక పునరావాస కేంద్రం అవసరమని భావించి, దాన్ని ఏర్పరిచేందుకు ప్రయత్నాలు కూడా ప్రారంభించాడు.

## దేవుడు మోసం చేశాడా?

"మంచే జరగాలని ఆశిద్దాం. అంతా సరిగ్గా జరగాలని దేవుని ప్రార్థిద్దాం"- ఇవి చచ్చిపోయే ముందు రోజు రాత్రి 12 గంటల 20 నిముషాలకి (అంటే 1991 నవంబర్ 10వ

తేదీ ఉదయం 00గం॥ 35ని॥కి - అంటే చచ్చిపోవడానికి కేవలం కొన్ని గంటల ముందు) డిపార్ట్‌మెంట్‌ని ఉద్దేశించి రాసిన ఒక చిన్న చీటీ లాంటి లేఖలో శ్రీనివాస్ మాటలు.

కరడుకట్టిన కిరాతకత్వం, మూర్తీభవించిన మానవత్వాన్ని ముక్కలు ముక్కలుగా ధ్వంసం చేసి వికృతంగా నవ్వినరోజు అది-నమ్మిన ఆదర్శం కోసం శ్రీనివాస్ అంతిమ బలిదానంతో అమరుడైన రోజు అది - చీకటి, వెలుతురుని మింగేసిన రోజు - ఆ రోజు నవంబర్ 10.

ఆ ఘటనాక్రమం కొన్నాళ్ళ ముందే ప్రారంభమైంది.

నవంబర్ 8న శ్రీనివాస్ ఒక పెళ్ళికి వెళ్ళాడు. అతనితోపాటు వీరప్పన్ సోదరుడు అర్జునన్ కూడా ఉన్నాడు. ఆ రోజు అక్కణ్ణించి మాయమైన అర్జునన్ 9వ తారీకు

# మా మాట ఎవరు వింటారు?

## అమరవీరుడి తల్లితండ్రుల ఆత్మఘోష

ఏ దేశం కోసం తమకొడుకు శ్రీనివాస్ 36 సంవత్సరాల చిన్నవయసులో బలిపీఠం మీద ప్రాణాలిచ్చాడో, ఆ దేశం, ఆ ప్రభుత్వాలు - అమానుషంగా, పైశాచికంగా చిత్రహింసలపాలు చేసి, తమ కొడుకు ప్రాణాలను తీసిన కిరాతకుడు వీరప్పన్‌కి - తమ కళ్ళెదురుగానే లొంగిపోతుంటే... ఆగ్రహంతో రగిలిపోతున్న, ఆవేదనతో కుమిలిపోతున్న హృదయాలు వారివి.

వీరప్పన్‌కి డబ్బు ఇవ్వాలని తమిళనాడు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారన్న వార్త శ్రీనివాస్ మాతృమూర్తి కలచి వేస్తోంది. "డబ్బు ఎందుకు ఇస్తావని ఆయన్ని ఓ సారి అడిగి చచ్చిపోతాను బాబూ... నా కొడుకు చచ్చిపోయాడు - ఇంక ఎంతమంది ఆఫీసర్లు చచ్చిపోవాలని డబ్బు ఇస్తావు - అని అడుగుతాను" అని మాతృమూర్తి జయలక్ష్మి రుద్ధ కంఠంతో ప్రశ్నిస్తుంటే, "పిచ్చిదానా మననెవరు అక్కడికి రానిస్తారే..." అని శ్రీనివాస్ తండ్రి అనంతరావు ఆమెను వారించారు. "పోన్లెండి చంపెయ్యనివ్వండి. నేను మాత్రం ఆయన్ని ఓ సారి అడుగుతాను. నా కొడుకు చచ్చిపోయినపుడు వీరప్పన్‌ని పదిరోజుల్లో పట్టుకుంటామని అంతా చెప్పారు. ఇప్పుడు పది సంవత్సరాలైంది. ఈ ప్రభుత్వాలు అతడ్ని పట్టుకోలేవా?" అని జయలక్ష్మి ఆవేశంగా ప్రశ్నించారు.

"వీరప్పన్ పుస్తకానికి తెలుగువాళ్ళు ఉండి గంధపు చెక్కల వీరప్పన్ అని పేరు ఎలా పెడతారు? గంధపు చెక్కల అనేదేమైనా ఇంటిపేరా? తమిళంలోనే మొదటి వేట, మొదటి హత్య అని నేర స్వభావం ధ్వనించేలా పేరు పెట్టారు కదా, తెలుగువాళ్ళు ఉండి నా కొడుకుని ఖండఖండాలుగా నరికేసిన నరరూప రాక్షసుడి పుస్తకానికి ఆ పేరు ఎలా పెడతారు, నరహంతక వీరప్పన్ అని పెట్టాలి. ఇలా అంటున్నానని కాదు. తండ్రిగా నా బాధచెపుతున్నాను అంతే-" అని ఆవేదన వెలిబుచ్చిన అనంతరావు - "ఇదే విషయాన్ని మీకు విజయవిహారంలో ప్రశ్నించినందుకు ఊరట కలిగింది" అని చెప్పారు. "నా కొడుకు పట్ల తప్పుడు రాతలు ఎందుకు రాస్తున్నారు?" అని అనంతరావు బాధని వ్యక్తం చేశారు. శ్రీనివాస్ జీవితంలో నిజానిజాలని తెలుసుకో దలుచుకున్న వాళ్ళెవరైనా, ఇప్పుడైనా గోపీనాథం గ్రామానికి వెళితే, ఇప్పటికీ అక్కడి ప్రజలు శ్రీనివాస్ పట్ల ఎంత ఆప్యాయత చూపిస్తారో ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చని ఆయన అన్నారు. శ్రీనివాస్ చనిపోయిన తర్వాత తాము గోపీనాథం గ్రామం వెళ్లినపుడు ఆ గ్రామం గ్రామమంతా తమని చూసి దుఃఖాన్ని ఆపుకోలేక రోదించారని, అక్కణ్ణుంచి కదలనివ్వలేదని ఆయన చెప్పారు.

గోపీనాథం గ్రామం నుంచి ఇప్పటికీ ప్రతీఏటా ఈ దంపతులకి ప్రజలు రాసే ఉత్తరాలు

గోపీనాథంలో తేలాడు. మరోవక్క శ్రీనివాస్ యమ్.యమ్.హిల్స్‌లో అధికారులతో మాట్లాడుతుండగా శ్రీనివాస్‌ని గోపీనాథం రమ్మని అర్జునన్ అనేకసార్లు వైర్‌లెస్ మెసేజెస్ పంపించాడు. శ్రీనివాస్ ఆ రోజు ఫారెస్టు సెక్రటరీ, సి.సి.యన్ (డెవలప్‌మెంట్) హాజరైన సమావేశంలో కనీసం డిన్నర్‌కైనా ఉండకుండా గోపీనాథం బయల్దేరాడు.

ప్రేమమూర్తి క్రీస్తుని పట్టించింది ఆయన వెన్నంటి ఉన్న శిష్యుడే. మిగతా ప్రధాన శిష్యులు కూడా ఆ రాత్రి ఆయనెవరో తమకి తెలీదంటారు.

శ్రీనివాస్ అంతిమ క్షణాల్లో కూడా అతడి ప్రేమనీ, సహాయాన్నీ పొందిన వాళ్ళే అతడికి ద్రోహం చేసిన పద్ధతి బాధని, విభ్రమాన్ని గొలిపే సంగతి.

---

అందుతూనే ఉన్నాయి. వాటిలో అనేక ఉత్తరాలు, తమిళభాషలోనే ఉండటం గమనార్హం. ఆ ఉత్తరాల్లో ఈ దంపతులని గోపీనాథం గ్రామం రమ్మని కోరే ఉత్తరాలు, శ్రీనివాస్ త్యాగాన్ని ప్రస్తుతించే ఉత్తరాలు, మీరే మా తల్లి తండ్రి అంటూ కష్టాలు చెప్పుకునే ఉత్తరాలు అనేకం వున్నాయి.

శ్రీనివాస్ మరణానికి అసలైన కారణాలని సి.బి.ఐ. విచారణ ద్వారా వెలికి తీయాలని కోరుతూ 1992లోనే అనంతరావు సుప్రీంకోర్టులో పోరాడారు. శ్రీనివాస్ ఆశయాలని కొనసాగించాలని పట్టుదలగా అనంతరావు 2 సంవత్సరాలు కర్నాటక రాష్ట్రంలో ఉన్నారు. అక్కడ శ్రీనివాస్ అప్పట్లో పునరావస కేంద్రాన్ని నిర్మించాలని కలలుగన్న భూమిలోనే "కీర్తి చక్ర శ్రీనివాస్ మెమోరియల్ ఎస్టేట్"ను నెలకొల్పాలని 2 సంవత్సరాలు ఒంటరిగా పట్టుదలగా ప్రయత్నించినా సాధ్యపడలేదని, ఎన్ని సార్లు విన్నవించుకున్నా అధికారులు కనీసం కరెంటు సౌకర్యాన్ని కూడా ఇచ్చి సహకరించలేదని ఆయన తెలిపారు.

కొందరు పోలీసు అధికారులు, ఇతర డిపార్ట్‌మెంట్ అధికారులు ప్రజల్ని వేధించి,బాధించే మాటనిజమేనని-అక్కడి ప్రజల అభ్యున్నతి కోసమే తమ కుమారుడు పాటు పడ్డాడు కాబట్టి-అక్కడి ప్రజలకి న్యాయం జరగాలని, దుర్మా ర్గులైన అధికారులకి శిక్షలు పడాలని తామూ కోరుతున్నామని ఆయన అన్నారు.

రాజ్‌కుమార్ పట్ల తమకేమి వ్యతిరేకత లేదని, కానీ తన ప్రాణాలకోసం వీరప్పన్ అన్యాయంగా కోరిందల్లా తీర్చాల్సిన అవసరం లేదని ప్రకటించి ఉంటే - ఆయన రియల్ హీరో అయ్యేవారని అనంతరావు అభిప్రాయపడ్డారు.

వీరప్పన్ పట్టుకోవడానికి చిత్తశుద్ధి లేక ప్రభుత్వాలు ప్రయత్నించట్లేదని, ప్రయత్నిస్తే సాధ్యమేనని ఆయన వ్యాఖ్యానించారు.

శ్రీనివాస్ మరణించాక గత తొమ్మిదేళ్ళూ, ఆ దంపతులు దేశమంతా డెహ్రాడూన్ నుంచి, బెంగుళూరు వరకూ కాలికి బలపం కట్టుకుని తిరుగుతూనే ఉన్నారు. శ్రీనివాస్ కృషి, త్యాగం వ్యర్థం కాకుండా విన్నపాలు, విజ్ఞప్తులు చేస్తూనే వున్నారు.

"మా మాట ఎవరు వింటారు?, మా బాధ ఎవరికి పట్టింది? రోజు రోజూ కొత్త ఇష్యూస్ వచ్చి పడుతుంటే, ఈ పాత చరిత్రని పట్టుకు వేళ్ళాడుతున్నారేమిటని ఫాస్ట్ యుగంలో జనం తీసిపడేస్తారు. ఈ కథంతా మేము ప్రపంచానికి వ్రాసి తెలియబరచినా చదివే నాథుడు ఏడీ?" అని ఆ దంపతులు నిస్సహాయంగా అన్నారు.


అంతలోనే "సర్లేండి, ఎవరూ పట్టించుకోకపోతే ఏమయింది? దేశాన్ని పాలించడానికి ఐ.ఏ.యస్, ఐ.ఎఫ్.యస్, ఆఫీసర్లు శిక్షణపొందే అకాడమీల్లో ప్రతీ ఏటా మమ్మల్ని పిలిచి మాట్లాడమని అడుగుతున్నారు - ఇది మా కుమారుడి త్యాగానికి గుర్తింపుగా వచ్చిన ఘనతేకదా" - అని వారిద్దరూ తృప్తి పడుతున్నారు. ('విజయవిహారం', అక్టోబర్ 2000)

ఆమాటకొస్తే వీరప్పన్‌కి కూడా శ్రీనివాస్ అనేకసార్లు ప్రాణహాని జరగకుండా అడ్డుపడ్డాడు.

కొద్ది రోజుల క్రితమే శ్రీనివాస్ జోక్యంతోనే అర్జునన్ బెయిల్‌పై విడుదల అయ్యాడు.

అర్జునన్‌ను పూర్తిగా నమ్మవద్దని ఊళ్ళో అనేక మంది శ్రీనివాస్‌కి చెప్పారని అంటారు. ఊర్లో శ్రీనివాస్ వలన సాయం పొందిన అనేక కుటుంబాలు, స్త్రీలతో సహా చెప్పినా శ్రీనివాస్ అర్జునన్‌ని నమ్మాడు. అర్జునన్ కూడా మొదట్లో వీరప్పన్‌ని లొంగిపొమ్మని చెప్పడానికే వెళ్ళాడు. అదేమాట అన్నకి చెప్పాడు కానీ శ్రీనివాస్‌ని అడ్డు తొలగించుకోవాలనే తన దుష్ట ప్రయత్నంలో అన్నకి తోడ్పడేందుకు ఒప్పుకున్నాడు.

కొద్దిరోజులక్రితం బర్గూర్‌లోని క్వారీ కంట్రాక్టర్ దగ్గర్నుంచి అర్జునన్ 5 లక్షల రూపాయలు గుంజాడని, కాబట్టి అతను వీరప్పన్‌తోటి కలిసే ఉంటాడని ఆరోపణలు వచ్చాయి.


Dear Vijay/udaykumar,

We are leaving the place by 5 AM or so. By the time we reach Ramadali junction, it may be 9 or 10 AM. After discussions for an hour or two, we may reach yerakyam from Ramadoli by 2 PM or so. Hence don't get worried even if the process is delayed. Come with two jeeps to yerakyam area by 2 PM and wait. No police to be brought to the place. I am going with Keera Ponnuswamy, Arjuna S/o Kotta Kunisamy, Mallesa Madaiah, T R ~~Samo~~ and other Gounder Kunisamy. Also if possible Gunna S/o Landian and Krishna S/o Kandian. After reaching yerakyam, we will decide what to do further. You should show patience, even if we are delayed. Let us hope "good" and pray the almighty that every thing goes well. Let us wish all the best to each other.

bye

10/4/91
Kunisamy Jahu home
00 35 AM

Yours affly
[illegible]

చనిపోవడానికి కేవలం కొన్ని గంటల ముందు డిపార్ట్‌మెంట్‌ని ఉద్దేశించి శ్రీనివాస్ స్వహస్తాలతో రాసిన చీటి

వీరప్పన్ లొంగిపోవడానికి అంగీకరించాడని, శ్రీనివాస్ చేసిన మంచి పనులవల్ల వీరప్పన్ మనసు మారిందని, శ్రీనివాస్‌కే లొంగిపోవాలని నిశ్చయించు కున్నాడని, భవిష్యత్తులో న్యాయపోరాటానికి అవసరమైన డబ్బు కూడా సమకూర్చుకున్నాడని అందుకే నవంబర్ 10వ తారీకు ఉదయం నిర్దేశిత స్థలానికి వస్తే లొంగిపోతాడని - 5వ తారీకు రాత్రి శ్రీనివాస్‌ని కలిసినపుడు అర్జునన్ ఒప్పించగలిగాడు.

ఆ రాత్రి శ్రీనివాస్ వెంట ఉన్నది - కృష్ణ అనే వాచర్, గ్రామస్థులు పొన్నుస్వామి, మనుస్వామి, ధొడక్కన్ పెరుమాళ్. కృష్ణ ఒకప్పుడు వీరప్పన్ గ్యాంగ్‌లో ఉండి స్మగ్లింగ్‌లో పాలు పంచుకున్నవాడే. తరువాత లొంగిపోయాక శ్రీనివాసే కృష్ణకి ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌లో వాచర్ ఉద్యోగం ఇప్పించాడు.

పొన్నుస్వామి గౌండర్ వీరప్పన్‌కి స్వయానా మేనమామ. పొన్నుస్వామి ఇంట్లోనే చర్చలు జరిగాయి. ఆ చర్చల్లో - దుష్టుడైన వీరప్పన్ ఎంత నీచుడో తనకి తెలుసునని, అతని జిత్తుల్ని నమ్మవద్దని - శ్రీనివాస్‌ని పొన్నుస్వామి చేతులు జోడించి అర్థించాడని చెపుతారు. గతంలో రెండు సంవత్సరాల క్రితం ఇయ్యనన్ ఇంకొందర్ని వీరప్పన్ ఇలాగే పిలిచి

చంపేశాడు. శ్రీనివాస్‌కి కూడా ఈ సంగతులన్నీ తెలుసు. పొన్నుస్వామి గౌండర్ ఇల్లు ఊరికి అర్ధకిలోమీటరు దూరంలో ఉంది. అర్జునన్ శ్రీనివాస్‌ని పొన్నుస్వామి ఇంటికి ఆ రాత్రి తెలివిగా రప్పించాడని ఊళ్ళో మిగతా ప్రజలందరికి తెలిసి అందరూ శ్రీనివాస్‌ని వెళ్ళొద్దని వారించకుండా ఊరికి దూరంగా ఉన్న ప్రదేశాన్ని తెలివిగా ఎంచుకున్నాడని అంటారు.

ఆ రాత్రి పొన్నుస్వామి ఇంట్లో, పొన్నుస్వామి, మునుస్వామి, కృష్ణ, పెరుమాళ్ శ్రీనివాస్ సమక్షంలోనే అర్జునన్‌తో గొడవపడ్డారు. శ్రీనివాస్ సర్దిచెప్పాడు. సలహాలని పెడచెవిన పెట్టాడు. మంచే జరుగుతుందని నమ్మాడు. తాను సమాచారం పంపించినపుడు రెండు జీపుల్లో ఆయుధాలు లేని పోలీసులని పంపాలని డిపార్ట్‌మెంట్‌కి చీటి పంపించాడు.

ఉదయం ఆలయంలో ప్రార్థనలు ముగించుకుని నిరాయుధంగా అర్జునన్ వెంట, శ్రీనివాస్ వీరప్పన్ చెప్పిన స్థలానికి బయలుదేరాడు. శ్రీనివాస్‌తోపాటు కృష్ణ, పొన్నుస్వామి, మునుస్వామి, పెరుమాళ్ అనే వాళ్ళు కూడా ఉన్నారు. ఈ సంఘటనలన్నీ బయటకి వచ్చాక ప్రపంచానికి చెప్పింది వీళ్ళే.

యెర్కాయం దగ్గిర మొదటి కాలవ దాటగానే అర్జునన్ ముందుకు వచ్చి ఒక వందగజాలు ముందు నడవడం ప్రారంభించాడు.

రెండో కాలువని దాటబోతూ శ్రీనివాస్ తన కాళ్ళూ చేతులూ కడుక్కునేందుకు వంగాడు. వెంటనే అర్జునన్ వీరప్పన్‌కి సంజ్ఞ చేశాడు. తన ముఖ్య అనుచరుడైన "కొళందై"ని చూసి "కొళందై ఆడి" (కొళందై కొట్టు) అని వీరప్పన్ ఆజ్ఞాపించాడు. మొదట కొళందై కొంచెం సందేహించాడని చెపుతారు. (ఎందుకంటే కొళందై కుటుంబాన్ని కూడా కష్టాల్లో ఉన్నపుడు శ్రీనివాస్ ఆదుకున్నాడు.) కానీ వీరప్పన్ మళ్ళీ ఆజ్ఞాపించేసరికి కొళందై శ్రీనివాస్‌ని వెనకనించి కాల్చాడు. ఇదంతా కేవలం కొన్ని సెకన్లలో జరిగిపోయింది. కూలిపోతున్న శ్రీనివాస్‌పైన వీరప్పన్ రెండో బుల్లెట్ పేల్చాడు. వెంటవచ్చిన గ్రామస్తులు పారిపోయారు.

పొన్నుస్వామి పడిపోతున్న శ్రీనివాస్‌ని పట్టుకుని తలని తన ఒళ్ళో పెట్టుకున్నాడని ఒక వెర్షన్ ఉంది. అప్పటికి శ్రీనివాస్‌కి ఇంకా కొద్దిగా స్పృహ ఉంది. దగ్గరకి వచ్చిన వీరప్పన్‌తో శ్రీనివాస్ ఆఖరి మాటల్ని మాట్లాడాడు. "నీ మాటని నమ్మి ఇక్కడకి వచ్చాను. నా మాటల్ని కాదనకు గోపీనాథం వెళ్ళి ఎ.సి.యఫ్.కి లొంగిపో" అన్నాడని చెపుతారు. అంతే, ఇక శ్రీనివాస్‌కి పూర్తిగా స్పృహ పోయింది.

వీరప్పన్ హుంకరించి తన మామ పొన్నుస్వామిని పక్కకు తోశాడు. ముఠా సభ్యులంతా కలిసి శ్రీనివాస్ శరీరాన్ని ఛిద్రం చేశారు. కిరోసిన్‌తో కాల్చారు. తలని కోశారు. తర్వాత వీరప్పన్ వికటాట్టహాసంతో శ్రీనివాస్ తలని తన విజయచిహ్నం కింద నందళ్ళిలో ఉన్న భార్యకి చూపడానికి తీసుకెళ్ళిపోయాడు.

తర్వాత 1993, 1996 ఇంటర్వ్యూల్లో వీరప్పన్ శ్రీనివాస్ హత్యని ఇలా వర్ణించాడు:

*..అతడు వాయు వేగంతో నా వద్దకు చేరుకున్నాడు. నాలో రక్తం ఉడికిపోతుంది. అతడి ఛాతీని చీల్చి, అందులోంచి వేడి రక్తం ఉబికి వస్తూంటే చూసే సమయం కోసమే నేను కాచుకుని కూర్చున్నాను. నేను నా తుపాకి తీసుకుని అతడు ఏమి జరుగుతోందో తెలుసుకునే లోగానే కాల్చి పారేశాను. తర్వాత అతడి తలను, చేతులను*



కూడా నరకడం ప్రారంభించాను. నాపై మరతుపాకులను ఎక్కుపెట్టాలని కోరుకున్న చేతులు అవే. తర్వాత నేను అతడి తలను గుర్తుగా, భద్రంగా దాచాను.. అతని శరీరం మీద రెండులీటర్ల పెట్రోలు పోసి తగులబెట్టాను. తలను తీసుకెళ్ళి జుట్టును కాల్చేశాను..మేమూ, తమ్ముడు అర్జునన్ కలిసి నిప్పు రాజేసి ఆ డి.ఎఫ్.ఓ. తలను పూర్తిగా తగుల బెట్టేశాం...

ఈ కధనాలన్నిటినీ శ్రీనివాస్ తండ్రి అనంతరావు ప్రశ్నిస్తున్నారు. ఆ ఘటనపై పూర్తి స్థాయి నిజాల్ని నిర్ధారించడానికి సి.బి.ఐ. చేత విచారణ జరపాలని ఆయన కోరిక.

మొత్తం కధనంలో అనేక చిక్కుముళ్ళు, ప్రశ్నలూ అలాగే మిగిలిపోయాయని వాటి జవాబు తెలుసుకోవాలని ఆయన అడుగుతున్నారు. నిజానికి అప్పట్లోనే అనేక పత్రికలు ఈ ప్రశ్నల్ని లేవనెత్తాయి.

అసలు శ్రీనివాస్ మరణం గురించి బయట ప్రపంచానికి నిజానిజాలు చెప్తున్న వాళ్ళంతా ఏదో ఒక దశలో వీరప్పన్‌తో సంబంధం ఉన్నవాళ్ళూ అతని బంధువులేననేది అనంతరావుగారి మొదటి అభ్యంతరం.

అసలు ఆ రాత్రే పొన్నుస్వామి తదితరులు శ్రీనివాస్‌ని బందీగా నిర్బంధించి ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వీరప్పన్ చాలారోజుల క్రితమే గ్రామంలోని తన బంధువులపై వత్తిడి ప్రారంభించాడని అంటారు. "నేను వీడ్ని ఇంక ఉంచదల్చుకోలేదు" అని తన నిశ్చయాన్ని తెలిపాడనీ, ఆఖరి ప్రయత్నంగా ఆ గ్రామంలోని వారినే ఉపయోగించుకున్నాడని అంటారు. "వీడ్ని నేను చంపేద్దామను కుంటున్నాను. మీరు వాడిని దేముడనే కొలుస్తారు. మీరు వాడిని చంపలేరు. అందుకు మీరు ఒప్పుకోరు. మీరు చంపనక్కర్లేదు, వాడిని ఒంటరిగా ఇక్కడికి రప్పించండి.

నేను చూసుకుంటాను" అని వత్తిడి తెచ్చాడని ఆయన చెపుతారు.

ఆ వత్తిడి వల్లే, ఇష్టం లేకపోయినా తప్పని సరై ఒక నిర్ణయానికి వచ్చి పొన్నుస్వామి తది తరులే శ్రీనివాస్‌ని బంధించి వీరప్పన్‌కి అప్పగించారని, వీరప్పన్ మురా శ్రీనివాస్‌ని చిత్ర హింసలు పెట్టి చంపే సిందని అనంతరావు ఆరోపిస్తున్నారు.

ఏదిఏమైనా శ్రీనివాస్ మృతదేహం పైన ఉన్న గుర్తుల్ని చూస్తే, కేవలం చనిపోయాక దేహాన్ని ఛిద్రంచేసిన చిహ్నాలని అనిపించదు. చనిపోక ముందే దారుణమైన చిత్రహింసలకి గురిచేశారని తేలిగ్గానే అర్థం అవుతుంది.

శ్రీనివాస్ మృతదేహాన్ని (కవర్‌పైన ఉన్న కలర్‌ఫోటో) చూస్తే చేతివేళ్ళగోళ్ళు ఊడబెరికారనీ, నరికారని, కాళ్ళ పైన, మణికట్ల దగ్గిర, కీళ్ళ దగ్గిర ఇంకా శరీరంలోని అనేక చోట్ల కత్తులతో కొడవళ్ళతో నరికారనీ, కుడిచేయి విరిచేశారనీ స్పష్టంగా తెలుస్తోంది. ఈ చిత్రహింసల్లో అధిక భాగం బ్రతికున్నపుడు జరిగి ఉంటాయని ఊహించడమె సరిపోతుంది.

మృతదేహం దొరికినచోట పెద్దగా రక్తం మరకలు లేవు కాబట్టి, ఎక్కడో చిత్ర హింసలుపెట్టి చంపి ఇక్కడికి తెచ్చారని అనిపిస్తుంది. అక్కడున్న రాతిపై ఉంచి తలని నరికారు.

ఏనుగు దంతాలని నరికే నైపుణ్యంతోనే శ్రీనివాస్ తలనరికినట్టు కనిపిస్తోందని తర్వాత నిపుణులు పేర్కొన్నారు.

మొండేన్ని పైశాచికంగా కాల్చారు. పోస్ట్‌మార్టమ్ హడావుడిగా పద్ధతికి భిన్నంగా రాత్రి పదిగంటల ప్రాంతంలో లోకల్ డాక్టర్ చేత నిర్వహింప చేశారని ఫోరెన్సిక్ నిపుణుల్ని పిలిపించి ఉంటే మరికొన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చేవని అనంతరావు ఆవేదన వ్యక్తం చేశారు.



మా దేవుడు మాకిక లేడా?
- రోదిస్తున్న గోపీనాథం ప్రజలు

శ్రీనివాస్ బ్రతికున్న రోజుల్లో వీరప్పన్ ఒట్టిపిరికివాడని, అందరూ అతడిని గొప్ప హీరో అనుకుంటున్నారని - నవ్వుతూ అనేవాడు. - వీరప్పన్ (అప్పటికి) చేసిన 22 హత్యల్లో కూడా మనిషిని ఎదుటనుంచుని కాల్చలేదనీ, ప్రతీ ఒక్కణ్ణీ వెనుకనుంచే కాల్చాడనేదే - శ్రీనివాస్ అందుకు చూపించే కారణం. శ్రీనివాస్ హత్యతో వీరప్పన్ మరొకసారి అదే విషయాన్ని నిరూపించాడు.

అహింసఅనేది పిరికివాళ్ల కోసం కాదనీ, ధైర్యవంతులకోసమేనని - గాంధీ మహాత్ముడు పదే పదే చెప్పిన విషయాన్ని - శ్రీనివాస్ తన మానవీయ జీవితంలోనూ, ధీరోదాత్త వీరమరణంలోనూ అక్షరాలా నిరూపించాడు.

* * *

శ్రీనివాస్ తన జీవితకాలంలో శ్రమించి, వీరప్పన్ గురించి అపారమైన సమాచారాన్ని సేకరించాడు. ఒక్కమాటలో చెప్పాలంటే శ్రీనివాస్ వీరప్పన్‌కి సంబంధించి "సమాచారానిధి"గా ఉన్నాడు. అప్పట్లో శ్రీనివాస్ ఇచ్చిన నివేదికల్లో వీరప్పన్ చేశాడని చెప్పున్న హత్యల్లో నిజానిజాలు - వేరేవాళ్ళు చేసి అతని పేరిట నమోదైన నేరాలు, అతను చేసి కూడా బయటకి తెలీకుండాపోయిన నేరాలు వివరంగా వున్నాయి. తమిళనాడులోని రాందాస్ నాయకత్వంలో పి.యం.కె. పార్టీకి రు.50,000/- ఇచ్చిన రహస్యాలు కూడా వున్నాయి. వాటిని తన కంప్యూటర్ సహాయంతో ఫ్లాపీలుగా మార్చి భద్రపరిచాడు.

ఈ విలువైన సమాచారమంతా కర్నాటక ప్రభుత్వం వద్ద పడి మూలుగుతోంది. ఫ్లాపీలన్నీ దుమ్ముకొట్టుకునిపోతున్నాయి. విలువైన ఈ సమాచారాన్ని వినియోగించడానికి ఎన్నడూ ప్రయత్నించకపోవడం విచిత్రం.

* * *

9 సంవత్సరాలు గడిచినా గోపీనాథం గ్రామ ప్రజలు శ్రీనివాస్ త్యాగాన్ని, బలిదానాన్ని మరిచిపోలేదు. చాలా మంది ఇళ్లల్లో తాము దైవసమానుడిగా ఎంచే శ్రీనివాస్ చిత్రపటాలు ఉన్నాయి. గ్రామంలోని మారియమ్మ ఆలయాన్ని ప్రజలు శ్రీనివాస్ దివ్యస్మృతికి అంకితం చేశారు. ఈ నాటికీ ఆలయ ప్రాంగణంలో శ్రీనివాస్ చిత్ర పటాన్నుంచి ప్రతినిత్యం పూజిస్తున్నారు. ఈ నాటికి తమిళంలో, వచ్చీరాని ఇంగ్లీషులో ఆ గ్రామ ప్రజలు శ్రీనివాస్ తల్లితండ్రుల నుద్దేశించి రాస్తున్న ఉత్తరాల్లో తమ 'సాహెబ్ శ్రీనివాస్' పట్ల తమకున్న ప్రేమ వ్యక్తం చేస్తూనే వున్నారు. కేవలం 2 నెలల క్రితం గోపీనాథం గ్రామ ప్రజలు శ్రీనివాస్ తల్లితండ్రులకి రాసుకున్న ఉత్తరంలో "...మేము మీకు ఎన్నో ఉత్తరాలు రాస్తున్నాం. అయినా మీరు జవాబు ఇవ్వట్లేదెందుకు? మమ్మల్ని మీరు ద్వేషిస్తున్నారా? దయవుంచి చెప్పండి. ఆయన్ని మేము ప్రేమిస్తున్నాం. పూజిస్తున్నాం. ఈ మట్టికోసం ఆయన ప్రాణాలిచ్చాడు..." అన్న వాక్యాలు చూస్తుంటే శ్రీనివాస్ నిజంగా చచ్చిపోలేదని ఆ గ్రామ ప్రజల స్మృతిపథంలో సజీవంగా, చిరంజీవిగా ఉన్నాడనే తెలియట్లేదా?

ఒకానొక శ్రీనివాస్ వర్ధంతి సభలో బ్యానర్‌పై రాసిన - "Srinivas was a True Gandhian, Lived as a Gandhian, Died as a Gandhian" అనే మాటలు అక్షర సత్యాలు కాదని ఎవరనగలరు?●

('విజయవిహారం', అక్టోబర్ 2000)

# తెలుగు వీరుడికి జాతినివాళి



- శ్రీనివాస్ ధైర్యసాహసాలకి, నిజాయితీకి, త్యాగానికీ శ్రమకి గుర్తింపుగా భారత ప్రభుత్వం 1992 సం॥ "కీర్తి చక్ర" అవార్డు ప్రదానం చేసింది.
- శ్రీనివాస్ వర్ధంతి నవంబర్ 10వ తేదీని దేశవ్యాప్తంగా "ఫారెస్టర్స్ మెమోరియల్ డే"గా పాటిస్తున్నారు.
- డెహరాడూన్‌లోని "ఇందిరాగాంధీ నేషనల్ ఫారెస్టు అకాడమీ" ప్రతీ ఏటా (నవంబర్ 10న) శ్రీనివాస్ వర్ధంతిని, ముస్సోరిలోని "లాల్‌బహదూర్ శాస్త్రి అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్" (సెప్టెంబర్ 12న) శ్రీనివాస్ జయంతిని జరుపుతున్నారు. ప్రతీఏటా శ్రీనివాస్ పేరిట స్మారకోపన్యాసాలని నిర్వహిస్తున్నారు. ముస్సోరి అకాడమీ ప్రతీ ఏటా సర్దార్ వల్లభాయ్ పటేల్, డా॥ బి.ఆర్. అంబేద్కర్‌లతో పాటు కీర్తిచక్ర శ్రీనివాస్ జయంతిని జరుపుతోంది. శ్రీనివాస్ పేరిట రెండు అకాడమీలు ప్రతీఏటా గోల్డు మెడల్స్‌ను, సర్టిఫికేట్స్‌ను ఇస్తున్నాయి.
- దేశంలో అనేక అటవీశాఖ కార్యాలయాల్లో శ్రీనివాస్ చిత్రపటాన్ని శాశ్వతంగా ఉంచుతున్నారు.
- స్వస్థలమైన రాజమండ్రిలోని రోడ్డుకు,పార్కుకు కీర్తిచక్రశ్రీనివాస్ పేరు పెట్టారు.
- శ్రీనివాస్ స్వయంగా నెలకొల్పిన చిక్‌మగుళూర్‌లోని ఫారెస్టు కాంప్లెక్స్‌లో శ్రీనివాస్ కాంశ్య విగ్రహాన్ని ప్రతిష్టించారు. శ్రీనివాస్ పేరిట విద్యాసంస్థలను నెలకొల్పుతున్నారు.
- కీర్తి చక్ర శ్రీనివాస్ జీవితాన్నీ, కృషినీ తెలుపుతూ ముస్సోరీలోని "లాల్‌బహదూర్ శాస్త్రి అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్" వారు ఒక పుస్తకాన్ని ప్రచురించారు.
- వీరప్పన్ స్వగ్రామమైన గోపీనాథంలో మారియమ్మ దేవాలయాన్ని స్వర్గీయ శ్రీనివాస్ దివ్యస్మృతికి అంకితం చేశారు. ఆ ఆలయ ప్రాంగణంలో శ్రీనివాస్ చిత్రపటాలను శాశ్వతంగా ప్రతిష్టించారు.
- శ్రీనివాస్ ఆదర్శానికి, అంకితభావానికి, త్యాగానికి, ప్రజాసేవకు గుర్తింపుగా 1999 సం॥ ప్రతిష్టాత్మకమైన "జనహర్ష మహాత్మాగాంధీ హార్మనీ అవార్డు"ను ప్రకటించారు. ఈ అవార్డును వేలాదిమంది ప్రజల సమక్షంలో 2003, ఆగస్టు 9న, హైద్రాబాద్ లలిత కళాతోరణంలో కన్నుల పండుగగా జరిగిన జై భారత్ మత సామరస్య సమ్మేళనంలో ప్రఖ్యాత పాత్రికేయులు తరుణ్ తేజ్‌పాల్ చేతులమీదుగా శ్రీనివాస్ తల్లితండ్రులు స్వీకరించారు.

## ఓ వీరుడా....

ఉక్కు నరాల్లోంచి ఫెళ్లుమన్న అగ్నిచ్ఛటవు నీవు...
చీకటి గర్భాన్ని చీల్చిన ధగద్ధగల కాంతి ప్రహారానివి నీవు...
మెదళ్ల నెగళ్లని రాజేస్తూ మా నరాల్లో రక్తం మరిగిస్తున్నది నీవు...
మెడపై గుచ్చుకున్న కత్తిని చిర్నవ్వుతో కరిగించే మర్మం చెబుతున్నది నీవు...
సైతాన్లు తొలుస్తున్న మనసుల్లోకి కరుణామృతాన్ని ఒంచిన గౌతముడా!
నీకెక్కడిదయ్యా మరణం...
మా తరానికి తరమే నిన్నుగుండెగుండెలో పదిలంగా పొదువుకుంటే...
మా ద్వేషపు ఇరుకు మనసు దారుల్లో
నువ్వు పెట్టిన చిన్నదీపం దోవచూపుతుంటే...
క్రౌర్యాన్ని జయించిన నీ చిర్నవ్వు వశీకరణమంత్రం అడవి అంతటా ఓంకారమవుతుంటే...
నీ కెక్కడిదయ్యా మరణం...
నీవు అమరుడివి... అమృతుడివి... అద్వితీయుడివి ... అనితర సాధ్యుడివి.
నిన్ను కని, మా తరానికి బంగారు కానుకగా ఇచ్చిన జయలక్ష్మి, అనంతరావులు ఎంత ధన్యులు!
ఎక్కడో రాజమండ్రిలో పుట్టి, గోపీనాథం అడవుల్లోకి వెళ్లి,
రక్తం రుచిమరిగిన తోడేళ్లకు, అడవినిమింగేస్తున్న వీరప్పన్‌లకు
బతుకు దిశని, బతుకులోని తీపిని, బతుకుని ఉద్దీప్తం చేసే మానవీయ అంశనీ బోధించావు...
కరకు మనసుల్ని కరుణతో కరిగించాలన్నావు...

అడవిలో వున్నావు... అన్నార్తులతో గడిపావు... పుట్టుకతో ఎవ్వరూ దుర్మార్గులుకారన్నావు. మనిషిని నేరస్థుణ్ణిచేసే కారణాల్ని వెతికావు... ఒంటరిగా, గాంధేయపథికుడిగా సాగిపోయావు.

అడవిదొంగ ఉరిమే తుపాకి ముందు అహింసని జపిస్తూ నిలబడ్డావు...
తోటివాళ్ల వెటకారాల్నీ, వేధింపుల్నీ, అవహేళనల్నీ నవ్వుతూ ధీశాలిగా తేలగొట్టావు...
మానవత్వం మూర్తిమంతం అయిన శ్రీనివాసా!
మనిషిమీద ఎంత గొప్ప నమ్మకం నీకు...
మనసుని ప్రేమతో గెలుచుకుంటానన్నావు...
కాని, క్రౌర్యానికి మనిషిరూపైన ఆ ఉన్మాది అడవిదొంగకి మనసొకటా?

నీ గుండెని తుపాకి గుళ్లతో ఛిద్రం చేసి, మనిషి మనిషికి మధ్య నమ్మకానికి నిలువుపాతరేసి, తన కాళ్లని తనే నరుక్కున్నాడు వాడు.


అయితేనేం... నీవు భౌతికంగా మా మధ్య లేకపోతేనేం...
అడవిలోని అణువణువులో నీ అడుగుజాడ వుంది...
అడవిలోని మనిషి మనిషి గుండెలో నీకొక గుడివుంది...
నీ ఆశయాల కాగడా నిత్యం వెలుగుతూనేవుంటుంది...
నీవు పరచిన సంస్కరణల బాట నిత్యం వసంతాన్ని చిగురిస్తూనేవుంటుంది.
అవి కరడుగట్టిన మనసుల్లో తప్పకుండా పూలు పూయిస్తాయి...
ఆ పువ్వుల నవ్వుల్లో నువ్వు దర్శనమిస్తావు... మా రాజులా...
అప్పుడు గోపీనాథం అడవంతా, అణువణువంతా నువ్వు పరిమళిస్తావు...
నీ జ్ఞాపకాల ఆసరాతో మా మధ్య వున్న నీ మాతాపితలకు
మా ఈ 'జై భారత్ - జనహర్ష మహాత్మాగాంధీ సామరస్య పురస్కారం'

ఆగస్టు 9, 2003 న 'జనహర్ష మహాత్మాగాంధీ హార్మనీ అవార్డు' ప్రదానం సందర్భంగా 'శేషు' రూపొందించిన సైటేషన్




1992లో కీర్తిచక్ర ప్రదానం





సంతాప సభ



2003, ఆగస్టు 9న జై భారత్ మత సామరస్య సమ్మేళనంలో 'జనహర్ష మహాత్మాగాంధీ హార్మనీ అవార్డు'

గోపీనాథం గ్రామంలో నిరాడంబర జీవితం
(చనిపోవడానికి 6రోజుల ముందు తీసిన ఫోటో)





తల్లితండ్రులతో




సోదరీ
సోదరులతో











1990లో అమెరికా కొలరాడోలో...



తాను నిర్మించిన
ఆసుపత్రిలో
ప్రజాసేవలో







1990లో అమెరికా కొలరాడోలో...



టాస్క్‌ఫోర్స్
అధికారిగా



గోపీనాథం గ్రామంలో శ్రీనివాస్ నిర్మించిన
మారియమ్మ దేవాలయం





ఆలయంలో శ్రీనివాస్ చిత్రపటానికి
నేటికీ పూజలు జరుగుతున్నాయి




కాంస్య విగ్రహం
ದಿವಂಗತ
I.P.S.
ಮರಣ:
1991

చంపి కొండల్లో పారేశిన
వాడి శరీరం
రాగం కోసం బిగించిన
ఫిడేలులా
పడి ఉంది
వాడి నోరు పాడిన
పాటలు
ప్రవహించే నదులు ఆగి
ఆలకించేవి
చావులేని వాడ్ని చంపిన
మూర్ఖులకు
తెలీదు
ఏ మృత్తిక పువ్వును
మనిషికి కానుకగా
ఇచ్చిందో అది
వాడి నిర్మాణంలో ఉందని


– శేషేంద్ర

(ఆధునిక మహాభారతము)



వీరప్పన్ పైశాచికత్వానికి నిదర్శనం : ఛిద్రమైన శ్రీనివాస్ మృతదేహం

**...అతడు వాయు వేగంతో నా వద్దకు చేరుకున్నాడు. నాలో రక్తం ఉడికిపోతుంది. అతడి ఛాతీని చీల్చి, అందులోంచి వేడి రక్తం ఉబికి వస్తూంటే చూసే సమయం కోసమే నేను కాచుకుని కూర్చున్నాను. నేను నా తుపాకి తీసుకుని అతడు ఏమి జరుగుతోందో తెలుసుకునే లోగానే కాల్చిపారేశాను. తర్వాత అతడి తలను, చేతులను కూడా నరకడం ప్రారంభించాను. నాపై మరతుపాకులను ఎక్కుపెట్టాలని కోరుకున్న చేతులు అవే. తర్వాత నేను అతడి తలను గుర్తుగా, భద్రంగా దాచాను... అతని శరీరం మీద రెండులీటర్ల పెట్రోలు పోసి తగులపెట్టాను. తలను తీసుకెళ్ళి జుట్టును కాల్చేశాను... మేమూ, తమ్ముడు అర్జునన్ కలిసి నిప్పు రాజేసి ఆ డి.ఎఫ్.ఓ. తలను పూర్తిగా తగుల బెట్టేశాం...**



## అనుబంధం - 1

### 'గంధపుచెక్కల వీరప్పన్' - పుస్తక సమీక్ష

# ప్రతీ నేరస్థుడికీ ఒక వాదన ఉంటుంది

### అత్యాచారాల్ని అర్థం చేసుకోవడం సరే ; అర్ధ సత్యాలు, వక్రీకరణల వల్ల జరిగే హానిమాటేమిటి?

*"1931 మే7 నాడు న్యూయార్క్ నగరం ఒక సంచలనాత్మకమైన వేటని వీక్షించింది. అటువంటి వేటను ఆ పురాతన నగరం అంతకు ముందు కనీవినీ ఎరగదు హంతకుడు, ఏనాడూ మద్యం, పొగ ముట్టనివాడు, అజ్ఞాతంలో ఉన్నవాడు - "జోడు తుపాకీ" క్రౌలీవెస్ట్‌లాండ్ అవెన్యూ లోని తన ప్రియురాలి అపార్ట్‌మెంట్‌లో ఉన్నపుడు పోలీసు ముట్టడిలో చిక్కాడు.*

150 మంది పోలీసులు, డిటెక్టివ్‌లు అతడు దాగిన పై అంతస్థును చుట్టు ముట్టారు. కప్పుకు కన్నాలు పెట్టి 'పోలీస్ హంతకుడు' - క్రౌలీని టియర్‌గ్యాస్ పొగతో ఉక్కిరిబిక్కిరి చేసి బయటకి లాగే ప్రయత్నాలు చేశారు. ఆ చుట్టుపక్కల భవంతులపైన కూర్చుని తమ మెషీన్ గన్లు గురిపెట్టారు. ఆ తర్వాత గంటకు పైగా న్యూయార్క్‌కు చెందిన ఆ ప్రశాంత జనావాస పరిసరాలు తుపాకీ చప్పుళ్ళతోటీ, మెషీన్‌గన్ గర్జనలతోటీ దద్దరిల్లిపోయాయి. పది వేలమంది ఉత్కంఠతో ఈ యుద్ధాన్ని వీక్షించారు. న్యూయార్క్ వీధుల్లో - ఇటు వంటిది ఎన్నడూ చూడలేదు.

చిట్టచివరికి క్రౌలీ పట్టుబడ్డాక, ఈ జోడు తుపాకీ దుర్మార్గుడు - న్యూయార్క్ చరిత్రలోనే ఎన్నడూ తారసపడని అత్యంత ప్రమాదకరమైన నేరస్థుడని పోలీస్ కమీషనర్ మల్రూనే ప్రకటించాడు. "గాలికి తన మీద ఈక వచ్చిపడినా చాలు - వీడు ప్రాణాలు తీసేస్తాడు" అన్నాడు కమిషనర్.

సరే, మరి జోడుతుపాకీ క్రౌలీ తన గురించి ఏమనుకుంటాడు? అది కూడా మనం తెలుసు కోవచ్చు. ఎలాగంటే - ఒక ప్రక్క పోలీసులు తన అపార్ట్‌మెంట్ పైకి కాల్పులు జరుపుతుంటే అతను ప్రజలందర్నీ ఉద్దేశించి ఒక లేఖ రాశాడు. అతడి గాయాల నుంచి స్రవించిన రక్తంతో ఆ లేఖపై ఎర్రటి చారికలు ఏర్పడ్డాయి. ఆ లేఖలో క్రౌలీ అంటాడు: "నా కోటు కింద ఒక అలసిన హృదయం ఉంది. అది చాలా దయార్ద్ర హృదయం. ఎవ్వరికీ ఎటువంటి హానీ తలపెట్టని హృదయం."

దీనికి కొద్ది ముందుగానే క్రౌలీ లాంగ్ ఐలండ్‌లోని ఒక కచ్చా రోడ్‌లో ఒక నెక్కింగ్ పార్టీలో ఉన్నాడు. సడన్‌గా పార్క్ చేసిన కారు దగ్గరకి ఒక పోలీసు మనిషి వచ్చి "మీ లైసెన్సు చూపించండి" అని అడిగాడు.

క్రౌలీ ఒక్కముక్క అనకుండా తన తుపాకీ తీసి ఆ పోలీసు మనిషి మీద సీసపు గుళ్ళ వర్షం కురిపించి కుప్పకూల్చేశాడు. ఆఫీసర్ కిందపడి కడశ్వాస కోసం కొట్టుకుంటుంటే క్రౌలీ తన కార్లోంచి దిగాడు. ఆ ఆఫీసర్ రివాల్వర్ గుంజు కున్నాడు. ఆ ఛిద్రమైన శరీరంలోకి మరో బుల్లెట్ కాల్చాడు. అతనే ఇప్పుడు "నా కోటు కింద ఒక అలసిన హృదయం ఉంది. అది చాలా దయార్ద్ర హృదయం. ఎవ్వరికీ ఎటువంటి హానీ తలపెట్టని హృదయం." అని చెప్తున్న నరహంతకుడు.

క్రౌలీకి ఎలక్ట్రిక్ ఛైర్‌లో మరణించే శిక్ష విధించారు. సింగ్‌సింగ్‌లో మరణశిక్ష అమలు జరిపే గృహాన్ని సమీపించినపుడు అతను "ప్రజల్ని చంపినందుకు నాకీ శిక్ష" అన్నాడనుకున్నారా? లేదు, లేదు "నన్ను నేను సమర్థించుకున్నందుకే నాకీ శిక్ష" అని వ్యాఖ్యానించాడు."

- ఇలా మొదలౌతుంది డేల్ కార్నెజ్ రాసిన ప్రపంచప్రసిద్ధ గ్రంథం "హౌటూ విన్ ఫ్రెండ్స్ అండ్ ఇన్‌ఫ్లూయెన్స్ పీపుల్".

డేల్ కార్నెజ్ ఆ పుస్తకంలో ఇంకా అల్ కేపాన్, డచ్ షుల్జ్ లాంటి కిరాతక హంతకులు తమని తాము ప్రజలకు ప్రయోజనం చేకూర్చే మనుషులుగా ఎలా భావించుకుంటారో వర్ణిస్తాడు.

చివరికి - డేల్ కార్నేజ్ చెప్పే విషయం ఏమిటంటే - కరడు గట్టిన నేరస్థులే తాము తప్పు చేశామని భావించనపుడు మనం రోజూ చూసే సాధారణ మనుషులు చటుక్కున తమ పొరపాట్లు అంగీకరించడానికి సిద్ధంగా ఉంటారా? అని ఇది అవతలి మనుషులతో వ్యవహరించేటప్పుడు విమర్శించేటప్పుడు మనం గుర్తుంచుకోవాల్సిన విషయమని డేల్ కార్నేజ్ నొక్కి చెపుతాడు. సరే అది వేరే సంగతనుకోండి.

మనుషులు తమ పొరపాట్లను అన్ని సందర్భాలనూ ఆత్మ విమర్శనా దృష్టితో అంగీకరించేందుకు సిద్ధంగా ఉండరనేది మాత్రం నిజం.

ప్రతి నేరస్థుడికీ తనను సమర్థించుకునే వాదం ఉండటం అంత ఆశ్చర్యమైన సంగతేమి కాదు (దానికి మినహాయింపుల్లేవని కాదు)

బొంబాయి పేలుళ్ళకి, మరెన్నో దురాగతాలకీ కారణమైన మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీంని కదిలిస్తే తానెంత న్యాయమైన వ్యక్తో వివరిస్తాడు. బహుశా పోలీసు దుర్మార్గాల్ని కూడా (అలాంటివి లేవని కాదు) ప్రశ్నిస్తాడు.

చట్టానికి తాను అతీతుడ్నని భావించుకునే బాల్‌థాకరే బొంబాయి మత కల్లోలాలకి ప్రజల్ని ఎందుకు రెచ్చగొట్టావని ప్రశ్నిస్తే - ముస్లింల జాతి వ్యతిరేక చర్యల్ని విమర్శించట్లేదేమిటని మన మీద విరుచుకు పడతాడు.

ఈ సహస్రాబ్దికే విశిష్ట వ్యక్తని ప్రపంచంలో అనేకమంది భావిస్తున్న గాంధీ మహాత్ముడ్ని మతోన్మాదం తలకెక్కిన నాథూరామ్ గాడ్సే ఒక్క బుల్లెట్ దెబ్బకి చంపేశాడు. అలా చేసి తానెంత గొప్పపని చేశాడో చెప్పడానికి అతడికీ ఒక వాదన ఉంది. దాన్ని పుస్తకంగా వేసి ప్రచారం చేస్తున్నవాళ్ళూ ఉన్నారు.

అక్కడి దాకా ఎందుకు - క్రితం సంవత్సరం గ్రాహం స్టెయిన్స్‌నీ ముక్కుపచ్చలారని అతని ఇద్దరు పిల్లల్నీ సజీవంగా దహనం చేసిన దారాసింగ్‌కీ ఒక వాదన ఉంది. దాన్ని సరైనదేనని నమ్మేవాళ్ళూ ఉన్నారు. అతడి వాదనని కూడా పుస్తకంగా ప్రచురిస్తే అది విపరీతంగా అమ్ముడు కావచ్చు. అతను కూడా కొన్ని పోలీసు అత్యాచారాల్ని, వ్యవస్థలోని లోపాల్ని వెలుగులోకి తేవచ్చునేమో.

దారాసింగ్ వేటలో పోలీసులు ఎటువంటి అత్యాచారాలకి అకృత్యాలకీ పాల్పడలేదని అనగలమా? ఖచ్చితంగా పాల్పడే ఉండాలి. దారాసింగ్ క్రూరత్వంతో పోల్చుకుని పోలీసుల అత్యాచారాల్ని సమర్థించగలమా? ఖచ్చితంగా సమర్థించలేం.

పోలీసు దుర్మార్గాల్ని, వ్యవస్థ లోపాల్నీ అర్థం చేసుకోవడానికీ, ఒక నేరస్థుడిని సమర్థించడానికీ మధ్య చాలా తేడా ఉంది. తేడా ఉందనే ఆలోచన మనం ఎప్పుడూ వదిలిపెట్టకూడదు. లేకపోతే రెంటి మధ్య ఉన్న విభజన రేఖను ఒక్కోసారి మనకి తెలీకుండానే చటుక్కున దాటేస్తాం.

వీరప్పన్ గురించి నక్కీరన్ తమిళంలో తీసుకొచ్చిన పుస్తకానికి ఇప్పుడు తెలుగు అనువాదంగా హైద్రాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించిన "గంధపు చెక్కల వీరప్పన్" ఈ విభజన రేఖకి సంబంధించిన అనేక ప్రశ్నల్ని ముందుకు తెస్తోంది. వీటిని లోతుగా చర్చించాల్సిన అవసరం ఉంది.

# 'గంధపు చెక్కల వీరప్పన్' పుస్తకనేపథ్యం

ఈ రోజు వీరప్పన్ పేరు విననివాళ్ళు ఎవరూ లేరు. ఈ పుస్తకాన్ని ప్రచురించిన హైద్రాబాద్ బుక్ ట్రస్ట్‌వారు రాసిన ముందు మాటలో వీరప్పన్ గురించి ఇలా అన్నారు.

*"దంతాల కోసం రెండు వందల ఏనుగుల్ని చంపాడనీ, రూ.100 కోట్లకు పైగా విలువచేసే ఏనుగు దంతాలనీ గంధపు చెక్కలనీ దొంగరవాణా చేశాడనీ అంటారు. ముప్పైరెండు మంది పోలీసు సిబ్బంది, పదిమంది అటవీశాఖ సిబ్బందితో సహా మొత్తం 138 మందిని దారుణంగా హత్య చేశాడనే ఆరోపణలున్నాయి.*

*వీరప్పన్‌ని పట్టించిన వారికి 40 లక్షల రూపాయల బహుమతి చాలా కాలం కిందటే ప్రకటించబడింది. గత కొన్ని సంవత్సరాలుగా సరిహద్దు భద్రతా దళానికి చెందిన ఏడు బెటాలియన్ల సైనికులు ; తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 4,500 మంది స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు వీరప్పన్ వేటలో నిమగ్నులై వున్నారు. ఏడాదికి కొన్ని కోట్ల రూపాయలను ఆ ప్రభుత్వాలు వెచ్చిస్తున్నాయి".* ఇటువంటి వీరప్పన్‌ని - 1996లో తమిళనాడులోని 'నక్కీరన్' పత్రిక విలేకరులు సాహసంతో అడవిలోకి వెళ్ళి వీడియో ఇంటర్వ్యూ చేశారు. అప్పట్లో అది సన్ టీవీ ఛానెల్‌లో ప్రసారమై సంచలనం సృష్టించింది. వీరప్పన్ తన జీవితం గురించి చెప్పుకున్న విషయాలన్నీ అందులో ఉన్నాయి.

ఈ ఇంటర్వ్యూని తరవాత నక్కీరన్ వాళ్ళు కొంత సంక్షిప్తం చేసి తమిళంలో పుస్తకంగా తెచ్చారు. దానికి తెలుగు రూపమే ఈ "గంధపు చెక్కల వీరప్పన్" అనే పుస్తకం.

ఈ పుస్తకాన్ని ప్రచురించడంలో హైద్రాబాద్ బుక్‌ట్రస్ట్‌వారు తమ ఉద్దేశాన్ని ఇలా ప్రకటించారు.*"...ఈ పుస్తక ప్రచురణ వెనక వీరప్పన్‌ని సమర్థించే లేదా వీరప్పన్‌ని కీర్తించే ఉద్దేశమేమీ మాకు లేదు. అయితే మన వ్యవస్థలోని లొసుగులను ముఖ్యంగా న్యాయవ్యవస్థ, పోలీసుల పనితీరు, ప్రభుత్వ యంత్రాంగంలోని అవినీతి, రాజకీయ నాయకుల అవకాశవాదం వంటి విషయాలను అర్థం చేసుకునేందుకు ఇది చాలావరకు తోడ్పడుతుందని మేం భావిస్తున్నాం..."*

హెచ్.బి.టి వారు ఇంకా ఇలా అన్నారు :*"...వీరప్పన్ చెప్పినవన్నీ అక్షరసత్యాలుగా పరిగణించ నవసరంలేదు. అలా అని వాటిని బొత్తిగా కొట్టిపారేయడం కూడా సబబు కాదు. వీరప్పనే కాకుండా కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా తమిళనాడు-కర్ణాటక సరిహద్దు ప్రాంతాల లోని వివిధ గ్రామాలను సందర్శించి పోలీసుల మీద తీవ్ర ఆరోపణలు చేశాయి. అక్రమ నిర్బంధం, చిత్ర హింసలు, అత్యాచారాలు, చట్ట వ్యతిరేకంగా హత్య చేయడం, మనుషుల్ని మాయం చేయడం, వెట్టిచాకిరీ చేయించుకోవడం వంటి పోలీసులపై వచ్చిన అనేక ఫిర్యాదులను విచారించేందుకు జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ ఒక ప్యానెల్‌ను నియమించింది. ఇద్దరు సభ్యులతో కూడిన ఆ ప్యానెల్‌లో కర్ణాటక హైకోర్టు మాజీ న్యాయమూర్తి శ్రీ ఎ.జె.సదాశివ, సెంట్రల్*

*బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) మాజీ డైరెక్టర్ శ్రీ సి.వి. నరసింహన్‌లు సభ్యులుగా వున్నారు. ఆ ప్యానెల్ గత ఫిబ్రవరిలోనే మెట్టూరుకు 19 కి.మీ. దూరంలో వున్న కొలత్తూర్ శివారు గ్రామంలో తన విచారణను ప్రారంభిం చింది. నిజానిజాలు ఎలాగూ వెల్లడికాక మానవు..."*

బహుశా ప్రచురణ కర్తలు ప్రకటించుకున్న లక్ష్యంతో ఏకీభవించని వాళ్ళెవరూ ఉండరు.

## వీరప్పన్ చెప్పేదాంట్లో నిజం ఎంత?

100 పేజీల ఈ పుస్తకంలో 2 పేజీలు హైద్రాబాద్ బుక్‌ట్రస్ట్ రాసిన ముందు మాట ఉంది. 11 పేజీలు నక్కీరన్ ఎడిటర్ గోపాల్ "ఎందుకీ వీరప్పన్ ఇంటర్వ్యూ?" అంటూ రాసిన వివరణ, మరో 3 పేజీలు నక్కీరన్ విలేకరి శివసుబ్రహ్మణ్యం ఆ వీడియో ఇంటర్వ్యూ ఎలా తీయగలిగారో చెప్పే అనుభవాలూ ఉన్నాయి. మిగతా పుస్తకమంతా అంటే 82 పేజీలు వీరప్పన్ చెప్పిన మాటలే ఉన్నాయి.

పుస్తకం తెరిచాక మళ్ళీ కింద పెట్టకుండా ఏకబిగిన చదివించే శైలి, కథనం ఈ పుస్తకంలో ఉన్నాయి. వీరప్పన్ తన బాల్యం నుంచి మొదలుపెట్టి తన జీవితం గురించీ తను చేసిన హత్యలగురించీ, తన అభిప్రాయాల గురించీ, విశ్వాసాల గురించీ తన ఆశల గురించీ ఈ పుస్తకంలో దాపరికం లేకుండా చెప్పదలుచుకున్నది చెప్పాడు.

వీరప్పన్ వెర్షన్ చదివాక వీరప్పన్ కేవలం దుర్మార్గుల్నే చంపుతాడనీ, అతడి కార్యకలాపాల్లో తప్పు ఏమిలేదని సాధారణ పాఠకుడు అభిప్రాయానికి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

అసలు వీరప్పన్ చెప్పినదాంట్లో తప్పులు ఉండే అవకాశం ఉందనే అభిప్రాయం నక్కీరన్‌కి కూడా బొత్తిగా ఉన్నట్టు లేదు.

ఈ 100 పేజీల పుస్తకంలో అనువాద ప్రచురణ కర్తలు హైద్రాబాద్ బుక్ ట్రస్ట్ వారు రాసిన రెండు పేజీల ముందు మాటలో *"...వీరప్పన్ చెప్పినవన్నీ అక్షర సత్యాలుగా పరిగణించనవసరం లేదు..."* అని రాసిన ఒకే ఒక్క వాక్యం తప్ప వీరప్పన్ ఆర్గ్యుమెంట్‌కు వ్యతిరేకంగా ఒక్కవ్యాఖ్య కూడాలేదు.

పై పెచ్చు వీరప్పన్ చెప్పిందంతా నిజమేనని నక్కీరన్ భావిస్తున్న సూచనలు గోపాల్ మాటల్లో కనిపిస్తున్నాయి.

నక్కీరన్ గోపాల్ ఇలారాశారు : *"...అదే సమయంలో దినతంతి, దినమలార్, దినకరన్, మాలైమురసు, మాలైమలార్ తదితర దినపత్రికల్లో వీరప్పన్ పైశాచికత్వం, వీరప్పన్ మనుషులచే ముగ్గురు పోలీసుల కాల్చివేత, వీరప్పన్ ఎక్కడికి వెళుతున్నాడు-ఎక్కడ వున్నాడు అనే శీర్షికలతో రకరకాల వార్తలను ప్రచురించాయి. అంతేకాదు తన ఆచూకీ గురించి పోలీసులకు చెప్పిన ఏడుగురు కొండ గ్రామాల ప్రజల్ని వీరప్పన్ అతి భయంకరంగా చంపాడని, ఒక పాలవాడినీ అతని కొడుకునీ దారుణంగా నరికిపడేశాడని వార్తలు ప్రచురించాయి.*

*ఈ గందరగోళ పరిస్థితిని, రకరకాల వార్తలను గమనించినప్పుడు అసలు వాస్తవం ఏమిటి, నిజంగా ఏం జరుగుతోంది అనే విషయాలను ప్రజలకు ఎలాగైనా తెలియజేయాలనే తపన నాలో మరింతగా పెరిగింది..."*

మరి నిజంగా ఏంజరుగుతోందో ప్రజలకు ఏం తెలియజేశారు? వీరప్పన్ వాదన యధాతధంగా ప్రచురిస్తే నిజాలు ప్రజలకు తెలియజేసినట్లేనా?

వీరప్పన్ వాదన అక్షరమక్షరం నిజమేనని నక్కీరన్ నమ్ముతోందా?

వీరప్పన్ వాదన నిజం కాకపోయే అవకాశాలు ఉన్నాయని రాయడానికి నక్కీరన్ గోపాల్ ఈ పుస్తకంలో ఎక్కడా సిద్ధపడలేదు.

అసలు వీరప్పన్‌ను కలిసి ఇంటర్వ్యూ చేయాలని నక్కీరన్ ఎందుకనుకుంది?

గోపాల్ ఇలా రాశారు : *"...మంచి అవకాశం లభించి నప్పుడు దానిని సరిగా ఉపయోగించుకోగలిగితే అదే విజయానికి సోపానమవుతుంది. పత్రికా ప్రపంచానికి వీరప్పన్ వ్యవహారం అలాంటి ఒక పెద్ద అవకాశం లాంటిది. ఆ అవకాశాన్ని ఏ పత్రిక అందిపుచ్చు కుంటుందో ఆ పత్రిక విజయాన్ని సాధిస్తుంది..."*

ఆయనింకా ఇలారాశారు *"వీరప్పన్ విషయంలో నక్కీరన్ పత్రిక మరీ యింత శ్రద్ధ ఎందుకు చూపిస్తోంది?*

*ఈ ప్రశ్నకు ఒక్కమాటలో జవాబు చెబితే సరిపోతుంది. అదేమిటంటే - ఒక పరిశోధనాత్మక పత్రిక చేసే పనే అది!..."*

మరి పరిశోధనాత్మకత - అంటే కేవలం వీరప్పన్ వాదనని యధాతధంగా ప్రచురించడమేనా?

ఇందులో పత్రికా ప్రపంచంలో సెన్సేషన్ సృష్టించడం, అవకాశాన్ని అందిపుచ్చుకుని విజయాన్ని సాధించడం (బహుశా సర్క్యులేషన్ పరంగా) మాత్రమే నక్కీరన్ లక్ష్యమని ఎవరైనా భావించడానికి ఆస్కారం ఏర్పడింది.

పోలీసు అత్యాచారాల్ని బయట పెట్టడానికి నక్కీరన్ కృషిచేసిందని అన్నారు. అది అభినందనీయమే.

మరి మిగతా విషయాల్లో వీరప్పన్ వాదనలో నిజానిజాల్ని తెలుసుకోవడానికి ఏం ప్రయత్నించారు?

అసలు వీరప్పన్ వాదనలో అసత్యాలు ఉండే అవకాశం ఉందనే క్రిటికల్ అప్రోచ్ నక్కీరన్ మాటల్లో ఎందుకు కనిపించట్లేదు?

నక్కీరన్ - వీరప్పన్ వాదననే చెప్పడానికి ఇష్టపడుతోందని, లేదా వీరప్పన్‌ని సమర్థిస్తోందని అనుకోవాలా?

లేదా వీరప్పన్ వాదనలోని అసత్యాలను బయటపెట్టడం తన బాధ్యతకాదని నక్కీరన్ భావిస్తోందా?

ఈ ప్రశ్నలకి సమాధానాలు వెతికే ముందు. వీరప్పన్ చేతిలో పాశవికంగా హత్య చేయబడిన శ్రీనివాస్ ఉదంతాన్ని కొద్దిగా పరిశీలించాలి.

# వీరప్పన్ నమ్మక ద్రోహానికి బలైన శ్రీనివాస్ ఉదంతం

ఈ పుస్తకంలో డి.ఎఫ్.ఓ. శ్రీనివాసన్ కర్ణాటకరాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పేర్కొన్నారు. కానీ ఆయన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి. ఈ విషయం నక్కీరన్‌కి తెలీదని అనుకోవాలో తెలుసుకునే శ్రద్ధ లేదని అనుకోవాలో తెలీట్లేదు. ఆయన పేరు శ్రీనివాసన్‌కాదు - పందిళ్ళపల్లి శ్రీనివాస్. సరే, శ్రీనివాసన్ అని వ్యవహరించారని తృప్తిపడదాం.

పి. శ్రీనివాస్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి పట్టణం. 1979లో ఐ.ఎఫ్.ఎస్. ప్యాసయిన శ్రీనివాస్‌కి కర్నాటక రాష్ట్రంలో పోస్టింగ్ ఇచ్చారు.

మామూలు పోలీసులు అనుసరించే పద్ధతులకి భిన్నమైన పద్ధతిలో శ్రీనివాస్ వీరప్పన్ సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నించారు.

1991 నవంబర్ 21 - 5 డిసెంబర్ నాటి ఇండియాటుడే (తెలుగు) పత్రిక శ్రీనివాస్ కృషి గురించి ఈ విధంగా రాసింది : *"...శ్రీనివాస్ గోపీనాథపురంలో రోడ్లు వేయించి, ఒక ఆలయాన్ని నిర్మించి గ్రామస్థుల అభిమానాన్ని సంపాదించారు. ఆయన గ్రామస్థులతో కలిసిమెలిసి తిరుగుతూ, వారితో వాలీబాల్ వంటి ఆటలు కూడా ఆడేవారు. అంతే కాదు, గ్రామస్థులకు 'దో ఆంఖే బారాహాత్' వంటి సందేశాత్మకమైన చిత్రాలను కూడా చూపించేవారు. వీరప్పన్‌కు వ్యతిరేకంగా అక్కడ ప్రజల మద్ధతును సమీకరించడంలో ఆయన చాలావరకు కృతకృత్యులైనారని కొల్లేగల్ ప్రాంతానికి గతంలో ఇన్‌ఛార్జిగా ఉన్న అటవీ శాఖ అధికారి బి.కె.సింగ్ చెప్పారు. వీరప్పన్ సోదరికి కూడా శ్రీనివాస్ ఉద్యోగం ఇప్పించారు. అతని సోదరుడు బాగుపడడానికి సహాయపడ్డారు. ఇది వీరప్పన్‌కు కోపకారణమైంది.*

*అయితే, పోలీసు అధికారులకు మాత్రం ఆయన అంత ప్రియమైన వ్యక్తిగా కనిపించలేదు. వీరప్పన్‌ను ఎదురు కాల్పులలో చంపరాదని ఆదేశించడం ద్వారా శ్రీనివాస్ చూపిన సంస్కరణ వాదాన్ని చాలామంది పోలీసు అధికారులు నిరసించారు. మిగతా ప్రజలకు మాత్రం ఆయన ఒక హీరోగా మారిపోయారు. ''ఒక వీరప్పన్ నేడు తప్పించుకోవచ్చు కానీ, అటువంటి వీరప్పన్‌లు వందలకొద్దీ పుట్టుకురాకుండా చూడడం మన కర్తవ్యం" అని శ్రీనివాస్ చెబుతుండేవారు..."*

1993 మే 6 - 20 ఇండియాటుడే (తెలుగు) సంచికలో శివసుబ్రహ్మణ్యం చేసిన వీరప్పన్ ఇంటర్వ్యూ వచ్చింది. ఆ ఇంటర్వ్యూ తమదంటే తమదని నక్కీరన్ ఇండియాటుడే తగవుపడ్డాయి. ఆ తగాదా విషయం తర్వాత ప్రస్తావిస్తాను. ఆ సంచికలో శ్రీనివాస్ కృషి గురించి ఇలా రాశారు : *"వీరప్పన్ స్వగ్రామంలో ఆయన ఒక పాఠశాలను, వైద్యశాలను ప్రారంభించారు. అక్కడి ఆలయాన్ని కూడా పునరుద్ధరించి ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు. మరో పక్క వీరప్పన్ సోదరుడు అర్జునన్‌తో సహా, అతని ముఠా సభ్యులు అనేక మందిని సంస్కరణ పథం వైపు ఆకర్షించారు. వీరప్పన్ సోదరి మారి కూడా వైద్యశాలలో సహాయసహకారాలు అందించసాగింది".*

ఈ పుస్తకంలో వీరప్పన్ వెర్షన్‌లో కూడా శ్రీనివాస్ - పోలీసుల్ని చూసి ప్రజలు భయపడకూడదు అనుకున్నాడని, ప్రజల్ని హింసించవద్దని, ఇబ్బంది పెట్టవద్దని పోలీసులకి చెప్పాడని రాశారు. శ్రీనివాస్ గుడికట్టించిన సంగతి కూడా అందులో ఉంది.

వీరప్పన్ సమస్యని పరిష్కరించడానికి శ్రీనివాస్ అత్యంత నాగరీకమైన ప్రయత్నం చేసినట్టుగా కనిపిస్తుంది.

ఈ పుస్తకానికి రాసిన ముందు మాటలో హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ఈ విధంగా అభిప్రాయపడింది :

*"...మన వ్యవస్థలోని లొసుగుల్ని నిర్మూలించే ప్రయత్నం చేయకుండా కేవలం వ్యక్తుల్ని అదీ - తను సృష్టించిన వ్యక్తుల్ని... తనే వేటాడుతూపోవడం వల్ల సమాజానికి జరిగే ప్రయోజనం ఏమీ వుండదు. ఇప్పుడు ఆలోచించాల్సింది వ్యక్తి నిర్మూలన గురించికాదు. సమూల సామాజిక మార్పు గురించి".*

9 సంవత్సరాల క్రితం నాటి ఇండియా టుడే పత్రిక శ్రీనివాస్ సరిగ్గా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేసేవాడని చెప్పిన సంగతి గమనార్హం.

*"ఒక వీరప్పన్ నేడు తప్పించుకోవచ్చు. కానీ అటువంటి వీరప్పన్‌లు వందలకొద్దీ పుట్టుకు రాకుండా చూడటం మన కర్తవ్యం"* అని శ్రీనివాస్ చెప్పేవాడని ఆ పత్రిక పేర్కొంది. వీరప్పన్‌ని ఎదురు కాల్పుల్లో చంపరాదని శ్రీనివాస్ ఆదేశించాడని ఆ పద్ధతిని అనేక మంది పోలీసు అధికారులు నిరసించారని కూడా ఆ పత్రిక రాసింది.

శ్రీనివాస్ సంస్కరణ దృక్పథం ప్రజలపై ప్రభావం చూపింది. ఆయన తన కార్యక్రమాలతో ప్రజల్ని ఆకట్టుకోవడం వీరప్పన్‌కి గంగవెర్రులెత్తించింది. నిజానికి శ్రీనివాస్ సంస్కరణ వీరప్పన్ కుటుంబంలోకి, బంధువుల్లోకి కూడా చొచ్చుకుపోయింది.

ఆయన సోదరుడు అర్జునన్ కూడా లొంగిపోయాడు.

వీరప్పన్‌ని కలిసిన అర్జునన్ సరండర్ ఐపొమ్మని కోరాడు. వీరప్పన్, అర్జునన్‌ని ఒప్పించి శ్రీనివాస్ హత్యకి అత్యంత హేయమైన పథకం వేశాడు.

పథకం ప్రకారం అర్జుననే శ్రీనివాస్‌ని కలిసి వీరప్పన్ లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నాడని సమాచారం ఇచ్చాడు.

1991 నవంబర్ నెల పదవ తారీకు సాయంత్రం అడవిలోని ఆలయంలో శ్రీనివాస్ ప్రార్థనలు చేశాడు. వీరప్పన్‌ని కలుసుకోవడానికి నిరాయుధుడుగా బయులుదేరారు. వీరప్పన్ జిత్తుల్ని నమ్మవద్దని సహచరులు వారించినా శ్రీనివాస్ వినలేదు. తన కార్యక్రమం గురించి పోలీసు అధికారులకు శనివారం రాత్రి పదకొండు గంటలకే తెలియజేశారు. తాను వీరప్పన్‌ని దగ్గిరకి వెళ్తున్నాననీ, తాను కోరినప్పుడు మాత్రమే రెండు జీపుల్లో ఆయుధాలు లేని పోలీసులని పంపాలని కోరాడు. ఈ విషయాలు 12 నవంబర్ 1991 నాటి ఈనాడు పత్రికల్లోవచ్చాయి.

ఆదివారం ఉదయం 5 గంటలకి శ్రీనివాస్ నిర్దేశిత స్థలంలో వీరప్పన్‌ని కలిశాడు. అప్పుడు జరిగిన విషయాన్ని 1993 నాటి ఇండియాటుడే/నక్కీరన్ ఇంటర్వ్యూలో వీరప్పన్ ఇలా వర్ణించాడు *"... అతడు వాయు వేగంతో నా వద్దకు చేరుకున్నాడు. నాలో*

రక్తం ఉడికిపోతుంది. అతడి ఛాతీని చీల్చి, అందులోంచి వేడి రక్తం ఉబికి వస్తూంటే చూసే సమయం కోసమే నేను కాచుకుని కూర్చున్నాను. నేను నా తుపాకి తీసుకుని అతడు ఏమి జరుగుతోందో తెలుసుకునే లోగానే కాల్చిపారేశాను. తర్వాత అతడి తలను, చేతులను కూడా నరకడం ప్రారంభించాను. నాపై మరతుపాకులను ఎక్కుపెట్టాలని కోరుకున్న చేతులు అవే. తర్వాత నేను అతడి తలను గుర్తుగా, భద్రంగా దాచాను".

ప్రస్తుతం ఈ పుస్తకంలో కూడా ఆ కిరాతకం గురించి వీరప్పన్ వెర్షన్‌లో ఈ విధంగా ఉంది : "...అతని శరీరం మీద రెండులీటర్ల పెట్రోలు పోసి తగులబెట్టాను. తలను తీసుకెళ్ళి జుట్టును కాల్చేశాను..మేమూ, తమ్ముడు అర్జునన్ కలిసి నిప్పు రాజేసి ఆ డి.ఎఫ్.ఓ. తలను పూర్తిగా తగుల బెట్టేశాం...." - (పే.47)

ఈ అమానవీయ పద్ధతులని విశ్లేషిస్తే వీరప్పన్ మానసిక స్థితిని అంచనా వేయవచ్చు.

శ్రీనివాస్‌ని ఇంత కిరాతకంగా చంపడానికి వీరప్పన్ చెప్పేకారణాలేమిటి?

ఈ పుస్తకంలో అక్కడకొంతా, ఇక్కడకొంతా చొప్పున వీరప్పన్ శ్రీనివాస్ పైన చేసిన ప్రధాన ఆరోపణలు ఇవీ -

- గతంలో శ్రీనివాస్ వీరప్పన్ శత్రువులకి తుపాకులిచ్చి వీరప్పన్‌ని చంపించే ప్రయత్నం చేశాడు.
- తర్వాత మరోసారి వీరప్పన్ శ్రీనివాస్ కస్టడీలో ఉన్నప్పుడు శ్రీనివాస్‌కి వీరప్పన్‌ని చంపించే ఆలోచన ఉందని ఒక వాచర్ వీరప్పన్‌కి చెప్పాడు.

వీరప్పన్‌ని సరండర్ చేయించి సంస్కరిద్దామని నిరాయుధంగా వీరప్పన్ దగ్గిరకి వెళ్ళి చచ్చిపోయిన వాడు వీరప్పన్ చంపడానికి కుట్రలు చేశాడనేది అంత నమ్మశక్యంగాలేదు. అటువంటి కుట్రలు అలవాటైన మనిషి వీరప్పన్ దగ్గిరకి నిరాయుధంగా వెళ్ళే అవకాశాలు తక్కువ ఉన్నాయి.

శ్రీనివాస్ ఊళ్ళో మారియమ్మగుడి కట్టించాడు.

గతంలో మారియమ్మజాతర జరిగినప్పుడు ప్రజలు వేలసంఖ్యలో మేకలు, కోళ్ళు బలి ఇచ్చేవారు. అక్కడ రక్తం నది లాగా పారేది.

వీరప్పన్ శ్రీనివాస్ పైన చేసే మరో ఆరోపణ ఏమిటంటే "ఆ గుడిలో మేకలు కోళ్ళు బలి ఇవ్వకూడదనీ, కావాలంటే ఒక రెండు కోళ్ళు మాత్రం గుళ్ళో కోసి మిగతావన్నీ బయట వేరే చోట కోసుకోవాలని చెప్పాడు డి.ఎఫ్.ఓ. ప్రజలు అప్పుడు భయపడి అలాగే చేశారు.."- (పే. 45)

వీరప్పన్ చేసిన ఈ ఆరోపణవల్ల ఆ అటవీ ప్రాంతప్రజల్ని సంస్కరించి జంతుబలి దురాచారాన్ని మాన్పించేందుకు శ్రీనివాస్ ప్రయత్నించాడని మనకి అర్థం అవుతోంది.

ఇకపోతే వీరప్పన్ శ్రీనివాస్ పైన పగ బట్టడంలో వీరప్పన్ చెల్లెలు ఆత్మహత్య చేసుకున్న ఉదంతం కూడా ప్రభావాన్ని చూపింది.

**1993** మే **6-20** నాటి ఇండియాటుడే (తెలుగు) సంచిక ఇలా రాసింది : "... వీరప్పన్ సోదరి మారి కూడా వైద్యశాలలో సహాయ సహకారాలు అందించసాగింది. ఇది చూసి అనూయ చెందిన స్థానిక పోలీసులు ఆమెకు శ్రీనివాస్‌కు మధ్య

*అక్రమసంబంధం అంటగడుతూ వదంతులు ప్రారంభించారు. వాటిని భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది..."*

ఈ సంగతి నిజం కావచ్చు, కాకపోవచ్చు అయితే వీరప్పన్ కూడా శ్రీనివాస్ తన చెల్లెల్ని రేప్ చేశాడని గానీ హత్య చేశాడని గానీ ఆరోపణ చెయ్యలేదు. ఆమె ఆత్మహత్య చేసుకుందనే చెపుతున్నాడు. ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి శ్రీనివాసే కారణం కావచ్చని అనుమానం వ్యక్తం చేస్తాడు.

ఇక్కడ శ్రీనివాస్ గురించి నేను చెప్తున్న వివరాలన్నీ ఆయా కాలాల్లో పత్రికల వార్తా, కథనాలనుంచే తీసుకున్నాను. ఇదే సంపూర్ణసత్యం అని నేననట్లేదు.

చిత్త శుద్ధి ఉంటే ఈ విషయంలో నిజానిజాలు ఇప్పటికైనా ఆయా గ్రామల్లో పరిశోధించి నక్కీరన్ తెలుసుకోవచ్చు. కానీ పరిశోధన అంటే కేవలం వీరప్పన్‌ని కలుసుకుని అతని అభిప్రాయాల్ని మాత్రమే ప్రకటించడంగా అర్థం చేసుకున్న నక్కీరన్ గోపాల్‌కి శ్రీనివాస్ ఉదంతం పరిశోధించాల్సిన అంశంగా కనిపించలేదు. ఒక వేళ ఏదైనా పరిశోధించి ప్రచురించినా అది వీరప్పన్ చెప్పేదానికి భిన్నంగా ఉంటే తమ "వీరప్పన్ లింక్" తెగిపోతుందేమోననే భయం కూడా నక్కీరన్‌కి ఉందేమో మనకి తెలీదు. వీరప్పన్ ఉదంతం విజయానికి సోపానమయ్యే మంచి అవకాశంగా నక్కీరన్ పరిగణిస్తున్న సంగతి ఇందాకే చూశాం.

శ్రీనివాస్ గురించి మరేదైనా వివరాలు నక్కీరన్ పత్రికలో గతంలో ఏవైనా వచ్చాయో లేదో నాకు తెలీదు. కానీ శ్రీనివాస్‌ని కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గోపాల్ పేర్కొనడం చూస్తూ ఆయనకి శ్రీనివాస్ పట్ల అంత ఆసక్తి, శ్రద్ధ లేదనే అభిప్రాయం నాకు కలుగుతోంది.

శ్రీనివాస్ పాశవికంగా వీరప్పన్ చేతిలో హత్యకు గురైన విషయాన్ని ఆయన వెంట వెళ్ళిన కృష్ణ అనే అటవీశాఖ వాచర్ పోలీసులకి చెప్పాడు. చిత్రం ఏమిటంటే ఈ కృష్ణ ఒకప్పుడు వీరప్పన్ అనుచరుడిగా ఉండి స్మగ్లింగ్‌లో పాలు పంచుకున్న వాడే. ఆ తరువాత మనసు మార్చుకుని ఆ పనులు మానుకున్నాడు. శ్రీనివాసే కృష్ణకి అటవీ శాఖలో వాచర్ ఉద్యోగం ఇచ్చాడు. ఇదంతా 1991 నవంబర్ 12నాటి ఈనాడు దినపత్రికలో వచ్చింది.

శ్రీనివాస్ మరణ వార్త ఆంధ్రప్రదేశ్‌లోని వృద్ధులైన ఆయన తల్లితండ్రులకి, భార్యకి శరాఘాతంలా తగలింది.

అతడి కుటుంబానికి కర్ణాటక ప్రభుత్వం లక్షరూపాయలు ఇచ్చి చేతులు దులిపేసుకుంది. ముఖ్యమంత్రి బంగారప్ప శ్రీనివాస్ భౌతికకాయాన్ని సందర్శించి, సంతాపం వ్యక్తం చేసి, రాష్ట్రపతి శౌర్యపతకం బహూకరించ వలసిందిగా కోరుతూ కేంద్రానికి సిఫార్సు చేస్తానని అన్నారు. అంతటితో శ్రీనివాస్ అధ్యాయం ముగిసింది.

శ్రీనివాస్‌కి ఆ ఊళ్ళో ఇప్పటికీ ఉన్న ప్రజాదరణ గురించి కీలకమైన క్లూలు మనకి ఈ పుస్తకంలోని వీరప్పన్ మాటల్లోనే దొరుకుతున్నాయి.

*"ఆ ఊరికి ఇప్పుడు పోయి అడిగినా ఎవరూ ఆ డి.ఎఫ్.ఓ. కి వ్యతిరేకంగా ఏమీ*

*మాట్లాడరు. ఒక్కో ఇంట్లో డి.ఎఫ్.ఓ. ఫోటో కూడా ఉంటుంది. లేకపోతే పోలీసులు చంపేస్తారు...'' -(పే.44)*

వీరప్పన్ శ్రీనివాస్‌నే కాదు ఇంకా అనేక మంది పోలీసు అధికారుల్ని చంపేశాడు. వాళ్ళెంత దుర్మార్గులో ప్రజలే చెపుతారని వీరప్పన్ ఈ పుస్తకంలో అనేక చోట్ల ధీమాగా చెప్తున్నాడు. *(ఉదా:''..ఈ ప్రాంతంలో గోపాలకృష్ణన్‌ని ఎస్‌పీ అని ఎవ్వరూ అనరు. 'మేకల దొంగ' అనే అంటారు'' (పే. 53)).*

1991లో చచ్చిపోయిన ఫారెస్ట్ డిప్యూటీ కన్సర్వేటర్ గురించి వ్యతిరేకంగా ఊళ్ళో ఎవ్వరూ ఏమీమాట్లాడినా ఊరుకోని పోలీసులు, ''ఒక్కో ఇంట్లో'' ఆయన ఫోటోలని ఉంచకపోతే ఊరుకోని పోలీసులు - తమ స్వంతశాఖ పోలీసు అధికారుల గురించి చెడ్డగా మాట్లాడుతుంటే ఎలా ఊరుకుంటున్నారు?

వీరప్పన్ మాటల్ని - చెప్పింది చెప్పినట్టుగా ప్రచారం చేసే నక్కీరన్ శ్రీనివాస్‌కి ఇప్పటికీ ప్రజల్లో ఉన్న ఆదరణని గురించి నిజానిజాలను తెలుసుకునే ప్రయత్నం ఏమైనా చేసిందా?

ఊళ్ళో శ్రీనివాస్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్ని వీరప్పన్ నాటకం అని అంటాడు. వాదన కోసం వైద్యశాలలు, రోడ్లు, గుడి నాటకం అనుకున్నా - నిరాయుధంగా వెళ్ళి వీరప్పన్ చేతిలో ప్రాణాలు బలి ఇవ్వడం నాటకం ఎలా అవుతుంది?

వీరప్పన్ వెర్షన్ ప్రకారం - వీరప్పన్ హీరో, శ్రీనివాస్ విలన్. వీరప్పన్ చెప్పిందంతా ఎటువంటి క్రిటికల్ రిమార్క్ లేకుండా ప్రచారం చేస్తోందంటే - ఇదే తుదిమాట అని నక్కీరన్ విశ్వసిస్తున్నట్టా? శ్రీనివాస్ జీవితం, కృషిపై ఎటువంటి తులనాత్మక పరిశీలన ఇంక అవసరంలేదా? హంతకుడు వీరప్పన్ చెప్పిందే చలామణీ కావాలా?

## వీరప్పన్ మాటల్లో వైరుధ్యాల సంగతేమిటి?

1993 నాటి ఇంటర్వ్యూలో కస్టడీలో ఉన్నప్పుడు తనను పోలీసులు చిత్రహింసలు పెట్టారని వీరప్పన్ అంటాడు. మే 6-20, 1993 నాటి ఇండియాటుడే ''..*అయితే కస్టడీలో అధికారులు తనని చిత్రహింసలు పెట్టారని అతడు ఆరోపించాడు. ఆ దేవుడిదయవల్లనే తాను వారిబారినుండి తప్పించుకోగలిగానని చెప్పాడు?*''అని రాసింది.

కానీ ఇదేవిషయం గురించి ఇప్పటి పుస్తకంలో వీరప్పన్ వెర్షన్ ఇందుకు భిన్నంగా వుంది : ''... *ఆ తరువాత 'అయ్యో నాకు బాగా ఆకలిగా, నీరసంగా వుంది. కొంచెం భోజనం తెప్పించండి. తక్కిన విషయాలు రేపు చెబుతాను' అన్నాను. పెరుగన్నం పెట్టారు. తిన్నాను. నన్ను ఒక రూంలో పెట్టారు. మరునటి రోజు ఇంకొక రూంకి మార్చారు. ఇట్లా పదిహేను రోజులపాటు న్యాయమైన భోజనం పెడుతూ నన్ను తమదగ్గిర పెట్టుకున్నారు..'' -(పే. 27). ''... అయితే నన్ను మాత్రం కొట్టలేదు. ఎందుకంటే నేను ఏ విషయాన్నీ దాచలేదు కదా!...'' - (పే. 29)*

ఇదొక్కటేకాదు. ఇంకా చాలావిషయాలు ఉన్నాయి. తాను కేవలం తప్పుచేసినవాళ్ళనే శిక్షిస్తానని , తప్పు చెయ్యనివాళ్ళని (వాళ్ళు పోలీసులైనా సరే) విడిచిపెడతాననే

ధోరణిలో వీరప్పన్ చాలా చోట్ల మాట్లాడతాడు. రోడ్ల మీద బాంబులు పెట్టకూడదని టెర్రరిస్టు మురాలకి నీతులు చెపుతాడు.

మరోపక్క శ్రీనివాస్‌ని చంపేందుకు నాటు బాంబులతో, మందుపాతరలతో పథకం వేశాననీ, అతను మూడు వందల మందితో వచ్చినా, నాలుగువందల మందితో వచ్చినాసరే ఎవ్వరూ ప్రాణాలతో బయట పడకూడదనీ చెపుతాడు. ఒక ప్రేలుడు పేలితే నాలుగువైపులా అరకిలోమీటరు దూరం వరిధిలో ఎవరొచ్చినా ప్రాణాలు కోల్పోవలసిందేననీ, అలాంటి మందు పాతర రెడీ చేసిపెట్టాననీ అంటాడు.

మరో సందర్భంలో మందుపాతర పేల్చాడు కూడా.

కావేరి వివాదంలో రెండువందల మంది తమిళులు చచ్చిపోయారనీ, లక్షమంది శరణార్ధులుగా పారిపోయారని చెపుతాడు. పోలీసు స్టేషన్లో అత్యాచారం చేశారనీ అంటాడు. అదంతా విన్న తనకి వెర్రికోపం వచ్చిందనీ, వెళ్ళివాళ్ళని కాల్చాలన్న ఆవేశం రగిలిందని అంటాడు.

*"... చూశాను. రామాపురం స్టేషన్ దగ్గరలో వుంది. దాని మీద దాడి చేశాను..."* -(పే. 48) అంటాడు. దాడిచేసి 7గురు పోలీసుల్ని చంపేశాడు.

దగ్గరలో ఉందని దాడిచేశాడేకానీ, ఆ అత్యాచారాలు చేసిన స్టేషన్ ఇదేననీ, తను చంపిన వాళ్ళు అత్యాచారాలు చేశారనీ నిర్ధారించుకున్న దాఖలాలు లేవు.

ఇవన్నీ ఒక ఎత్తు - తను కస్టడీలో ఉన్న సందర్భంలో చెప్పినవి ఒక ఎత్తు -

తొలినాళ్ళలో తుపాకీ కొనడానికి వెళ్ళినపుడు వీరప్పన్ పోలీసులకి చిక్కాడు. పోలీసులు పట్టుకోగానే *"రెండు హత్యలు చేశాను. ఒక ఏనుగుని చంపాను" (పే.26)* అని చెప్పాడు. మళ్ళీ ఎస్పీ,డిఎస్పీ విచారిస్తుంటే *"నా పేరు వీరప్పన్. నేను ఇద్దర్ని కాల్చి చంపాను..మీరు కేసువేయండి. నేను కోర్టులో తేల్చుకుంటాను"(పే.26,27)* అంటాడు.

15 రోజులు కస్టడీలో ఉన్నాక మరో డిఎస్పీతో మాట్లాడతాడు.*"అయ్యా గుండలపేట అడవిలో జరిగిన సంగతి ఫారెస్టు వాళ్ళ దగ్గర డి.ఎస్.పి. దగ్గర పొరపాటుగా చెప్పివున్నాను. నిజం ఏమిటంటే ఫారెస్టు వాళ్ళు నలుగురైదుగురు నా మనిషి ఒకణ్ణి పట్టుకున్నారు. అప్పుడు వాడు వాళ్ళ నుంచి తప్పించుకుని పారిపోవ టానికి ప్రయత్నం చేశాడు. ఒక ఫారెస్టు గార్డు నా మనిషి మీద కాల్పులు జరిపాడు. ఒక తూటా గురితప్పి వేరే గార్డుకు తగిలింది. అప్పుడు వాళ్ళు వీరప్పనే ఆ ఫారెస్టుగార్డుని కాల్చి చంపాడు అని డి.ఎస్.పి. దగ్గర చెప్పారు. అది నేను ఒప్పుకున్నాను. కాని ఇప్పుడు మీతో జరిగింది జరిగినట్టు చెప్తున్నాను'అన్నాను..." (పే.27)*

మొదట వీరప్పన్ కాల్చి చంపినదీ, కాల్చి చంపానని ఒప్పుకున్నదీ - ఫారెస్ట్ గార్డుని కాదు. వేరే ఇద్దరు మనుషుల్ని. తన విరోధులని. మళ్ళీ ఈ డిఎస్పీ దగ్గిర ఫారెస్టు గార్డు కథ ఎలా చెప్తున్నాడు. అది ఎలా పొసుగుతుంది? మొదటి ఒప్పుకున్న రెండు హత్యల సంగతి ఏమిటని పోలీసులు అడగరా?

ఆ తర్వాత వీరప్పన్‌ని శ్రీనివాస్ కస్టడిలో వదిలి పెట్టినప్పుడు అక్కణ్ణించి తప్పించు కున్నాడు. శ్రీనివాస్ తనని చంపెయ్యాలని అనుకున్నాడని ఆరోపణ చేస్తాడు.

*"నేను ఏదో అడవి జంతువుని కాల్చాను. అందుకు కేసు వెయ్యొచ్చు కదా?"* *(పే.30)* అని శ్రీనివాస్‌ని విమర్శిస్తాడు.

అంతక్రితమేతాను పోలీసుల దగ్గిర రెండు హత్యల విషయం ఒప్పుకున్న సంగతీ, డిఎస్పీ దగ్గిర ఫొరెన్స్టు గార్డు చచ్చిపోయిన కేసు తప్పుగా తన మీద బనాయించిన విషయాన్ని ఎత్తిన సంగతీ వదిలిపెట్టి - అడవి జంతువుని కాల్చాను కేసు వెయ్యొచ్చు కదా అంటున్నాడు.

వీరప్పన్ ఇలా పేజీపేజీకీ తన వాదాన్ని అవకతవకగా మార్చుకుంటూ చెప్పినా, అదిపొసగక పోయినా, పరిశోధనాత్మక నక్కీరన్ వారికి ఎటువంటి అభ్యంతరమూ లేదు!

## 'శివసుబ్రహ్మణ్యం' నీతి ఎంత?

ఈ 1996 వీడియో ఇంటర్వ్యూకి ముందే 1993లోనే నక్కీరన్ విలేకరి శివసుబ్రహ్మణ్యం వీరప్పన్‌ను మొదటిసారిగా ఇంటర్వ్యూ చేశాడు. ఆశ్చర్యకరంగా ఆ ఇంటర్వ్యూ సుమారుగా ఒకేసారి నక్కీరన్, ఇండియాటుడే పత్రికల్లో వచ్చింది.

ఆ ఇంటర్వ్యూపై హక్కుతమదంటే తమదని ఈ రెండు పత్రికలు గొడవ పడ్డాయి.

ఈ వివాదం గురించి ప్రస్తావిస్తూ ఇండియాటుడే సంపాదకులు అరుణ్‌పూరి తమ - 'మే 21 - 5 జూన్ 1993 సంచిక సంపాదకీయంలో ఇలా ప్రకటించారు : *"... కిందటి సంచికలో ఎర్రచందనం స్మగ్లర్ వీరప్పన్‌పై ఇండియాటుడే ప్రచురించిన స్పెషల్ రిపోర్ట్స్ గురించి గత పక్షం ఒక వార్తాపత్రిక అనుచితమైన వివాదాన్ని సృష్టించింది. వారు పక్షపాతంతో ప్రచురించిన వార్తల ఫలితంగా మా రిపోర్ట్స్ ప్రామాణికత, ప్రత్యేకతలు గురించి సందేహాలు తలెత్తి ఉంటాయి. మే 1వ తేదీన విడుదలైన మా ఆంగ్ల సంచికలో వీరప్పన్ ఇంటర్వ్యూను ప్రత్యేక కథనంగా ప్రచురించాము. వారి విలేఖరులను మేము "మభ్యపరచి, కొనుగోలు" చేసి ఆ ఇంటర్వ్యూకు వారి టేపులు, ఫోటోలు "సంపాదించా"మని నక్కీరన్ అనే తమిళ వారపత్రిక ఆరోపించింది. ప్రెస్ కౌన్సిల్‌కు చేసిన ఒక అశ్లీల "ఫిర్యాదు" ప్రతులను నక్కీరన్ వివిధ వార్తాపత్రికలకు పంచిపెట్టింది. అయితే, తమకు అలాంటి ఫిర్యాదు ఏదీ అందలేదని ప్రెస్ కౌన్సిల్ ఇండియాటుడేకు తెలియజేసింది. మేము కోరినప్పటికీ, నక్కీరన్ తమ ఫిర్యాదు ప్రతిని మాకు పంపలేదు. మేము పత్రికారచన నైతిక విలువలను ఉల్లంఘించామంటూ, యధార్థాలను వక్రీకరించి ఆ పత్రిక ఆరోపించింది. పై పెచ్చు ఇండియా టుడే హక్కులను ఉల్లంఘించడం ద్వారా నక్కీరన్ నైతిక విరుద్ధంగా వ్యవహరించింది. ఇందుకు మేము ఆ పత్రికపై చట్ట ప్రకారం చర్య తీసుకొంటున్నాము.*

*ఇక నక్కీరన్ పత్రిక చేసిన నిర్దిష్ట ఆరోపణల విషయానికి వస్తే, తాను ఫ్రీలాన్స్ జర్నలిస్టుననీ, తన సొంత చొరవతోనే ఇంటర్వ్యూ చేశానని శివసుబ్ర మణియన్ సంతకం చేసి ఇచ్చిన ప్రకటన మా దగ్గర ఉంది. నక్కీరన్ ఆరోపిస్తునట్లు ఇంటర్వ్యూను మాకు అప్పగించాలని ఆయనను మేము ఎప్పుడూ, ఏవిధం గానూ బలవంత పెట్టలేదు. ఇంటర్వ్యూ అంటున్న దాని భాగాలను ప్రచురించిన నక్కీరన్ ఏప్రిల్ 1వ తేదీ*

సంచికకు ముందే ఇంటర్వ్యూ, ఫోటోల కాపీరైట్‌ను ఇండియాటుడే సాధించింది. అందువల్ల పత్రికా రచన నైతికవిలువలను మేము ఉల్లంఘించిన ప్రసక్తేలేదు.

...నిజానికి శివసుబ్రమణియన్ మద్రాసులోనే ఉండి, టేపులు,ఫోటోలను సరిచూసుకొనే నిమిత్తం ఇండియా టుడేకు అందజేశారు. ఇండియాటుడే ఆంగ్ల సంచికతో పాటే నక్కీరన్ మే1వ సంచిక అదే తేదీన విడుదల యింది. అంతేకాకుండా, తమ విలేఖరులను వెదకడానికి తమ ప్రతినిధులను పంపించామనీ, అయితే వారిని కని పెట్టలేక పోయామంటూ నక్కీరన్ ఒక వ్యాసాన్ని ప్రచు రించింది. "జరిగినదంతా వెండితెర థ్రిల్లర్లను మించి పోయింది"అని అందులోపేర్కొన్నది. నిజానికిఅలాంటి ఉద్వేగ్న భరిత ఉదంతమేదీ జరగలేదు. ఆ విలేఖరి ఆ సమయంలో మా మద్రాసు కార్యాలయం లోనే ఉన్నారు..."

1993 నాటి తమ ఇంటర్వ్యూ గొప్పల్ని గోపాల్ ఈ పుస్తకంలోని తన ముందు మాటలో వివరంగా ప్రస్తావించారు. అందులో ఏయేపత్రికలు తమని ఏవిధంగా వెక్కిరించాయో, ఎవరెవరు ప్రశంసించారో చాలా వివరంగా ప్రస్తావించారు కానీ ఇండియాటుడేకి సంబంధించి వివాదం గురించి ఎక్కడా ప్రస్తావించలేదు.

ఈ వివాదంలో తాము ప్రెస్ కౌన్సిల్‌కి వెళ్ళదలచిన విషయాన్ని, వెండితెర థ్రిల్లర్లను మించిన పద్ధతిలో తన విలేకరులని వేరెవరో ఎత్తుకెళ్ళారని నక్కీరన్ వ్యాసాలు రాసిన సంగతిని గోపాల్ ఇప్పుడు ప్రస్తావించట్లేదు.

ఈ వివాదంలో నక్కీరన్ ప్రెస్‌కౌన్సిల్‌కి వెళ్ళి నెగ్గివుంటే ఉంటే గోపాల్ ఆ విషయాన్ని గొప్పగా చాటుకునేవారనడంలో ఎటువంటి సందేహంలేదు.

శివసుబ్రహ్మణ్యం తాను ఫ్రీలాన్స్ జర్నలిస్టనీ, తన స్వంత చొరవతోనే ఇంటర్వ్యూ చేశానని చెప్పి సంతకం చేసిన ప్రకటన తమ వద్దనే ఉందని ఇండియాటుడే స్పష్టంగా ప్రకటించింది. నక్కీరన్ ప్రెస్ కౌన్సిల్‌కి వెళ్ళక పోవడానికి బహుశా ఇదే కారణం అని ఊహించవచ్చు.

గోపాల్ ముందుమాటలో శివసుబ్రహ్మణ్యం గురించి ఇండియాటుడే ప్రకటనని ప్రస్తావించడం గానీ, ఖండిం చడంగానీ చేయట్లేదంటే ఈ ఇంటర్వ్యూని ఏకకాలంలో రెండుపత్రికలకూ ఇచ్చారని అనుకోవాలి.

ఏమో ఎవరికి తెలుసు? గోపాల్ వీరప్పన్ సమస్యని విజయసోపానానికి అవకాశంగా భావించినట్లే, శివసుబ్రహ్మణ్యం కూడా ఇంటర్వ్యూని మరేదైనా సోపానంగా భావించారేమో ఎవరికి తెలుసు?

## వీరప్పన్ చెప్పింది ఎందుకు మార్చారు?

నక్కీరన్ పత్రికవాళ్ళు ఇంటర్వ్యూని "కొంత సంక్షిప్తం" చేశారని హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ వాళ్ళు చెప్తున్నారు. అలా ఎందుకు చెయ్యాల్సొచ్చిందనే దానికి ఎటువంటి వివరణాలేదు.

అయితే పుస్తకం మొత్తం చదువుతుంటే నక్కీరన్ ఈ ఇంటర్వ్యూలో కొంత భాగం

మార్చిందేమోననే సందేహం కలుగుతుంది. ఆశ్చర్యమేమిటంటే అలా మార్చారని చెప్పడానికి ఉన్న బలమైన కన్లూ ఒకటి ఈ పుస్తకంలోనే కనిపిస్తోంది.

వీరప్పన్ ఒక సందర్భంలో తాను ఐదుగురిని హత్య చేయడం గురించి ఇలా చెప్పుకున్నాడు : *"...అప్పటి నుంచి నా శత్రువులతో మెయిన్‌గా అయ్యన్నన్, అయ్యన్‌దురై, గుణశేఖరన్, ముత్తుకుమార్, ధనపాల్ అనే ఐదుగురితో విరోధం బాగా పెరిగింది. వాళ్ళంతా మంచి వేటగాళ్ళు మంచి తుపాకులు అవీ వున్నవాళ్ళు. 'వీరప్పన్ మన వాళ్ళని కాల్చి చంపాడు కాబట్టి మనం ఎలాగైనా అతణ్ణి కాల్చి చంపాలి' అనే కసితో తిరుగుతున్నారు...*

*వాళ్ళు నన్ను కాల్చేందుకు తిరుగుతున్నారని నాకు తెలుసు. అందుకని వాళ్ళు అసలు ఎక్కడెక్కడ తిరుగుతారో నేనుముందు కనుక్కున్నాను. వాళ్ళని వెంబడించాను. ఐదుగురినీ నేను చంపేశాను. ఇది ఎలా జరిగిందంటే వాళ్ళు తుపాకులు పట్టుకుని నన్ను వెతుక్కుంటూ ఒకచోటుకి వచ్చారు. నేను దాగి వుండి వాళ్ళని ఐదుగురిని కాల్చేశాను. వాళ్ళని చంపిన తరువాత ఆ శవాలను తీసుకెళ్ళి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కావేరి నదిలోకి విసిరేశాము. వాళ్ళ ఐదు తుపాకులను మేమే తీసేసుకున్నాం..." (పే.40)*

వీరప్పన్ వీడియో ఇంటర్వ్యూలో ఈ అయిదుగురి హత్య గురించి చెప్పడంవలన జరిగిన ఒక ఆసక్తి కరమైన సంగతిని గురించి నక్కీరన్ గోపాల్ చెప్పాడు. -ఆ ఐదుగుర్ని హత్య చేసింది వేరేవాళ్ళని కర్నాటక పోలీసులు కేసు ఫైల్ చేశారని ఆ నిందితుల తరఫున కేసును వాదించే లాయర్లు ఆ వీడియో ఇంటర్వ్యూని చూసి కోర్టుదృష్టికి తీసుకువెళ్ళారని గోపాల్ వివరించారు.

ఆ ఐదుగురి హత్యల గురించి ప్రస్తావిస్తూ గోపాల్ తన ముందు మాటలో ఇలా రాశారు : *"... వీరప్పన్ ఆ ఐదుగురినీ పట్టి అతికిరాతకంగా చంపి, వాళ్ళ శవాలను ముక్కలు ముక్కలుగా నరికి గోనె సంచుల్లో మూటలు కట్టి కావేరీ నదిలోకి విసిరిపారేశాడు. తాను వాళ్ళను చంపిన వైనాన్ని చాలా వివరంగా సుస్పష్టంగా తన టీవీ ఇంటర్వ్యూలో చెప్పాడు వీరప్పన్..." (పే. 14)*

ఇప్పుడు గోపాల్ ముందు మాటలో చెప్పిన ప్రకటనని వీరప్పన్ ప్రకటనతో పోల్చి చూడండి. వీరప్పన్ వెర్షన్‌లో చంపిన తర్వాత శవాలను తీసుకెళ్ళి కావేరి నదిలోకి విసిరేసినట్టుగా ఉంది. అంతేకానీ ముక్కలు ముక్కలుగా నరకడం సంగతి, గోనె సంచుల్లో మూటలు కట్టడం సంగతీ అస్సలు లేదు.

ఇదంతా చాలా వివరంగా, సుస్పష్టంగా ఇంటర్వ్యూలో ఉందని స్వయంగా గోపాలే చెప్తున్నారు.

మరి అంత వివరంగా, స్పష్టంగా ఉన్న విషయం వీరప్పన్ వెర్షన్‌లో ఎలా మిస్సయినట్టు? దీనికి సంక్షిప్తీకరణే కారణమా?

వీరప్పన్ చేసిన హత్యల్లో క్రూరచేష్టల పాలు తగ్గించి చూపడమే నక్కీరన్ సంక్షిప్తీకరణ లక్ష్యమా?

వీరప్పన్ క్రూర చేష్టల్ని ప్రపంచం దృష్టిలో పడకుండా పరిశోధనాత్మక నక్కీరన్ ఎందుకు దాచేస్తోంది? "పాలిష్డ్ వెర్షన్"ను ఎందుకు చూపిస్తోంది?

ఈ విషయం హైద్రాబాద్ బుక్‌ట్రస్ట్‌కి తెలిసేజరిగిందని అనుకోవచ్చా?

# ఫూలన్‌కి వీరప్పన్‌కీ ఏమిటి పోలిక?

హైద్రాబాద్ బుక్ ట్రస్ట్ తన ముందుమాటలో "వీరప్పన్, ఫూలన్ దేవి వంటి వ్యక్తుల ఆవిర్భావానికి మూలాలు మన వ్యవస్థలోనే ఉన్నాయి" అని గంభీరంగా ప్రకటించారు.

వీరప్పన్‌ని, ఫూలన్‌నీ ఒకే గాటన కట్టడం యాదృచ్ఛికమో అమాయకత్వమో అర్థం కావట్లేదు.

అణగారిన కులంలో పుట్టిన ఫూలన్ అడుగడుగునా అణచివేతనీ,అత్యాచారాల్ని, అవమానాలనీ ఎదుర్కొంది. చిన్నతనంలోనే ఆమెకు పెళ్ళై భర్త చేతిలోనే అత్యాచారానికి గురైంది. కులవివక్షకీ, హింసకీ లోనైంది. పోలీసులు హింసించారు. బందిపోట్లు ఎత్తుకెళ్ళారు. రాకూర్లు అత్యాచారాలు చేశారు. వివస్త్రని చేసి తిప్పారు.

వీరప్పన్ ఇటువంటి అవమానాలను ఎక్కడ ఎదుర్కొన్నాడు?

వీరప్పన్ పుట్టింది దళిత, అణగారిన కులాల్లోకాదు - పడయాచ్చికులంలో (ఇది ఇక్కడి కాపు కులానికి సమానమని చెప్పారు.) వీరప్పన్ కులవివక్ష, అణచివేత ఎదుర్కోలేదు. పురుషుడే కాబట్టి పురుషాధిక్య సమాజంలో స్త్రీలు ఎదుర్కొనే అవమానాలు కూడా ఇతడికి ఎదురుకాలేదు.

వీరప్పన్ తాతకి 10 ఎకరాల భూమి ఉంది. దానిని వీరప్పన్ తండ్రి చిన్నాయన చెరో ఐదు ఎకరాలూ పంచుకున్నారు. ఓ మోస్తరుగా పండుతుందని చెపుతాడు వీరప్పన్.

కటిక దరిద్రం అని చెప్పలేముకానీ పేదరికాన్ని అనుభవించాడు.

వేటాడటం కుటుంబంలో ఉంది కాబట్టి మెల్లగా ఆ వృత్తిలోకే దిగాడు. తర్వాత ఏనుగుల్ని వేటాడి దంతాలు స్మగ్లింగ్ చేయడం ప్రారంభించాడు. ఏనుగులని వేటాడ్డం సరైనదేనని ఇతని అభిప్రాయం. తర్వాత గంధపు చెక్కల స్మగ్లింగ్‌కి దిగాడు. గ్రూపు తగాదాల్లో హత్యలు ప్రారంభించాడు.

ఇతడికి, ఫూలన్ దేవి జీవితంతో ఏమిటి పోలిక?

# మందు పాతర సంగతి ఎవరు పరిశోధిస్తారు?

వీరప్పన్ ఈ పుస్తకంలో తమిళ టైగర్ల పట్ల అపారమైన సానుభూతి కురిపించాడు. సుమారుగా రాజీవ్ హత్య తర్వాతి కాలం నుంచే వీరప్పన్ మందుపాతరల నైపుణ్యాన్ని సంపాదించాడు.

అతడికి ఈ పరిజ్ఞానం ఎక్కణ్ణించి వస్తోంది? దీంట్లో దేశవిదేశ ఉగ్రవాద సంస్థల, గూఢచార సంస్థల పాత్ర ఎంత?

వీరప్పన్ స్వయంగా "నాకు చాలా మంది తీవ్రవాదులు కూడా తెలుసు. వాళ్ళ సపోర్ట్ కూడా వుందినాకు" అని ప్రకటించాడు.

అత్యంత ప్రమాదకరమైన ఇటువంటి విషయాల మీద దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని పరిశోధనాత్మక నక్కీరన్‌కి తట్టనేలేదు.

'వీరప్పన్'ని నక్కీరన్ తన సర్క్యులేషన్ పెంచుకో గలిగే బంగారు బాతులా చూస్తోందనీ అతడికి చిరాకు కలిగే ఎటువంటి పరిశోధనలూ చెయ్య దలుచుకోలేదనీ, ఎటువంటి ప్రశ్నలూ వేసుకోదలుచు కోలేదనీ, వీరప్పన్ లింకుని సజీవంగా ఉంచుకోవడం కోసం అతడి మౌత్‌పీస్‌గా మారే పరిస్థితి వచ్చినా నక్కీరన్‌కి పట్టింపులేదనీ ఎవరైనా ఆరోపిస్తే అందుకు జవాబేమిటి?

# వీరప్పన్ ప్రలాపాలు

వీరప్పన్ హింసోన్మాదం, పాశవిక శిక్షలు, క్రూరత్వం గురించి సీరియస్‌గా ఎవరైనా పరిశోధించి రాస్తే ప్రజలకి అతడ్ని అర్థం చేసుకోవడంలో చాలా ఉపయోగపడుతుంది. ఈ పుస్తకంలో ఉద్దేశపూర్వకంగానే వీరప్పన్ క్రూరత్వం పై మేలిముసుగు కప్పారని నా అభిప్రాయం.

అయినా ఈ పుస్తకం అంతటా చెదురుమదురుగా ఉన్న ప్రకటనలు చూస్తే అతడి నేరమనస్థత్వం ప్రస్తుతం ఎటువంటి స్థితిలో ఉందో మనకి అర్థం అవుతుంది.

*"చంపడం అనేది ఏమంత గొప్పపనా? ఒక్క తూటా ధ్వని - అంతే పని అయిపోతుంది. మీ దగ్గర తుపాకీ లేకపోతే ఒక పిడిబాకుని షర్టులోపల చెక్కుకుని పోయి ఛటుక్కున కడుపులో పొడిచేయ్. అంతే చచ్చిపోతాడు. అత్యాచారాలు జరగకుండా ఈ ప్రభుత్వం కాపాడాలని అస్సలు ఎదురు చూడకూడదు.*

*పోలీసు అధికారే హత్యచేస్తే ఈ గుండుబాంబులు (మందుపాతరలు) పెట్టండి. జెలెటిన్‌పుల్లలు పదిపెడితే చాలు. వాటికి కనెక్షన్‌ఇచ్చి జీపు వస్తున్నప్పుడు అంటిస్తే జీపు ఇంతెత్తుఎగిరిపడుతుంది. అంతా నల్లగామాడి చెల్లాచెదురుగా పడిపోతారు" (పే.92)*

*"నా దగ్గిర ఎన్నో మాయ విద్యలు వున్నాయి. నన్ను గెలవడం ఎవరికీ సాధ్యం కాదు. నన్ను ఎవరూ నాశనం చెయ్యలేరు. నన్ను నాశనం చేద్దామని ఎవరన్నా తల పెట్టినట్టయితే అతణ్ణి నాశనం చేయడానికి యమధర్మరాజు దున్నపోతు ఎక్కివస్తునట్టేనని అనుకోవాలి. నన్ను చంపడం అంత సులభం కాదు..."(పే.60)*

*"ఇదంతా దేవుడు నాకుయిచ్చిన వరం. ఎన్ని కోట్లు ఖర్చుపెట్టినా ఈ విద్యలను ఎవరూ నేర్చుకోలేరు..." (పే.61)*

*"నేను ఐదువేల కోట్లు డిమాండ్ చేసివుండొచ్చు.... నేను అడిగింది వెయ్యికోట్లు. కావాలంటే వాళ్ళు బేరం చేసి మాట్లాడి కొంత తగ్గించి వుండవచ్చు. కాని ఏమీ మాట్లాడలేదు". (పే. 62)*

*"నీలాగే నేను కూడా ఒకనాడు అధికారంలోకి వస్తాను. ప్రధాన మంత్రిగా వస్తాను. వచ్చి చూపిస్తాను. అప్పుడు నిన్ను కూడా పట్టి లోపలపడేస్తాను. సవాల్ చేస్తున్నా. నేను ఎలక్షన్లో నిలబడతాను. జయలలిత కూడా నా మీద గెలవలేదు" - (పే. 68)*

*"చాలా మంది ప్రజలు వీరప్పన్ ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూస్తున్నారు. ఈ*

విషయం నాకే కాదు. మొత్తం దేశమంతా తెలుసు" - (పే. 80)
"రజనీకాంత్ అందరినీ గౌరవిస్తాడు. నాలాగనే ఆయనకు దైవభక్తి ఎక్కువ" -(పే.99)
"నాలాగే వీరపాండ్య కట్టబ్రహ్మన్న ఎంతో సైనికబలగం వున్న తెల్లవాడిని ఎదిరించి యుద్ధంచేసి వీరమరణం పొందాడు" (పే.91)

"నేను దాని దంతాలు మాత్రం తీసుకు పోతాను. ఆ తర్వాత ఎన్నో కాకులు, గద్దలు, పక్షులు,రకరకాల జంతువులు,జీవరాసులు,చీమలు అన్నీ వచ్చి దాన్ని తృప్తిగా తింటాయి. కడుపునిండా తిన్న తర్వాత 'ఈ ఏనుగును ఏమహారాజు చంపి ఇక్కడ పడేసిపోయాడో ఆయన చల్లగావుండాలి' అని దీవించి వెళ్ళి పోతాయి.....నేను ఏనుగుని చంపివడేసి పోవడం వల్ల దానిని తిన్నవన్నీ నన్ను దీవించి పోవడం వల్ల నాకు పుణ్యం లభిస్తుంది" - (పే. 94,95)

"నేను చీఫ్ మినిస్టర్‌గా వస్తే ఒక రాష్ట్రానికి మాత్రమే ఏదైనా చేయవచ్చు. అందుకే నేను వస్తే ప్రైమ్ మినిస్టర్‌గానే వస్తాను. అప్పుడే ఈ భారతదేశపు కష్టాలన్నింటినీ తీర్చేందుకు వీలవుతుంది. నచ్చంగా ఇది జరుగుతుంది. నాలాంటి మనిషి-నాలాంటి భారతీయ పౌరుడు ఎక్కడాలేడు-ఇక ముందు కూడా పుట్టబోడు..." (పే. 97)
"నాలాంటివాడు ఇంతవరకూ ఈదేశంలో పుట్టలేదు. ఇకముందు పుట్టబోడు"(పే. 100)

ఇవే కాకుండా వీరప్పన్ మనస్తత్వంలో అర్థంచేసుకోవాల్సిన విషయాలు రెండు వున్నాయి. మొదటిది - వీరప్పన్ తమిళ అభిమానం.

"కానీ మన తమిళం వాడు ఆ కన్నడం వాడికి సపోర్ట్ ఇచ్చాడు" - (పే. 38). "ఒరే పాతకుడా తమిళుణ్ణి అంటూన్నావు పడయాచ్చి కులంవాడినని చెప్తున్నావు. ఎవడో కర్ణాటక వాడు చెప్తే నా వాళ్ళ మీదే తప్పుడు కేసు బనాయిస్తావా?" - (పే.39). "... ఆ గోపాలకృష్ణన్ ఎస్పీని చంపాలని నేనొక నిర్ణయం తీసుకున్నాను. అయితే అప్పుడు నేను అతణ్ణి కాల్చలేదు. ఎందుకంటే తమిళం వాడు కదా అని ఊరుకున్నాను..." - (పే. 54)

ఇటువంటి ప్రకటనలే కాకుండా శ్రీలంక, కావేరీ సమస్యలపైన అర్థసత్యాలు, అతిశయోక్తులతో ఉన్న ఎమోషనల్ ప్రకటనలుగా ఈ విషయాన్ని పట్టిఇస్తాయి.

రెండోది : స్త్రీలపట్ల వీరప్పన్ అభిప్రాయం

"నిలబడి ఒంటేలు కూడా పోయలేని ఒక అబల మీద ఇలాంటి దుర్మార్గాలు చేయవచ్చునా?"-(పే. 58). "పదవి కోసం ఒక ఆడదాని కాళ్ళమీద పడొచ్చునా?" - (పే.54). "ఈ ప్రపంచంలో మనం మొట్టమొదట కాపాడవలసింది ఆడవాళ్ళయొక్క శీలాన్నే" -(పే. 75)

అటవీశాఖ అవినీతిని, పోలీసుల అత్యాచారాలనీ, ప్రస్తుత వ్యవస్థలోని హిపాక్రసీని ఈ పుస్తకంలో చూడగలిగిన హైదరాబాద్ బుక్ ట్రస్ట్ - వీరప్పన్ హిపాక్రసీ, కరడుగట్టిన హంతకుడి సైకాలజీ కూడా దీంట్లో వున్నాయని గమనించలేకపోవడం ఆశ్చర్యం.

## బాధ్యత ఉండాల్సిన అవసరం లేదా?

పోలీసులు వీరప్పన్ భార్య ముత్తులక్ష్మిని అరెస్టు చేసి చాలా హింసలు పెట్టారని

రాశారు. నిజమే కావచ్చు. అంతకు మించి మరే సమాచారం ఇందులో ఇవ్వకపోయేసరికి ఆమె ఏమయ్యిందో పాఠకుడికి అర్థం కాదు. ఆమె చచ్చిపోయి ఉండవచ్చునని అనుకునే అవకాశం కూడా ఉంది.

అరెస్టయి జైలుశిక్ష అనుభవిస్తున్న ముత్తులక్ష్మి తానిక భర్తని కలవబోనని హామీ ఇచ్చిన తర్వాత పోలీసులు ఆమెకు కోయంబత్తూరులోని ఒక మిల్లులో ఉద్యోగం ఇప్పించారు. ఆమెకు, కూతురికి ఓ ఇల్లు కూడా కేటాయించారు.

ఈ సంగతులన్నీ నక్కీరన్ గోపాల్‌కి తెలియనివి కావు. ఆయన ముందుమాటలో ఈ సంగతులు చెపితే విషయానికి సమగ్రత వచ్చేది. సమాచారం సమగ్రంగా ఉండాల్సిన అవసరం లేదని నక్కీరన్ భావిస్తే అది వేరే సంగతి.

ఈ పుస్తకంలో చెప్పినట్టు వీరప్పన్ అన్నా, భార్యా, పోలీసుల చేతిలో బాధలు పడింది ఎంతనిజమో,ఆ తర్వాత పోలీసుల సాయం పొందడం కూడా అంతే నిజం.

వాళ్ళు పోలీసులని విమర్శిస్తున్నారేమో తెలియదు. కాని వాళ్ళు వీరప్పన్‌నీ, అతడి పద్ధతులనీ కూడా విమర్శిస్తున్న సూచనలు ఉన్నాయి.

ఇందుకు సంబంధించిన నిజానిజాలపై నక్కీరన్ గోపాల్ ఎందుకు వ్యాఖ్యానించట్లేదు? వీరప్పన్ పద్ధతులని బంధువులు ఆమోదించట్లేదని చెప్పడం 'నక్కీరన్'కి ఇష్టం లేదా?

ఈ పుస్తకంలో పోలీసులు, సైన్యం, ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిన వ్యక్తులు చేస్తున్న దుర్మార్గాలకి సంబంధించిన వివరాలు చాలా ఉన్నాయి. వాటిల్లో అధికశాతం నిజమే అయ్యుంటాయి. పోలీసులు వీరప్పన్‌కి సంబంధించిన విషయాల్లో చేస్తున్న బూటకపు ప్రకటనల సంగతులు ఉన్నాయి. ఇవన్నీ బయటకి రావల్సిందే. ప్రజలు తెలుసుకోవల్సిందే. పోలీసు అకృత్యాలపై ఇంకా అనేక స్వచ్ఛంద సంస్థలూ, మానవ హక్కుల సంస్థలూ కృషి చేస్తున్నాయని అన్నారు. అటువంటి రిపోర్టులని కూడా అందరి దృష్టికి తీసుకురావాలి.

పోలీసులు దుర్మార్గ పద్ధతులవల్ల వీరప్పన్ బలపడుతున్నాడు. ఇంకా అనేకమంది వీరప్పన్‌లు పుట్టడానికి ఆస్కారం వస్తోంది.

అయితే పోలీస్ అకృత్యాలని అర్థం చేసుకోవడానికీ, వ్యవస్థలో లోపాల్ని బయట పెట్టడానికీ వీరప్పన్ చెప్పిందల్లా ఎటువంటి క్రిటికల్ రిమార్క్ లేకుండా ప్రచురిస్తుంటే - వీరప్పన్ అత్యంత న్యాయమైన, ఆదర్శమైన వ్యక్తనే అభిప్రాయం, అతడిపట్ల అతడి పద్ధతుల పట్లా ఆరాధనాభావం వ్యాప్తి కావా? అది సమస్యకి పరిష్కారం అవుతుందా? "కొండ నాలుకకి మందేస్తే..."అన్న చందం కాదా?

ఈ పుస్తకానికి తమిళంలో పెట్టిన పేరు "ముధల్ వెట్టైయుమ్ ముధల్ కొలైయుమ్" (మొదటి వేట మొదటి హత్య). తెలుగులో కేవలం "గంధపు చెక్కల వీరప్పన్" అనే పేరుపెట్టారు. కనీసం గంధపుచెక్కల స్మగ్లర్ అని కూడా అనలేదు. తమిళం పేరులో అతడు నేరస్థుడు అనే స్పృహ కొద్దిగానైనా ఉంది.

తెలుగు పేరులో 'గంధపు చెక్కల' అనేది వీరప్పన్ ఇంటిపేరులా తయారైంది.

1993లో వీరప్పన్ ఇంటర్వ్యూని ప్రచురించినపుడు ఇండియాటుడే పెట్టిన పేరు

"హంతకుడి అంతరంగం" ఆ తర్వాత వచ్చిన ఇండియాటుడే సంచికలో అరుణ్ పూరి తన సంపాదకీయంలో ఇలా రాశారు : "వాస్తవాలను వక్రీకరించే అవకాశం వీరప్పన్‌కు ఇవ్వరాదనే ఉద్దేశంతో అతని పూర్వాపరాలను కూడా చేర్చి, ఇంటర్వ్యూను సరైన రీతిలో పొందుపరచి ఆ వ్యక్తి మానసిక వ్యక్తిత్వ వివరాలతో స్పెషల్ రిపోర్ట్స్ రూపంలో పాఠకులకు అందించాము"

నా ఉద్దేశంలో స్థూలంగా ఇది సరైన పద్ధతి.

అర్ధసత్యాలు, వక్రీకరణ, స్వోత్కర్షలతో నిండి వున్న వీరప్పన్ వాదనల్లో నిజానిజాలను సాధారణ పాఠకుడు ఎలా అర్థం చేసుకోగలడు?

ఒకవేళ తప్పు అవగాహనకీ, తప్పుడు అభిప్రాయాలకీ వస్తే, వీరప్పనే ఆదర్శంగా భావిస్తే జరిగే దుష్ఫలితాలకి బాధ్యత ఎవరిదౌతుంది?

నక్కీరన్ గతంలో హంతకుడు ఆటోశంకర్ జీవిత చరిత్రని సంవత్సరాల తరబడి ధారావాహికగా ప్రచురించింది. వీరప్పన్‌ని కూడా ఆ పత్రిక విజయ సోపానం అందుకునే అవకాశంగా పరిగణిస్తోంది కాబట్టి అర్థం చేసుకోగలం.

కాని దశాబ్దాలు తెలుగు సాహిత్య రంగంలో కొన్ని వందల ఆలోచనాత్మకమైన గ్రంధాల్ని ప్రచురించి తెలుగు ఆలోచనని పరిపుష్టం చేయడంలో ప్రధానపాత్ర వహించిన హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ఏ ప్రయోజనాన్ని ఆశించి ఈ అసమగ్ర, బాధ్యతారహిత ప్రయోగం చేసిందనేది అంతుబట్టని ప్రశ్న

('విజయవిహారం', ఆగస్టు 2000)

---

## అనుబంధం - 2

## హైద్రాబాద్ బుక్‌ట్రస్ట్ సమాధానం

# వ్యక్తులంటే వ్యవస్థలో జరిగే విస్తృత ఘర్షణల పనిముట్లే

కృష్ణా నదీజలాల నుంచి కరెంటు ఛార్జీల వరకు ఏ విషయాన్ని తీస్కున్నా పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలను వ్యక్తం చేసే పత్రికలన్నీ ఒక్క వీరప్పన్ వ్యక్తిత్వాన్ని నిర్ధారించే విషయంలో మాత్రం ఎటువంటి స్వరభేదాలూ లేకుండా ముక్త కంఠంతో మాట్లాడుతుండటం కొంత ఆశ్చర్యకరమైన వాస్తవంగా చెప్పుకోవాలి ఏ పత్రికను తీసుకున్నా - వీరప్పన్‌ను అడవి దొంగగా, స్మగ్లర్‌గా, కరుడు గట్టిన హంతకుడిగా, నక్కజిత్తుల నయవంచకుడిగా, ఎంతటి నీచానికైనా ఒడిగట్టే దుర్మార్గుడిగా అభివర్ణిస్తుండటం రోజూ చూస్తూనే ఉన్నాం. జాతీయ మీడియా మొత్తం ఇదేధోరణి కనబరుస్తోంది. ఇదే ధోరణిలో కొన్ని సినిమాలూ, సీరియళ్ళూ కూడా వస్తున్నాయి. అయితే వీరప్పన్ గురించి

ఇటువంటి నిర్ధారణకు రావటానికి తగిన ఆధారాలేమిటి? ఎటువంటి వివరాల ఆధారంగా ఈ పత్రికలు, మీడియా వర్గాలు ఈ నిర్ధారణకు వచ్చాయి? వీరప్పన్ వ్యక్తిత్వాన్ని అంచనా వేయటంలో ఈ ప్రధాన స్రవంతి పత్రికలు, సినిమాలు, మీడియా వర్గాలు ఉపయోగించిన కొలబద్దలు ఏమిటి? ఈ ప్రశ్నలను కాస్త తరచి చూడాల్సివుంది. జాతీయ మీడియా మొత్తం మరో వాదనకు అవకాశమే లేకుండా ముక్త కంఠంతో ఒకే పాట పాడుతున్నపుడు సమస్యకు ఉన్న మరో దృక్కోణాన్ని గురించి. అవతలి పార్శ్వం గురించి మాట్లాడాలంటే కొంత తెగువ, మరికొంత తెలివిడీ తప్పనిసరి. వీరప్పన్ విషయంలో 'నక్కీరన్' పత్రికా బృందం ఇటువంటి సాహసాన్నే ప్రదర్శించింది. అడవుల్లో, అదీ అందకుండా అస్పష్టంగా వున్న వీరప్పన్ వ్యక్తిత్వ చిత్రాన్ని దేశప్రజల ముందుంచేందుకు కృషి చేసింది. ప్రత్యక్షమైన సమాచారం ఏదీ లేకుండానే వీరప్పన్ గురించి అందరికీ అంతా తెలుసన్న ధోరణి చెలామణీ అవుతున్న సమయంలో వీరప్పన్‌కు సంబంధించిన అనేకానేక వాస్తవాలను, వక్రీకరణలను శ్రమకోర్చి బయటపెట్టింది. యావజ్జాతి ముందు నేరస్తుడిగా నిలబడి, ఛీత్కారాలను అనుభవిస్తున్న వీరప్పన్ అంతరంగాన్ని, ఆలోచనలను ప్రత్యక్షంగా పాఠకుల ముందుంచేందుకు పరిశోధనాత్మక పత్రికగా 'తనకున్న పరిమితుల్లోనే' గట్టికృషి చేసింది. ఇప్పటివరకు వీరప్పన్‌కు సంబంధించిన ప్రత్యక్ష సమాచారాన్ని జాతిముందుంచిన పత్రికగా నక్కీరన్ కృషిని విస్మరించటానికి లేదు. అడవుల్లో వీరప్పన్‌తో ముఖాముఖీ వీడియో ఇంటర్వ్యూ జరిపిన 'నక్కీరన్' దానిలోని ముఖ్యాంశాలు తమిళంలో వెలువరించిన 'మొదల్ వెట్టయుం - మొదల్ కొలైయుం' పేర వెలువరించిన పుస్తకాన్ని ఇటీవల 'హైదరాబాద్ బుక్ ట్రస్ట్' 'గంధపు చెక్కల వీరప్పన్' పేర తెలుగు పాఠకుల ముందుకు తెచ్చిన విషయం తెలిసిందే. ఈ పుస్తకాన్ని 'విజయవిహారం' ఆగస్టు-2000 సంచికలో సమీక్షిస్తూ సమీక్షకులు రమణమూర్తి కొన్ని ప్రశ్నలను విశ్లేషించటం 'వీరప్పన్'పై సాగుతున్న చర్చను కొంతైనా పరిపుష్టం చేస్తుందనే ఆశతో ఈ ప్రయత్నం చేస్తున్నాం.

వంద పేజీల ఈ పుస్తకంలో వీరప్పన్ ప్రధానంగా తన బాల్యం గురించి, తన అభిప్రాయాలు, ఆలోచనల గురించి నిర్మొహమాటంగా, మనసు విప్పి తాను చెప్పాలనుకున్నది చెప్పాడు. తాను చేసింది చెప్పాడు. వీరప్పన్ పేరు చెబితేనే దేశం మొత్తం (పూర్తి వాస్తవాలు తెలియకుండానే) ఏవగింపుగా, ఏహ్య భావంతో చూస్తున్న ప్రస్తుత సమయంలో వీరప్పన్‌కు తన వాదన తాను వినిపించుకునే వెసులుబాటు కల్పించటం ఈ పుస్తకం సాధించిన మొట్టమొదటి ప్రజాస్వామిక ప్రయోజనంగా చెప్పుకోవాలి.

వీరప్పన్ స్వీయ కథనాన్ని తరచి చూస్తే - 'నేరం'(Crime) , 'నేరస్తుడు' (Criminal), 'న్యాయం' (Justice) వంటి బలంగా పాతుకు పోయిన అనేకానేక భావనలను మూలాలతో సహా ప్రశ్నించటం వీరప్పన్ ప్రధానోద్దేశంగా కనబడుతుంది. 'చట్టం', 'నేరం','హింస' వంటి 'ప్రశ్నించటానికి వీలు లేని' భావనలను ఈ పుస్తకం-చర్చకు పెట్టి, వాటిని మూలాలతో సహా సమస్యాత్మకం (Problematise) చేసి పాఠకుడి ముందు వుంచుతుంది. అడవుల్లో జీవించే ప్రజల జీవన విధానాలను, ఆకలి దప్పులను, అవసరాలను ఆకళింపు చేస్కోకుండా వేరే ఎక్కడో కూర్చుని చట్టాలు చేస్తే వాటి పర్యవసానాలను తామెందుకు అనుభవించాలన్న ధోరణి వీరప్పన్ మాటల్లో స్పష్టమవుతోంది. అటవీ చట్టాలు, నిబంధనల పేరుతో తమ జీవితాలను బయటినుంచి శాసించాలని, అనుక్షణం నియంత్రించాలని చూస్తే పర్యవసానాలు ఇబ్బందికరంగానే ఉంటాయన్నది వీరప్పన్ సమాధానంగా కనిపిస్తుంది. తనకు వంశ వృత్తిగా వచ్చిన వేటను నేరంగా పరిగణించే ఈ చట్టం - ఏది నేరం, ఏది కాదన్న దాన్ని నిర్ధారించటానికి ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, కొలమానాలు పక్షపాతంతో, లోపభూయిష్టంగా ఉన్నాయన్నది ఫిర్యాదుగా అర్థమవుతుంది.

ఈ వ్యవస్థ, రాజ్యం, దాని యంత్రాంగం తననూ తనలాగా అడవుల్లో జీవిస్తున్న వారినీ ఇముడ్చుకోలేక పోతున్నాయన్న కోపం, కసి వీరప్పన్ మాటల్లో స్పష్టంగా ధ్వనిస్తోంది. పాఠకులకు, పత్రికలకు, 'నాగరీకులకు' అంతగా తెలియని ఓ కల్లోల అటవీ ప్రపంచాన్ని వీరప్పన్ మన కళ్ళముందుంచుతాడు ఈ పుస్తకంలో. ఒకవైపు ఈ వ్యవస్థతో, చట్టాలతో ఉన్న అనేకానేక సమస్యలకు అటవీ సిబ్బంది అవినీతి, అరాచకాలు, అత్యాచారాలు కూడా తోడవ్వటం ఆదివాసుల జీవితాలను ఎంతగా ఛిద్రం చేస్తోందో అర్థం చేస్కోవటానికి వీరప్పన్ పుస్తకం ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. రాజ్యం, దాని యంత్రాంగం తమకు ఏ మాత్రం అందుబాటులో లేనప్పుడు, అదే యంత్రాంగం తమ ప్రతి కదలికనీ నియంత్రించాలని చూస్తున్నప్పుడు - బలహీనులైతే బతుకు బండలు చేస్కుంటారు. ఏ కొంచెం బలమున్నా తలపడటానికి సిద్ధపడతారు న్యాయం గురించి, నిజం గురించి తమ పక్షాన మాట్లాడేదిక్కే లేనప్పుడు - వీరప్పన్‌లు పుట్టుకొస్తారు. వ్యవస్థతో తెగించి మరీ తలపడటం, తను న్యాయం అని నమ్మిన దానిని ఒంటరి సైనికుడిలా అమలు పరచబోవటం వీరప్పన్ నైజమని రుజువవుతోంది. వీరప్పన్‌కు స్థానికంగా అంత బలాన్ని తెచ్చిపెడుతోంది కూడా అదే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కలిసికట్టుగా కొన్నికోట్లు కుమ్మరించి, బలగాలను మోహరించి, తంటాలు పడుతున్నా వీరప్పన్ లేశ మాత్రం కూడా కలవరపాటుకు గురవకపోవటానికి స్థానికుల్లో తనకున్న మద్దతే కారణం కావచ్చు. దీని మూలాల్లోకి తరచి చూడకుండా వీరప్పన్‌ను క్రిమినల్‌గా, హంతకుడిగా, శాంతిభద్రతల విఘాత కర్తగా చూసినంతకాలం సమస్యలని సంక్లిష్టతని అర్థం చేస్కోనట్లే అవుతుంది.

వీరప్పన్ పదిహేను రోజులకోసారిగానీ స్నానం చెయ్యడనీ, నల్లకోతి కనబడితే కాల్చి చంపి, పచ్చిరక్తం గటగటా తాగేస్తాడని ఇటీవలే ఓ ప్రధాన స్రవంతి పత్రిక పెద్ద కథనాన్ని ప్రచురించింది వాస్తవానికి ఇదంత ముఖ్యమైన సమాచారం కాకపోయినా వీరప్పన్ గురించి ఎన్ని అవాస్తవాలు, అబద్ధాలు ప్రచారంలోకి వస్తున్నాయో, పత్రికల్లో చెలామణీ అవుతున్నాయో అర్థం చేస్కోవటానికి ఈ చిన్న ఉదాహరణలు చాలు. వీరప్పన్‌ను స్వయంగా చూసి, తనతో కొన్ని రోజులు గడిపిన నక్కీరన్ బృందం వీరప్పన్ రోజూ స్నానం చేసి, ఆయుధాలను కడిగి పూజ చెయ్యనిదే దినచర్య ప్రారంభించడని చెబుతోంది. ఇంత చిన్న విషయంలోనే వీరప్పన్ గురించి ఇన్ని అవాస్తవాలు, పుకార్లు ప్రచారంలోకి వస్తుంటే దేన్ని నమ్మాలో, దేన్ని నమ్మకూడదో పాఠకులకే వదిలిపెట్టేయటం ఉత్తమం. 'గంధపు చెక్కల వీరప్పన్' పుస్తక ప్రచురణ విషయంలో హెచ్‌బీటీ చేసింది అదే. ప్రధాన స్రవంతి పత్రికలన్నీ వీరప్పన్‌పై విషం చిమ్ముతూ పుంఖానుపుంఖాలుగా కథనాలు వెలువరిస్తు న్నప్పుడు - సమస్యకు మరో పార్శ్వం కూడా ఉందని తెలుగు పాఠకులకు తెలియజెప్పటంలో ఈ పుస్తకం కొంతైనా ఉపయోగపడుతుందని భావిస్తున్నాం.

వీరప్పన్‌పై నరహంతకుడి ముద్రవేసి, నిరంతరం అదే పాట పాడుతుండటం వల్ల అమాయకులు బలిఅవుతుండటం తప్పించి జరిగేది పెద్దగా ఏమీలేదు. అందుకు ఇప్పటివరకూ నడిచిన చరిత్రే సాక్ష్యం. పైగా ఈ బండబారిన ధోరణి వల్ల సమస్య మూలాలు మరుగునబడిపోతున్నాయి. వీరప్పన్ గురించి రకరకాల సమాచారం రోజూ ఏదో ఓ పక్కనుంచి వినవస్తూనే ఉంది. దంతాల కోసం 200 ఏనుగులను చంపాడనీ, 100 కోట్ల రూపాయల దళితాలు, చందనం స్మగ్లింగ్ చేశాడనీ పత్రికలన్నీ ఘోషిస్తున్నాయి. మొత్తం మీద తాను చంపిన ఏనుగుల సంఖ్య పదుల సంఖ్య దాటదనీ, తాను స్మగ్లింగ్ చేసింది 11 నెలలేననీ, అందులో తనకు పెద్దగా దక్కింది కూడా ఏమీలేదనీ వీరప్పన్ అంటున్నాడు. ఎవరెవరిని ఎలా చంపిందీ వివరంగా చెబుతూ నిర్భయంగా అన్నీ చెబుతున్న వీరప్పన్ ఈ విషయంలో అబద్ధం ఆడాల్సిన అవసరం ఉంటుందా? వీరప్పన్ పేరుమీద అడవుల్లో జరిగిపోతున్న అరాచకాలకు దీన్ని ఓ 'క్లూ'గా తీసుకుంటే అడవుల్లో ఎన్నెన్ని అకృత్యాలు

జరుగుతున్నాయో, ఎవరి పేరు మీద నడిచిపోతున్నాయో కూపీ తీయాల్సి ఉంటుంది. దానికి చిత్తశుద్ధి కూడా అవసరం అవుతుంది.

ఆంధ్రాకు చెందిన నిజాయితీపరుడైన అటవీ అధికారి పందిళ్ళపల్లి శ్రీనివాస్‌ను వీరప్పన్ కిరాతకంగా నమ్మకద్రోహంతో హతమార్చాడని రమణమూర్తి తన సమీక్షలో ప్రధానంగా ప్రస్తావించారు. శ్రీనివాస్ సంస్కరణాత్మక ధోరణిలో స్థానికుల్లోనూ, వీరప్పన్‌లోనూ పరివర్తన తీసుకురావటానికి ప్రయత్నించారని, 'ఒక వీరప్పన్ నేడు తప్పించుకోవచ్చు. కానీ అటువంటి వీరప్పన్‌లు వందలకొద్దీ పుట్టుకురాకుండా చూడటం మన కర్తవ్యం'' అని బోధించే వారనీ పేర్కొన్నారు. నిజానికి వీరప్పన్ వంటి సమస్యలు వ్యక్తుల వల్ల పుట్టుకొచ్చాయని భావించటం సమస్యను తప్పుగా అర్థం చేస్కోవటమే అవుతుంది. ఎవరో ఒకరిద్దరు అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతుండటం వల్ల సమస్య తలెత్తిందనీ, వారిద్దరినీ మార్చినా, లేక వారిద్దరూ లేకపోయినా సమస్య సమసిపోతుందనీ భావిస్తే ఫలితాలు ఇలాగే ఉంటాయని శ్రీనివాస్ ఉదంతం స్పష్టం చేస్తోంది. శ్రీనివాస్ నిజాయితీ గల అధికారా? కాదా? అన్నది చర్చించటం వ్యర్థం. అటు వీరప్పన్‌లను, ఇటు శ్రీనివాస్‌లను వ్యక్తులుగా కాకుండా ఈ వ్యవస్థలో జరుగుతున్న విస్తృత ఘర్షణల్లో పనిముట్లుగా చూడటం అవసరం. ఇక్కడ సమస్య వ్యక్తులకు మాత్రమే సంబంధించినది కాదనీ, వ్యవస్థ స్వరూప స్వభావాల్లో మార్పుల గురించి ఆలోచించనిదే సమస్య కుదుళ్ళు అలాగే ఉంటాయనీ గుర్తించాలి. లేకపోతే శ్రీనివాస్ వంటి అధికారులు వందలకొద్దీ బలైపోయే ప్రమాదం లేకపోలేదు. "ఒక శ్రీనివాస్‌ను ఇప్పటికే కోల్పోయాం. అటువంటి శ్రీనివాస్‌లు వందలకొద్దీ బలవ్వకుండా చూడటం మన కర్తవ్యం''. సమస్య ఏమిటో గుర్తించే విషయంలో మన ధోరణిలో మార్పు రాకపోతే అది అసాధ్యం.

వీరప్పన్, ఫూలన్ దేవిలను హెచ్‌బీటీ ఒకే గాట కట్టిందనీ, వీరిద్దరి మధ్యా పోలిక ఏమిటని రమణమూర్తి మరో అభ్యంతరాన్ని లేవనెత్తారు వాస్తవానికి వీరిద్దరూ అనుభవించిన జీవితం, పీడనా ఒకేరకమైనవని ఎవ్వరూ అనజాలరు. వ్యవస్థకు సవాలుగా తయారై, ఏ ప్రభుత్వానికీ చిక్కకుండా తమ కార్యకలాపాలు యథేచ్ఛగా సాగించిన వాస్తవాన్ని పరిశీలిస్తే వీరిద్దరి మధ్యా వ్యక్తులుగా కాకపోయినా ఎదురు తిరిగిన తీరులో కొంత సారూప్యం కనబడకపోదు. లొంగుబాటుకు ముందు ఫూలన్ దేవి పైన కూడా పత్రికలన్నీ ఇంతే తీవ్రంగా దాడి చేశాయి. దొంగల రాణిగా, బందిపోటుగా, అడవి దొంగగా ఆమెనోకిరాతకురాలిగా చూపించాయి. ఆమె లొంగుబాటు తర్వాత మాలాసేన్ రాసిన ఆమె చరిత్ర, పాల్‌రాంబలి తదితరులకు ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూలు, శేఖర్ కపూర్ తీసిన సినిమా.. ఆమె జీవితానికి సంబంధించిన మరో పార్శ్వాన్ని, సమగ్ర చిత్రాన్ని ఆవిష్కరించాయి. అప్పటి వరకూ ఆమె అనుభవించిన పీడననూ, అణచివేతనూ బయట పెట్టాయి. అదే సమయంలో మరో వైపు ఊపందుకున్న దళిత ఉద్యమం దళిత జీవితం అంటే ఏమిటో, దళిత వాస్తవికత ఏమిటో ప్రపంచానికి బలంగా వివరించింది. అందునా నేడు దళిత మహిళగా జీవించటం అంటే ఏమిటో సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల దృక్కోణాలనుంచి విశ్లేషించి పాఠకుల ఆలోచనాధోరణిలో మార్పు అవసరమని నొక్కి చెప్పింది. ఇంత జరిగితేగానీ ఫూలన్ చెబుతున్న దేమిటో బయట ప్రపంచానికి అర్థం కాలేదు. ఇవాల్టికీ కొన్ని (దాదాపుగా అన్నీ) ప్రధాన స్రవంతి పత్రికలు ఆమెను (మాజీ) బందిపోటుగానే అభివర్ణిస్తుండటం గమనార్హం.

కాబట్టి వీరప్పన్ విషయంలో కూడా కొంత సంయమనం ,పాటించటం అవసరం. తొందరపడి ముద్రలు వేసేసి సంతోషిస్తే ఒరిగేది ఏమీ వుండదు. వీరప్పన్ గురించి రోజురోజుకూ సమాచారం వస్తూనే వుంది. ఆయన వ్యక్తిత్వం గురించి భార్య, పిల్లలు, అక్కడ ఉండి వచ్చిన బందీలు రకరకాల సమాచారం తెస్తున్నారు. తొందరపడి నిర్ణయాలకు రావటం కంటే నిదానంగా సమస్యను అర్థం

చేస్కోవటానికి ప్రయత్నించటం అవసరం.

చివరిగా - "అర్ధ సత్యాలు, వక్రీకరణలు, స్వోత్కర్షలతో నిండి ఉన్న వీరప్పన్ వాదనల్లో నిజానిజాలను సాధారణ పాఠకుడు ఎలా అర్థం చేస్కుంటాడు? ఒక వేళ తప్పు అవగాహనకీ, తప్పు అభిప్రాయాలకీ వస్తే, వీరప్పన్నే ఆదర్శంగా భావిస్తే దుష్ఫలితాలకు బాధ్యత ఎవరిదౌతుంది?" అని సమీక్షకులు ప్రశ్నించారు. నిజానికి సమీక్షకులు వీరప్పన్ గురించి ప్రధాన స్రవంతి పత్రికలు రాస్తున్న దాన్ని కూడా అంతే అనుమానంగా చూస్తే బాగుంటుంది. వీరప్పన్ వాదనల్లో సత్యాసత్యాలను నిగ్గుతేల్చాల్సిన అవసరం ఎంతుందో పత్రికా కథనాల్లోని (ఒక రకంగా పోలీసు ప్రభుత్వ కథనాల్లోని) సత్యాసత్యాలను కూడా అంతే తరచి చూడాల్సి వుంటుంది. పత్రికా కథనాల మీద సమీక్షకునికి మరీ ఎక్కువ విశ్వాసం ఉందేమోననిపిస్తోంది. ఒక వేళ వీరప్పన్ వాదనల్లో నిజాలు లేకపోలేదని వెల్లడైతే ఇన్నేళ్ళుగా పత్రికలు చేస్తున్న ప్రచారాల వల్ల సంభవించిన దుష్ఫలితాలకు బాధ్యత ఎవరిదౌతుందో ఆలోచించాల్సి ఉంది. లేకపోతే ఫూలన్‌కి జరుగుతున్న అన్యాయమే వీరప్పన్‌కీ జరుగుతుందని గుర్తించాలి. ఇవాల్టి ప్రజల మనసుల్లో ఫూలన్‌పై నాటుకుపోయిన ప్రతికూల భావాలకు బాధ్యత ఎవరిది? రాజకీయాలు నేరమయం అవుతున్నాయన్న మాట వినిపించిన ప్రతిసారీ ఫూలన్ పేరును ప్రస్తావించటం చూస్తూనే వుండికూడా మనం ప్రమాదాన్ని పసిగట్టలేకపోవటం శోచనీయం. భిన్నమైన, ఆలోచనాత్మక ధోరణిని ప్రోత్సహించేందుకు, 'గంధపు చెక్కల వీరప్పన్' పుస్తకం ఉపకరిస్తుందనే భావిస్తున్నాం. తెలుగు ఆలోచనను పరిపుష్టం చేస్తుందనే నమ్మకంతోనే ఈ పుస్తకాన్ని వెలువరించాం. ఈ విషయంలో మాకు ఎటువంటి అపనమ్మకాలూ లేవు.

- హైద్రాబాద్ బుక్ ట్రస్ట్‌తో పాటు వెంకట్

('విజయవిహారం', సెప్టెంబర్ 2000)

---

## <u>అనుబంధం - 3</u>

## సమీక్షకుని స్పందన

# వీరప్పన్ వ్యవస్థతో తలపడే వీరుడంటే ఇంక మాట్లాడేదేముంది?

"గంధపు చెక్కల వీరప్పన్" పుస్తకాన్ని గత సంచికలో సమీక్షించిన తర్వాత, అందుకు హైద్రాబాద్ బుక్ ట్రస్ట్ సమా ధానం పంపిస్తోందని తెలిసినపుడు నేను చాలా సంతోషించాను. బహుశా ఈ పుస్తకాన్ని తెలుగులోకి ప్రచురించింది హైద్రాబాద్ బుక్ ట్రస్ట్ కానట్లయితే విజయవిహారంలో అంతవివరంగా సమీక్షించడం సంభవించేది కాదేమో.

నా సమీక్షలో అనేక ప్రశ్నల్ని వివరంగా చర్చించాను, అందులో హైద్రాబాద్ బుక్‌ట్రస్ట్‌ని ఉద్దేశించి వేసిన సీరియస్ ప్రశ్నలు కూడా ఉన్నాయి. ఈ ప్రశ్నలకు హెచ్.బి.టి. సమాధానం ఏమిటో తెలుసుకుందామని ఉత్సాహంగా ఎదురు చూసిన నాకు ఆశాభంగమే ఎదురైంది.

# వీరప్పన్ చెప్పింది మార్చారని అంగీకరించినట్టేనా?

నేను సమీక్షలో చేసిన ఆరోపణల్లో అత్యంత ముఖ్యమైనది - వీరప్పన్ వాదనలో క్రూరత్వం పాలు తగ్గించి పాలిష్ చేశారని.
పుస్తకాన్ని సంక్షిప్తీకరించామని ప్రచురణ కర్తలు ముందే చెప్పారు సంక్షిప్తీకరణ అంటే పాలిష్ చేయడం అని అర్థం కాదు కదా!

వీరప్పన్ వెర్షన్‌లో క్రూరత్వం పాలు తగ్గించారని చెప్పే బలమైన క్లూని నేను పుస్తకం నుంచే తీసి చూపించాను.

ఈ పని నక్కీరన్ ఏ ప్రయోజనం ఆశించి చేసిందని అడిగాను. ఇది హైద్రాబాద్ బుక్‌ట్రస్ట్‌కి తెలిసే జరిగిందని అనుకోవచ్చా - అని కూడా ప్రశ్నించాను.

వీరప్పన్ వాదనలో క్రూరత్వం ఎలిమెంట్స్‌ని తగ్గించి, మార్చి రాయడమంటే అది అత్యంత అనైతిక చర్య అవుతుంది.

ఇంత ముఖ్యమైన ప్రశ్న పట్ల హైద్రాబాద్ బుక్‌ట్రస్ట్ తన సమాధానంలో మౌనం వహిస్తోందంటే, ఖండించట్లేదంటే - ఈ ఆరోపణను అంగీకరించినట్టుగా భావించవలసి వస్తోంది.

# నల్లకోతి రక్తం

"*వీరప్పన్ పదిహేను రోజులకో సారిగానీ స్నానం చెయ్యడనీ, నల్లకోతి కనబడితే కాల్చి చంపి, పచ్చిరక్తం గటగటా తాగేస్తాడని ఇటీవలే ఓ ప్రధాన స్రవంతి పత్రిక పెద్ద కథనాన్ని ప్రచురించింది. వాస్తవానికి ఇదంత ముఖ్యమైన సమాచారం కాకపోయినా వీరప్పన్ గురించి ఎన్ని అవాస్తవాలు, అబద్ధాలు ప్రచారంలోకి వస్తున్నాయో, పత్రికల్లో చెలామణీ అవుతున్నాయో అర్థం చేస్కోవటానికి ఈ చిన్న ఉదాహరణలు చాలు. వీరప్పన్‌ను స్వయంగా చూసి, తనతో కొన్ని రోజులు గడిపిన నక్కీరన్ బృందం వీరప్పన్ రోజూ స్నానం చేసి, ఆయుధాలను కడిగి పూజ చెయ్యనిదే దినచర్య ప్రారంభించడని చెబుతోంది.*" అంటున్నారు బుక్‌ట్రస్ట్‌వారు.

ఈ వార్త ఆగస్టు 13 నాటి 'ఈనాడు' పత్రికలోది. 'తమిళర్ విడుదలైపడై' తీవ్రవాదుల నించి ఈ సమాచారాన్ని పోలీసులు తెలుసుకున్నారని ఈ వార్తలో ఉంది.

ఈ వార్త నిజం కాకపోవచ్చునంటే అర్థం చేసుకోవచ్చు. కానీ ఇది అంత ముఖ్యమైన సమాచారం కాదని - బుక్‌ట్రస్ట్ వారు చెప్పడం మాత్రం ఆశ్చర్యమే

వీరప్పన్ చేసిన హత్యల్లోని అమానవీయ పద్ధతుల్ని గురించి గతంలో అనేక వార్తలు వచ్చాయి. (ఉదా: సారాబట్టీల్లో ఉడికించి చంపడం) స్వయంగా వీరప్పన్ వెర్షన్‌లో కూడా అతని క్రూరమైన శాడిస్టు పద్ధతుల ప్రస్తావన లేకపోలేదు. (ఉదా: శ్రీనివాస్‌ను కాల్చి తలను, చేతుల్ని నరికి, తలని తీసుకెళ్ళి జుట్టు కాల్చేడం, పుర్రెని అడవిలో పెట్టడం)

మనుషుల రక్తం తాగడం గురించి బెదిరింపులు (బెదిరింపులే కావచ్చు) ఉన్నాయి. (ఉదా: "...మనిషి రక్తం తాగితే విషం తలకెక్కి పిచ్చిలేస్తుందట. అయినా ఫరవాలేదు - నిన్ను కాల్చి నీ గుండెలోంచి ఓ చారెడు రక్తం తాగుతాను..." - పే.89)

వీరప్పన్ నల్ల కోతి పచ్చిరక్తం తాగుతాడనే వార్త అవాస్తవం కావచ్చునేమో కానీ అప్రధానం ఎలా అవుతుంది? - మానసిక ఆరోగ్యం సాధారణంగా ఉన్న ఏ వ్యక్తి పచ్చిరక్తం తాగాలనే కోరిక కలిగివుండడు. ఇటువంటి ధోరణులు ఒకవేళ నిజమైతే అతడి మానసిక స్థితిని తెలియజేసేవే

అవుతాయి.

కరడుగట్టిన నేరస్థుల్లో ఇటువంటి విపరీత ప్రవర్తనా పద్ధతులు ఉండటం అంత అరుదైన సంగతేమీ కాదు.

ఉదాహరణకి మన రాష్ట్రంలో ఆ మధ్య సంచలనం సృష్టించిన హుసేన్‌బీ భర్త హత్య కేసులో హంతకులు అతడి శిరస్సు ఖండించి, తర్వాత కళ్ళని దొలిచి, వాటిని తినాలనే కోరికతో కొంతకాలం తమతో ఉంచుకోవడం ఇటువంటి వికృత చేష్టే (ఈ కేసులో హంతకులు ఒక సందర్భంలో విప్లవకారుల ఇమేజి ఉన్నవాళ్ళే).

వీరప్పన్ నల్లకోతి రక్తం తాగుతాడనేది నమ్మితీరాలని చెప్పడానికి ఇదంతా రాయట్లేదు. అది అవాస్తవం కావచ్చంటే అర్థం ఉంది కానీ అప్రధానం అనడం సరికాదని చెప్పడానికే ఇది రాశాను.

## వీరప్పన్ స్నానం సంగతి

పై ప్రకటనలో వీరప్పన్ స్నానం సంగతి వచ్చింది. పత్రికలు వీరప్పన్ 15 రోజుల కొకసారి స్నానం చేస్తాడని రాశారని, నిజానికి నక్కీరన్ బృందం వీరప్పన్ రోజూ స్నానం చేస్తాడని చెపుతోందని బుక్‌ట్రస్ట్ వారు రాశారు. ఈ ఒక్క సంగతి బట్టే పత్రికల్లో ఎన్ని అబద్ధాలు వస్తున్నాయో తెలుసుకోవచ్చునని కూడా అన్నారు.

నక్కీరన్ బృందం వీరప్పన్ రోజూ స్నానం చేస్తాడని ఎక్కడ అన్నారు?

పుస్తకంలో అటువంటి ఉదాహరణ ఎక్కడ ఉంది?

పుస్తకంలో నక్కీరన్ బృందం ఏం చెపుతోందో చూడండి:

"వీరప్పన్‌కి దైవభక్తి ఎక్కువ. ప్రతీ రోజూ పొద్దున లేవగానే సూర్యనమస్కారాలు చేస్తాడు. తన ఆయుధాలను కడిగి పూజించుకుంటాడు." - (పే. 19)

ఇందులో ఎక్కడా రోజూ స్నానం ప్రసక్తిలేదు.

"అందరం స్నానపానాదులు ముగించుకున్నాం. వీరప్పన్ అప్పుడే పూజలు మొదలు పెట్టాడు. అతను ప్రతిరోజూ ఆయుధాలన్నింటినీ శుభ్రంగా కడిగి, పూజ చేశాకగాని ఆ తదుపరి కార్యక్రమాన్ని నిర్ణయించుకోడు."- (పే.17)

ఈ ఉదాహరణలో కూడా ఆ రోజు స్నానం చేసినట్టు ఉంది, ప్రతి రోజూ ఆయుధాలను కడగటం పూజలుచైడం ప్రసక్తి కూడా ఉంది కానీ ప్రతిరోజూ స్నానం చేస్తాడనే మాట లేదు. స్నానం చైకుండా పూజలెలా చేస్తాడు అనే లా పాయింట్ లాగితే వేరే విషయం, కానీ ప్రతి రోజూ వీరప్పన్ స్నానం చేస్తాడని నక్కీరన్ బృందం చెప్పినట్టు అర్థం వచ్చే మాటలు స్వయంగా బుక్‌ట్రస్ట్ ప్రచురించిన ఈ పుస్తకంలో డైరెక్ట్‌గా ఎక్కడా లేవు. పుస్తకంలో కాకుండా నక్కీరన్ బృందం ప్రైవేటుగా బుక్‌ట్రస్ట్‌కి ఈ విషయం చెప్పిందేమో మనకి తెలీదు. పుస్తకంలో అలా లేదు.

పుస్తకం సంగతి పక్కన పెడితే అడవిలో క్షణక్షణం స్థావరం మారుస్తూ ఓ పక్క వేలాది పోలీసుల వేటని తప్పించుకుంటూ తిరిగే వీరప్పన్ ప్రతీరోజూ రూల్‌గా స్నానం చేయడం ఎలా సాధ్యపడుతుంది?

అడవిలో నీటికి వాగులపైనా, నీటి చెలమల మీదా ఆధారపడాలి. అవి ఎక్కడ పడితే అక్కడ ఉండవు. రోజూ దినచర్య ప్రారంభించే ముందు స్నానం చేయడం కోసం వీరప్పన్ రోజూ ఉదయం ఏదోఒక నీటివనరు దగ్గిరకివెళ్ళడం రూల్‌గాపాటిస్తే, లేదా వాగుల్నీ, చెలమల్నీమాత్రమే అంటిపెట్టుకుని ఉండిపోతే తేలిగ్గా పోలీసులకిదొరికిపోయే ప్రమాదం ఉంది.

రోజూ ఆయుధాలు శుభ్రం చేయాలంటే అందుకు కొన్ని మగ్గుల నీరు సరిపోతుంది. తాగడానికీ,

ఇలాంటి చిన్న చిన్న అవసరాలకి నీటిని క్యారీ చేయడం సాధ్యమౌతుంది కానీ, ప్రతీరోజూ పొద్దున్నే దినచర్యలు ప్రారంభించే ముందే తప్పనిసరిగా స్నానం చేయడం కోసం బక్కెట్లు బక్కెట్లు నీళ్ళు మోసుకుంటూ అడవిలో వీరప్పన్ బృందం తిరుగుతుందని భావించడం సరికాదు.

వీరప్పన్ ప్రతీరోజూ స్నానం చేస్తాడు - అనే ఈ ఒక్క ఉదాహరణ బుక్‌ట్రస్ట్ వారు చెప్తున్నట్టుగా - పత్రికలు రాసే అబద్ధాలు (రాయరని కాదు) బయటపెడుతుందో లేదో తెలీదు కానీ, బుక్‌ట్రస్ట్‌వారి వాదనలు సమగ్రంగా లేవని అర్థం చేసుకోవడానికి మాత్రం చక్కగా పనికి వస్తుంది.

రాజ్‌కుమార్ కిడ్నాప్‌కి వీరప్పన్ పన్నిన పథకం, పడిన శ్రమ గురించి నక్కీరన్ గోపాల్ కథనం - ఆగస్టు 27 నాటి డక్కన్‌క్రానికల్ పత్రికలో వచ్చింది. రాజ్‌కుమార్‌ని కిడ్నాప్ చేసేందుకు గాజమారులోని అతని గెస్ట్‌హౌస్ పరిసరాల్లో 24 రోజులపాటు కేవలం 6 లీటర్ల నీళ్ళు, బిస్కట్లతో వీరప్పన్ కాలక్షేపం చేశాడని స్వయానా నక్కీరన్ గోపాలే వెల్లడించారు.

పదిహేను రోజులు స్నానం చేయలేదని రాసిన పత్రిక - అబద్ధమే రాసిందని కోప్పడిన బుక్‌ట్రస్ట్‌వారు, నక్కీరన్ గోపాల్ అబద్ధాలు చెప్తున్నాడని అంటారా లేకపోతే 6 లీటర్ల నీళ్ళతో 24 రోజులు ప్రతిరోజూ స్నానం చేస్తూ సర్దుకోవడం సాధ్యమని వాదిస్తారా?

# ఏనుగుల లెక్క

*"200 ఏనుగులను చంపాడనీ, 100 కోట్ల రూపాయల దంతాలు, చందనం స్మగ్లింగ్ చేశాడనీ పత్రికలన్నీ ఘోషిస్తున్నాయి. మొత్తం మీద తాను చంపిన ఏనుగుల సంఖ్య పదుల సంఖ్య దాటదనీ, తాను స్మగ్లింగ్ చేసింది 11 నెలలేననీ, అందులో తనకు పెద్దగా దక్కింది కూడా ఏమీలేదనీ వీరప్పన్ అంటున్నాడు. ఎవరెవరిని ఎలా చంపిందీ వివరంగా చెబుతూ నిర్భయంగా అన్నీ చెబుతున్న వీరప్పన్ ఈ విషయంలో అబద్ధం ఆడాల్సిన అవసరం ఉంటుందా"*- అని పాయింటు లేవదీశారు బుక్‌ట్రస్ట్ వారు. మొదటి విషయం పత్రికలు 200 ఏనుగులని కాదు - 2000 ఏనుగులని రాస్తున్నాయి. పదమూడేళ్ళ వయసుకే మొదటి ఏనుగుని వేటాడిన వీరప్పన్ 1980 నాటికే 300 ఏనుగులని చంపేశాడని రాస్తున్నాయి.

సరే, ఇదంతా వాస్తవంగా తీసుకోవల్సిన అవసరం లేదు.

కానీ "తాను చంపిన ఏనుగుల సంఖ్య పదుల సంఖ్య దాటదనీ..." వీరప్పన్ చెప్తున్నాడని బుక్‌ట్రస్ట్‌వారు రాశారు.

సాధారణంగా 'పదులు' - అంటే 20కి పైన 100కి లోపు అని అనుకుంటాం.

కానీ వీరప్పన్ పుస్తకంలో ఏం చెప్తున్నాడు? బుక్‌ట్రస్ట్ చెప్పినట్టు "పదుల సంఖ్య"లో ఏనుగులని చంపానని చెప్తున్నాడా?

"నా బతుకు తెరువు కోసం ఐదుపది ఏనుగులను చంపి ఉంటాను అంతే." - (పే.93)

"నా కడుపు కోసం ఐదో పదో ఏనుగులను చంపాను" - (పే.94)

మరి "ఐదో పదో" ఏనుగులు అంటే "పదుల సంఖ్య"లో అని చెప్పినట్టే అర్థమా? పత్రికలది ఓ అంకె, ప్రభుత్వానిదీ, పోలీసులదీ ఓ అంకె, వీరప్పన్‌ది ఓ అంకె - ఇప్పుడు కొత్తగా బుక్‌ట్రస్ట్‌ది మరో అంకె అయితే ఎలా?

2000 కాదు, 200 కాదు వీరప్పన్ కేవలం "ఐదో పదో" ఏనుగులని చంపాడని, బుక్‌ట్రస్ట్ అభిప్రాయమా?

పదమూడేళ్ళ వయసులో మొదట తుపాకీ పట్టాననీ, పధ్నాలుగేళ్ళకే భయంకరమైన వేటగాడిగా

మారాననీ వీరప్పన్ చెప్పుకున్నాడు.

"ఆ తరువాత నేను పెద్ద ఎత్తున వేటాడాను" - (పే.22) అని కూడా చెప్పాడు.

పుస్తకం అంతటా అనేకసార్లు ఏనుగు దంతాల ప్రసక్తి వస్తుంది. దంతాలని అమ్మబోయి వీరప్పన్ అనుచరుడు ఇన్ఫార్మర్‌కి దొరికిపోయిన ఉదంతం ఉంది. దంతాలని అమ్మడానికి వచ్చినట్టు నాటకం ఆడి షకీల్ అహ్మద్ అనే ఇన్‌స్పెక్టర్‌ని చంపేసిన సంగతి ఉంది. వీరప్పన్ తను పట్టుబడినపుడు "నా ఏనుగు దంతాలన్నీ అప్పటికే బొమ్మలుగా మారి అమెరికాకు తరలి వెళ్ళిపోయి ఉంటాయి. పోతే పోనీయ్" (పే.28) అనుకుంటాడు. ఆ రోజుల్లో ఏనుగు దంతాల వ్యాపారంపై నిషేధం వచ్చిందనీ, ఆ వ్యాపారాన్ని అన్ని దేశాలు అడ్డుకున్నాయనీ, దంతాలను ఎవరూ కొనడం లేదనీ, ధరలు బాగా పడిపోయాయనీ - వీరప్పన్ బాధపడతాడు.

పుస్తకం చివర్న తను ఐదోపదో ఏనుగులని చంపానని అంటాడు. 40 సంవత్సరాల్లో ఐదో, పదో ఏనుగుల్ని మాత్రమే చంపిన వాడు అలా మాట్లాడడని మనకి మామూలుగానే అర్థం అవుతుంది. (ఇదే వీరప్పన్ 1993 నాటి ఇండియాటుడే/నక్కీరన్ ఇంటర్వ్యూలో "నా దగ్గర ఏనుగు దంతాలు కుప్పలు తెప్పలుగా ఉన్నా వాటిని ఏ మాత్రం అమ్ముకోలేని స్థితి" అని ఒక సందర్భంలో తన పరిస్థితి గురించి చెప్పాడు.

ఈ ఏడాది మొదట్లోనే వీరప్పన్ అనుచరులు తాజాగా 7 జతల ఏనుగు దంతాలను అమ్మబోతూ పట్టుబడ్డారని పత్రికలు రాశాయి. )

అందుకే "ఐదో పదో" అనే అంకెని బుక్‌ట్రస్ట్ వారే నమ్మలేక, దాన్ని "పదుల సంఖ్య" అని చెప్పుకోవాల్సి వచ్చింది (లేకపోతే "పదుల సంఖ్య" అని వీరప్పన్ చెప్పినదాన్ని బుక్‌ట్రస్ట్ వారు పుస్తకంలో "ఐదో పదో" అని మార్చలేదు కదా?)

అతనికి "ఈ విషయంలో అబద్ధం ఆడాల్సిన అవసరం ఉంటుందా?" అని బుక్‌ట్రస్ట్ ప్రశ్న.

హత్యల్ని తన "వీరత్వం"లో భాగంగా భావిస్తున్నాడు కాబట్టి చెప్తున్నాడు. అంత మాత్రాన ఇక అతను అబద్ధమే ఆడని హరిశ్చంద్రుడైపోయినట్టేనా?

పుస్తకం ముందుమాటలో "వీరప్పన్ చెప్పినవన్నీ అక్షర సత్యాలుగా పరిగణించ నవసరం లేదు" అని చెప్పిన బుక్‌ట్రస్ట్ ఇప్పుడు "వీరప్పన్‌కి ఈ విషయంలో అబద్ధం ఆడాల్సిన అవసరం ఉంటుందా?" అంటే ఏం చెప్పాలి?

వీరప్పన్ వాదనల్లో ఎన్ని వైరుధ్యా లున్నాయో నేను పుస్తక సమీక్షలో వివరంగానే రాశాను. దానిపై బుక్‌ట్రస్ట్ చెప్పిన సమాధానం ఏదీ లేదు.

మాట్లాడితే తాను రాజకీయాల్లోకి వస్తాననీ, ప్రధానిని అవుతాననీ తన రాజకీయ ఆశలు, కోరికలు చెప్పుకుంటాడు వీరప్పన్. అటువంటి ఆశలున్న వ్యక్తి తన నేరాల్ని తగ్గించి చెప్పుకోవడం, జస్టిఫై చేసుకోవడం అత్యంత సహజం. అతను అక్షరమక్షరం నిజమే చెపుతాడనీ, "అబద్ధం ఆడాల్సిన అవసరం ఉంటుందా?" అని బుక్‌ట్రస్ట్ నమ్మకం పెట్టుకుంటే - ఏం వ్యాఖ్యానించగలం?

## చర్చించడం వ్యర్థమా?

బుక్‌ట్రస్ట్ సమాధానంలో అత్యంత అభ్యంతరకరమైన, అప్రజాస్వామికమైన అన్యాయమైన మాట- "శ్రీనివాస్ నిజాయితీ గల అధికారా? కాదా? అన్నది చర్చించడం వ్యర్థం" అన్నదే.

వీరప్పన్ గురించి చర్చించడం, ఆయన వాదనల్ని వినడం మాత్రమే అవసరమా? శ్రీనివాస్ గురించి చర్చించడం వ్యర్థమా?

ఈ తర్కంలోని ఇంగితాన్ని బోధపరుచు కోవడం నాకు కష్టంగానే ఉంది.

## అవి నా మాటలు కావు

"ఒక శ్రీనివాస్‌ను ఇప్పటికే కోల్పోయాం. అటువంటి శ్రీనివాస్‌లు వందలకొద్దీ బలవ్వకుండా చూడటం మన కర్తవ్యం" అనే మాటని కోట్స్‌లో పెట్టి రాశారు. ఈ మాటలన్నది ఎవరో నాకు తెలీదు. ఈవాక్యం నా సమీక్షలోదైతే కాదు. సాధారణంగా ఒక ఆర్గ్యుమెంటు రాసేటప్పుడు మన మాటల్ని మనమే కోట్స్‌లో పెట్టుకోము. వక్కాణింపు చేర్చాల్సి వస్తే కింద గీతలు పెడతాము. హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ఈ మాటల్ని కొటేషన్లో ఏ అర్థం గురించి పెట్టినా, అత్యధిక శాతం పాఠకులకి వాటిని నా సమీక్ష నుంచి తీసుకున్నారనే అభిప్రాయం కలుగుతుందనే ఈ వివరణ ఇవ్వాల్సి వస్తోంది.

## నాపై ఆరోపణ

"పత్రికా కథనాల మీద సమీక్షకునికి మరీ ఎక్కువ విశ్వాసం ఉందేమోననిపిస్తోంది" అని హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ వారు నాపై ఒక విసురు విసిరారు.

నా సమీక్షలో ప్రధానంగా శ్రీనివాస్ గురించి చెప్పాల్సివచ్చినప్పుడే 1993 నాటి పత్రికా కథనాలను నేను కోట్ చేశాను. మిగతా సమీక్ష అంతటా దాదాపుగా పుస్తకంలోని ఉల్లేఖనలే కనిపిస్తాయి.

పత్రికా కథనాలని యథాతథంగా నమ్మక్కర్లేదనే స్పృహ ఉంది కాబట్టే నేను వాటిని వీలైనంతవరకూ ప్రత్యేకంగా కోట్స్ రూపంలో చూపి, తేదీలు, సంచికలతో సహా వివరంగా ఇచ్చాను.

అక్కడితో ఊరుకోకుండా మళ్ళీ "ఇక్కడ శ్రీనివాస్ గురించి నేను చెప్తున్న వివరాలన్నీ ఆయా కాలాల్లో పత్రికల వార్తా కథనాలనుంచే తీసుకున్నాను. ఇదే సంపూర్ణ సత్యం అని నేననట్లేదు" అని కూడా ప్రత్యేకంగా రాశాను.

నిజానిజాలని పరిశోధించాలని, శ్రీనివాస్ పై తులనాత్మక పరిశీలన అవసరం అని స్పష్టంగా చెప్పాను.

అయినా పత్రికల కథనాలపై నాకు మరీ ఎక్కువ విశ్వాసం ఉందేమోనని - ఇప్పుడు బుక్‌ట్రస్ట్ ఆరోపిస్తోందంటే ఏమనుకోవాలి? బుక్‌ట్రస్ట్ "వ్యర్థం" అని భావించే 'శ్రీనివాస్‌పై చర్చను, నేను లేవనెత్తినందుకే నాపై ఇటువంటి వ్యాఖ్య చేస్తోందని అనుకోవాలా?

## అడవుల్లో జీవించే ప్రజలు

"*అడవుల్లో జీవించే ప్రజల జీవన విధానాలను, ఆకలి దప్పులను, అవసరాలను ఆకళింపు చేస్కోకుండా వేరే ఎక్కడో కూర్చుని చట్టాలు చేస్తే వాటి పర్యవసానాలను తామెందుకు అనుభవించాలన్న ధోరణి వీరప్పన్ మాటల్లో స్పష్టమవుతోంది*" అంటారు బుక్‌ట్రస్ట్‌వారు.

వీరప్పన్ గిరిజనుడూ కాదు, ఆదివాసీ కాదు. సాంఘిక వివక్షకు గురైన దళితుడూ కాదు.

వేట తప్పు ఎలా అవుతుందనీ,

ఏనుగులు చంపితే తప్పేమిటనీ,

గంధపు చెక్కలు అడవిలో పడి ఉన్నాయి కాబట్టి కొట్టి అమ్ముకుంటే తప్పేమిటని అక్కడక్కడా చెదురుమదురుగా ఈ పుస్తకం అంతటా కనిపించే వీరప్పన్ వాదనలు, మాటలు అడవుల్లో జీవించే ప్రజలందరి డిమాండ్లు ఎలా అవుతాయి?

ఇటువంటి కోరికల్ని ఏ ప్రభుత్వం అంగీకరించ గలుగుతుంది?

ఇంతకంటే చిత్రమైన సంగతి - హైదరాబాద్ బుక్‌ట్రస్ట్‌కి వీరప్పన్ "వ్యవస్థతో తెగించి మరీ తలపడే" వీరుడుగా కనిపించడం.

## ఈ 'వ్యవస్థ సిద్ధాంతం' అంటే - మరో 'కర్మ సిద్ధాంతం' కాదుకదా?

వీరప్పన్, శ్రీనివాస్‌లని వ్యక్తులుగా కాకుండా "ఈ వ్యవస్థలో జరుగుతున్న విస్తృత ఘర్షణల్లో పనిముట్లుగా" చూడాలని హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ చెపుతోంది.

నిజమే, వ్యక్తులు తప్ప వ్యవస్థ అనేదేమీ లేదు - అని వాదించడం ఎంత తెలివి తక్కువతనమో, వ్యక్తులకి స్వతంత్ర పాత్ర, చొరవ అంటూ ఏదీ లేదని అందరూ వ్యవస్థ చేతిలో పనిముట్లేనని వాదించడం కూడా అంతే అసమగ్రధోరణి అవుతుంది.

వ్యవస్థ 'సర్వవ్యాపకత్వం' గురించీ, 'అనుల్లంఘనీయత'ని గురించీ పెట్టే వాదనల్లో వ్యక్తుల వైవిధ్యత, చొరవ, స్వతంత్ర పాత్రకి సంబంధించిన స్పృహ లోపిస్తోంది.

సమిష్టి ఆచరణ గురించి, వర్గాలని గురించి, వ్యవస్థని గురించీ వాదనలు చాలావరకూ వామపక్ష వాదులే చేస్తున్నారు. (వ్యక్తులు వ్యవస్థ చేతిలో పని ముట్లేనని, వాదించే వామపక్ష తీవ్రవాదులు - ఆ పనిముట్లలాంటి వ్యక్తులని నిర్మూలిస్తే వ్యవస్థ మారదనే విషయం మర్చిపోయి - వర్గశత్రు నిర్మూలన పేరిట - వ్యక్తుల్ని నిర్మూలించే పనికి పూనుకోవడం మరో చిత్రం - సరే, అది ఇక్కడ అప్రస్తుతం).

'వ్యవస్థ' వాదాన్ని మరీ అతిగా తీసుకుంటే అది వర్తించనిది ఎవరికి?

దావూద్ ఇబ్రహీం, దారాసింగ్ లాంటి వారందరికీ ఈ వాదాన్ని వర్తింపచేయొచ్చా?

'నేరం', 'హింస' వంటి భావాల్ని 'మూలాలతోసహా సమస్యాత్మకం' చేస్తూపోవ డమేనా? అసలు ఏ నేరాలకీ శిక్షలు అవసరం లేదా?

అన్ని బాధలకి గతజన్మలోని కర్మఫలం కారణమని చెప్పే కర్మ సిద్ధాంతానికీ, హతుడూ హంతకుడూ ఆత్మేనని చెప్పే వేదాంతానికి, అందరూ వ్యవస్థ చేతిలో పనిముట్లేననే ఈ వాదానికి పోలికలు చూడకుండా వుండలేక పోతున్నందుకు నన్ను క్షమించాలి.

అడవిలో ఏనుగులవేట మొదలుపెట్టి ఆ తర్వాత స్మగ్లింగ్ చేపట్టి, అడ్డొచ్చిన వాళ్ళని హతం చేస్తూ కరడుగట్టిన క్రిమినల్‌గా మారిన వ్యక్తి - వీరప్పన్. అతడిలో "వ్యవస్థతో తెగించి మరీ తలపడే" వీరుడ్ని చూడటం హైదరాబాద్ బుక్‌ట్రస్ట్‌కే చెల్లింది.

మనదేశంలో పోలీసు వ్యవస్థ చాలా దుర్మార్గంగా తయారు కావడం కనిపిస్తూనే ఉంది. పెద్ద పెద్ద నగరాల్లో కూడా సామాన్యుడు న్యాయంకోసం పోలీసు స్టేషన్ల దగ్గిరకి వెళ్ళే సాహసం చేయలేని స్థితి ఏర్పడింది. నిజం రాబట్టే పేరిట ప్రాణాలు తీయడం, ఆడవాళ్ళపై అత్యాచారాలు చేయడం పోలీసు శాఖలో సాధారణం ఐపోతోంది. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం.

నగరాల్లో పోలీసుల నిర్వాకమే ఇలా ఉంటే అడవుల్లో వీరప్పన్ వేటకి వెళ్ళి ఇళ్ళకి దూరంగా ఉంటూ, నిత్యం టెన్షన్‌తో ఉండే పోలీసులు - అక్కడి ప్రజల మానప్రాణాలకి కంటకులుగా మారడం కూడా ఊహించగలిగే సంగతే. ఇది చాలా దారుణం. ఇలాంటి దుర్మార్గాల్ని వెలుగులోకి తేవాలి. ఖండించాలి. ప్రజలకి న్యాయం జరగాలి. బాధ్యులైన పోలీసులకి శిక్షలు పడాలి. పోలీసు వ్యవస్థ అటువంటి అమానవీయ పద్ధతులకి స్వస్తి చెప్పాలి. అటువంటి స్పృహ అందరిలోనూ కలిగేందుకు మనం తప్పనిసరిగా కృషి చేయాలి.

ఇందులో - పోలీసు అత్యాచారాల్ని ఖండించడానికి వీరప్పన్‌ని హీరోని చేయక్కర్లేదు. అలాగే వీరప్పన్ దుర్మార్గాన్ని విమర్శించేందుకు పోలీసుల పక్షం వహించాల్సిన అవసరం కూడా లేదు.

వీరప్పన్ వాదనని ఎవరూ బయటకి తీసుకు రాకూడదనే అభిప్రాయం నాకు లేదు. ఒక వ్యక్తి వాదన ఎప్పుడూ, ఎలాగా బయటకి రాకూడదని చెప్పడం సరైనది కాదు. నా అభ్యంతరమల్లా వీరప్పన్‌ని హీరో చెయ్యకూడదనే.

## హింసనీ, నేరాన్నీ వ్యతిరేకించాలి!

*"పోలీస్ అకృత్యాలని అర్థం చేసుకోవడానికీ, వ్యవస్థలో లోపాల్ని బయట పెట్టడానికీ వీరప్పన్ చెప్పిందల్లా ఎటువంటి క్రిటికల్ రిమార్క్ లేకుండా ప్రచురిస్తుంటే - వీరప్పన్ అత్యంత న్యాయమైన, ఆదర్శమైన వ్యక్తనే అభిప్రాయం, అతడిపట్ల అతడి పద్ధతుల పట్లా ఆరాధనాభావం వ్యాప్తి కావా?...*

*.....అర్ధసత్యాలు, వక్రీకరణ, స్వోత్కర్షలతో నిండి వున్న వీరప్పన్ వాదనల్లో నిజానిజాలను సాధారణ పాఠకుడు ఎలా అర్థం చేసుకోగలడు?*

*ఒక వేళ తప్పు అవగాహనకీ, తప్పుడు అభిప్రాయాలకీ వస్తే, వీరప్పనే ఆదర్శంగా భావిస్తే జరిగే దుష్ఫలితాలకి బాధ్యత ఎవరిదౌతుంది?"*

అని నేను సమీక్షలో రాశాను. అదేమాట ఇప్పుడూ అంటున్నాను. ఇటీవలి రాజ్‌కుమార్ కిడ్నాప్ ఉదంతంలో దిగ్భ్రాంతి కలిగించే సంగతేమిటంటే ఆ కిడ్నాప్‌ని ఎవరూ ఖండించకపోవడం.

వీరప్పన్‌కి పోలీసులకీ మధ్య జరిగే పోరాటానికీ రాజ్‌కుమార్‌కీ సంబంధం ఏమిటి?

తాము న్యాయం అనుకున్న దానికోసం లేదా ప్రయోజనాల్ని సాధించుకోవడం కోసం వ్యక్తుల్ని కిడ్నాప్ చేయడం, లేదా హత్య చేయడం ఇవ్వాళా రేపూ ఖండనార్హం కాకుండా పోయింది. తప్పుకాకుండా పోయింది. ఇది చాలా ఘోరమైన పరిస్థితి.

స్వతంత్ర భారత దేశం ఏనాడూ చూడని కనీవినీ ఎరుగని అత్యంత గొప్ప రాష్ట్రపతిగా, మానవతావాదిగా మన రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ ఇప్పటికే పేరు తెచ్చుకున్నారు. ప్రతిభ కొన్ని కులాల గుత్తసొత్తని మూర్ఖంగా వాదించే ఛాందస వాదులకి - రాష్ట్రపతి పదవికే ఇప్పుడు కొత్త శోభ తెస్తున్న కె.ఆర్. నారాయణన్ పనితీరు చక్కటి సమాధానమౌతుంది. సున్నితమైన సమస్యలపై చక్కగా స్పందించే విషయంలో మానవతావాదిగా నారాయణన్ తన ప్రత్యేకతని అనేక సందర్భాల్లో నిరూపించుకున్నారు.

వీరప్పన్ సమస్యని పరోక్షంగా ప్రస్తావిస్తూ మొన్న అగస్టు 15న రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ సున్నితంగా చేసిన వ్యాఖ్యలు - ఇటువంటి బాధ్యతనే మనకి గుర్తు చేస్తున్నాయి.

నేరగాళ్ళని మీడియా హీరోల్లా చిత్రీకరించడాన్ని నారాయణన్ తప్పుబట్టారు. అన్ని రకాల నేరాలు, హింసకి వ్యతిరేకంగా సామాజికంగా, రాజకీయస్థాయిలో ఉద్యమించాల్సిన సమయం ఇదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంతకంటే సమతూకమైన స్పందన ఏముంటుంది?

చివరగా ఒకమాట - వీరప్పన్‌ని హైద్రాబాద్ బుక్‌ట్రస్ట్ "వ్యవస్థతో తెగించి మరీ తలపడే" వీరుడిగా చూస్తోందన్న సంగతి పుస్తకంలో ఎక్కడా చెప్పకపోవడం వల్ల సమీక్షలో బుక్‌ట్రస్ట్‌ని ఉద్దేశించి అనేక ప్రశ్నలు అడిగాను.

ఇప్పుడు ఆ విషయం తెలిశాక ఇంక హైద్రాబాద్ బుక్‌ట్రస్ట్‌ని అడిగేందుకు నా దగ్గర ప్రశ్నలేవీ లేనట్టే.

**('విజయవిహారం', సెప్టెంబర్ 2000)**

## సమైక్య, ప్రశాంత, వికసిత భారతదేశం లక్ష్యంగా

# జై భారత్

వంద కోట్ల ప్రజలున్న దేశం. అపారమైన సహజవనరులున్నాయి. అయినా మన దేశం శక్తివంత మైన దేశం కావడంలేదు. అగ్ర రాజ్యం అనిపించుకోవడం లేదు.

ఈ బలహీనతకి కారణం ఏమిటి?

ప్రజలందరి కనీస అవసరాలు తీరి, దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే, మన దేశం బలమైన దేశం కావాలంటే .. ఎలా సాధ్యం?

భిన్నమైన భాషలకి, భిన్నమైన మతాలకి, భిన్నమైన ఆచార వ్యవహారాలకి, భిన్నమైన సంస్కృతులకి, సంప్రదాయాలకి, విభిన్నమైన ఆలోచనలకి, స్వప్నాలకి – అనాదిగా సంగమం మన భారత దేశం. 'ఏకం సత్ విప్రా బహుధా వదన్తి' అని మన పెద్దలు ఏనాడో బహుళత్వానికి పెద్ద పీట వేశారు.

ఇవ్వాళ మన దేశం మత విద్వేషపు మంటల్లో మాడిపోతూఉంది. కులాల ఊబిలో కూరుకుపోయి ఉంది. అవినీతి, అక్రమాలతో లుక లుకలాడిపోతోంది. మన దేశంలో సంపద, వనరులపై అధిపత్యం, సామాజిక ఆధిక్యత కేవలం కొన్ని సెక్షన్ల ప్రజలచేతుల్లోనే కేంద్రీకృతమైన పరిస్థితి ఉంది. దేశంలో సగభాగమైన స్త్రీల పట్ల మన సమాజంలో చిన్నచూపు ఉంది. దేశంలో అనేక ప్రాంతాల, అనేక విభాగాల ప్రజలకి అభివృద్ధి చెందడానికి ఎటువంటి అవకాశాలూ కల్పించబడటం లేదు.

ఇటువంటి పరిస్థితుల్లో – మన దేశాన్ని బలపరచాలంటే, శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దాలంటే – అది అణుబాంబుల ద్వారానో, క్షిపణుల ద్వారానో అయ్యే పని కాదు. కేవలం మన ప్రజల్ని ఐక్య పరచడం ద్వారా, పరిస్థితుల్ని మార్చుకోవడం ద్వారా మాత్రమే సాధ్యం.

సరిగ్గా ఇదే ఆశయంతో, "బలమైన భారతదేశం అంటే – సమైక్యమైన భారత దేశం, అది కుల అంతరాలకి, మత విద్వేషాలకి, అవినీతి, అక్రమాల జాడ్యాలకి తావులేని భారత దేశం" అనే నినాదంతో – ప్రారంభమైంది "జై భారత్ " ఉద్యమం.

4 సంవత్సరాలుగా "విజయ విహారం" పత్రిక పోరాడుతున్న విలువలకోసం – సంఘటితమై కృషి చేయాలన్న సంకల్పమే – "జై భారత్" ఆవిర్భావానికి మూలం.

ఐదు వేళ్ళు కలిస్తేనే శక్తి వంతమైన పిడికిలి వచ్చేది. వట్టి ఏకత్వం కాదు, 'భిన్నత్వంలో ఏకత్వం' అనేదే మన సమైక్యతా మంత్రం.

మన దేశాన్ని – అగ్ర రాజ్యంగా, బలమైన రాజ్యంగా, అభివృద్ధి సాధించిన రాజ్యంగా, ఆ అభివృద్ధి ఫలితాలను మన ప్రజలంతా అందుకునే రాజ్యంగా, శాంతి, సమైక్యతలు విలసిల్లే రాజ్యంగా మార్చుకోవాలంటే

– మత విద్వేషాలని మన నేల మీదనుంచి బహిష్కరించాలి!

– కులనిర్మూలన జరగాలి!

– అవినీతి, అక్రమాలకి అడ్డుకట్ట పడాలి!

– అందరికీ సమాన అవకాశాలు కల్పించబడాలి!

'విజయవిహారం' పత్రిక పోరాడుతున్న ఈ విలువల ప్రాతిపదికగా, 'విజయవిహారం' పాఠకులు నిర్మించుకుంటున్న "జై భారత్" ఉద్యమంలో మీరూ భాగస్వాములు కావచ్చు.


మరికొన్ని వివరాలకు మీ సమీపంలోని "జై భారత్" శాఖను, లేదా రాష్ట్ర కేంద్రాన్ని సంప్రదించండి.


– జై భారత్ C/o. విజయవిహారం, 12-5-33/2, విజయపురి, తార్నాక,
సికింద్రాబాద్ - 500 017. ☎ 040-27007053, ఫాక్స్: 040-27002240

# అవసరాలకు ఆధారపడదగిన
# నమ్మకమైన నేస్తం - జనహర్ష చిట్‌ఫండ్

**పొదుపు కోసం, ప్రగతి కోసం - జనహర్ష చిట్స్**

రు. 20,000/- నుంచి రు. 5,00,000/- వరకు షార్ట్‌టర్మ్, మిడ్‌టర్మ్, లాంగ్‌టర్మ్ గ్రూపులు వివరాలకు సమీపంలోని జనహర్ష బ్రాంచినిగానీ, జనహర్ష మార్కెటింగ్ / కలక్షన్ సిబ్బందినిగానీ సంప్రదించండి!





**JANAHARSHA**
**CHITFUND PVT. LTD.**

#12-5-33/2, Vijayapuri, TARNAKA,
Secunderabad - 500 017. Ph. 27015918

## రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నం మండలం గ్రామీణుల జీవితాల్లో




## 'జనహర్ష ఫౌండేషన్' ద్వారా కొత్త వెలుగు



జనహర్ష - జోతిబా పూలే వృద్ధజన సంక్షేమ పథకం'
జనహర్ష - సావిత్రిబాయి పూలే వితంతు సంక్షేమ పథకం'

✿ రంగారెడ్డిజిల్లా, ఇబ్రహీం పట్నం మండలంలోని కనీసం 1000 మంది లబ్ధిదారులకు ఈ పథకాల ద్వారా లబ్ధి చేకూరాలని 'జనహర్ష ఫౌండేషన్' లక్ష్యంగా నిర్దేశించుకుంది. ✿ గ్రామీణ నిరుపేద వృద్ధులకునెలకు రూ.75/- లను, గ్రామీణ వితంతువులకు నెలకు రూ.40/- లను అందించాలని, నెలనెలా ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించాలని సంకల్పించారు. ✿ స్పాన్సరర్లుగా పాల్గొనదలచిన మిత్రులు, జనహర్ష కార్యాలయాలను సంప్రదించండి.



జనహర్ష

JANAHARSHA FOUNDATION
PEOPLE WITH COMMITMENT

ఫౌండేషన్